www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 27-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 133 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా 1.34 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి మ. 3.38 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ. 7.43-9.18, రా 9.17-10.54; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.22, రా. 10.16-11.01; అమృతఘడియలు: మ. 12.28-2.03; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యూపీఐ తరహాలో యూఎల్ఐ



రుణాల కోసం తీసుకురానున్న ఆర్బీఐ

ఒక్క సమ్మతితో వెంటనే మంజూరు

ప్రస్తుతం 2 రాష్ట్రాల్లో.. త్వరలో దేశవ్యాప్తం

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

2

రూ.35కే క్షయ పరీక్ష

కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐసీఎంఆర్

మూడు దశల్లో వ్యాధి నిర్ధారణ

రెండున్నర గంటల్లో 1500 శాంపిల్స్ పరీక్ష



సీఎం చంద్రబాబు కోసం వస్తూ శనివారం పుణె వద్ద కుప్పకూలిన హెలికాప్టర్. గాయపడ్డ పైలట్

సీఎం భద్రత 'గాలి'లో దీపమా?

బాబుకు కేటాయించిన హెలికాప్టర్‌పై సందేహాలు

- ముంబై నుంచి వస్తూ పుణె వద్ద కుప్పకూలింది
- నిబంధనల ప్రకారం పదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నదాన్ని అద్దెకు తీసుకోరాదు
- అయినా 2008 మోడల్‌కు అనుమతి
- ఏవియేషన్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- హెలికాప్టర్ పనితీరు అంచనాలో నైపుణ్యలేమి
- తక్కువ ఎత్తులోంచి కూలినా పూర్తిగా ధ్వంసం
- చంద్రబాబు ఉన్నప్పుడు జరిగి ఉంటే?

గత శనివారం ముంబై నుంచి విజయవాడకు వస్తూ పుణె వద్ద ఓ హెలికాప్టర్ కుప్పకూలిన విషయం గుర్తుందా? అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. అయితే దిగ్భ్రాంతి కలిగించే విషయం ఏంటంటే... ఈ హెలికాప్టర్‌ను ఏవియేషన్ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం తెప్పిస్తున్నారు. ఒకవేళ చంద్రబాబు ప్రయాణించే సమయంలో ప్రమాదం జరిగి ఉంటే...? ఈ ఊహే తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తోంది!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జెడ్‌ప్లస్ కేటగిరి రక్షణ ఉన్న ముఖ్యమంత్రి, సీనియర్ నాయకుడి భద్రత విషయంలో అధికారుల నిర్లక్ష్యం విస్పష్టంగా బయటపడింది. సామర్థ్యం పరిశీలించకుండా, నిబంధనలకు భిన్నంగా 16 ఏళ్ల నాటి హెలికాప్టర్‌ను తెప్పించారు. సాధారణంగా ముఖ్యమంత్రి ప్రయాణించే వాహనాల కాన్వాయ్ నుంచి హెలికాప్టర్ వరకు ప్రతిదీ పరిశీలించి, సురక్షితమని నిర్ధారించుకున్న తర్వాతే వినియోగిస్తారు. కానీ చంద్రబాబుకు కేటాయించిన హెలికాప్టర్ విషయంలో ఉన్నతాధికారుల ఉదాసీనతపై


మిగతా 12వ పేజీలో...



చంద్రబాబు కోసం ప్రత్యామ్నాయంగా విజయవాడకు వచ్చిన మరో హెలికాప్టర్

అలా చెలరేగి: ఏం చేసినా చెల్లుతుందనుకున్నారు. అధికారం అండ చూసుకుని చెలరేగిపోయారు. బెదిరించారు.. భయపెట్టారు.. భూములు కొల్లగొట్టారు. ప్రైవేటు స్థలాలేకాదు.. సర్కారు స్థిరాస్తులను కూడా వైసీపీ నాయకులు తెగబడి మరీ దోచుకున్నారు. 'ఊరికో భూబకాసురుడు' అవతరించి అక్రమాలకు పాల్పడ్డారు. జగన్ హయాంలో జరిగిన ఈ అక్రమాలు.. కుప్పలు తెప్పలుగా ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి.

ఇలా చెరబట్టి: ఐదేళ్ల వైసీపీ పాలన ఊరికో భూ బకాసురుడిని సృష్టించింది. వైసీపీ నేతల భూ కబ్జాలపై ప్రస్తుతం ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కూటమి పార్టీలు నిర్వహిస్తున్న వినతుల స్వీకరణలో వస్తున్న ఫిర్యాదుల్లో 60 శాతం.. భూముల ఆక్రమణ, కబ్జాలవే కావడం గమనార్హం. వీటికి రెవెన్యూ అధికారుల అవినీతి కూడా తోడైంది. వైసీపీతో అంటకాగి ప్రజల, ప్రభుత్వ ఆస్తులను దోచిపెట్టారు.



ఊరికో భూ బకాసురుడు

ఫిర్యాదుల్లో 60 శాతం వైసీపీ కబ్జాలపైనే!

- అధికారం అండ చూసుకుని చెలరేగిన వైసీపీ నాయకులు
- బెదిరించి మరీ భూ దోపిడీ
- ఐదేళ్ల జగన్ పరిపాలనలో భూ కబ్జాలపై జనం ఆక్రందన
- అప్పట్లో భయంతో బిక్కుబిక్కు
- ఇప్పుడు కూటమి సర్కారుకు ధైర్యంగా ఫిర్యాదుల పరంపర
- పరిష్కారానికి సర్కారు సిద్ధం
- సెప్టెంబరు 2 నుంచి రాష్ట్రంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- ప్రజలకు ఊరటనిచ్చేలా నిర్ణయం

సర్వత్రా అదే గోడు

ఉమ్మడి చిత్తూరు జిల్లా, మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఫైళ్లు దగ్ధమైన సమయంలో అక్కడికి వెళ్లిన రెవెన్యూ శాఖ కార్యదర్శి సిసోడియాకు ఆ శాఖకు సంబంధించి ఐదారు వందలకుపైగానే ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన నివ్వెరపోయారు. "గత ఐదేళ్లలో ఏదో జరిగింది. అందుకే ఇంత భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి" అని ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం దిగిపోయి వంద రోజులు కావస్తున్నా ఆయన హయాంలో వైసీపీ నేతలు చెలరేగి చేసిన అక్రమాలపై ఫిర్యాదుల పరంపర మాత్రం కొనసాగుతూనే ఉంది. ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమం ఎక్కడ నిర్వహించినా వైసీపీ నేతల అక్రమాలపైనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి అందుతున్న వినతులను రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక విభాగం సేకరించి వాటిని సంబంధిత జిల్లాలకు, అధికారులకు పంపుతోంది. ఈ విభాగం చేసిన విశ్లేషణ ప్రకారం ప్రజల నుంచి వస్తున్న వినతులు, ఫిర్యాదుల్లో 60 శాతం భూ సంబంధిత

మిగతా 12వ పేజీలో...

నా భూమి కొల్లగొట్టారు
ప్రశ్నిస్తే లేపేస్తామంటున్నారు 12

పెద్దిరెడ్డి అనుచరుల భూ కబ్జాపై రిటైర్డ్ టీచర్ ఫిర్యాదు

జగన్ సీబీఎస్ఈ ఫెయిల్

అనాలోచితంగా వెయ్యి బడుల్లో ఆ సిలబస్

ఏడాదికో సంస్కరణ పేరుతో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన గత వైసీపీ సర్కారు.. గొప్పగా ప్రచారం చేసుకుంటూ ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ ప్రయోగం ఫెయిల్ అయింది. ఉపాధ్యాయులకు సరైన శిక్షణ లేకుండా అనాలోచితంగా వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన సీబీఎస్ఈ విధానం ఘోరంగా విఫలమైంది. ఈ ఏడాది తొలిసారిగా సీబీఎస్ఈ పరీక్ష రాస్తున్న సుమారు 77 వేల మంది విద్యార్థులకు అంచనా పరీక్షలు నిర్వహించగా దాదాపు 65% మంది ఫెయిలయ్యారు.

- ఈ ఏడాది తొలిసారి ఆ బోర్డులో టెన్త్ పరీక్షలు
- ముందు జాగ్రత్తగా అంచనా పరీక్ష నిర్వహణ
- 65 శాతం మంది విద్యార్థులు ఫెయిల్
- సరైన శిక్షణ లేకుండానే సీబీఎస్ఈ ప్రారంభం
- 77 వేల మంది విద్యార్థుల జీవితాలతో ఆటలు
- సీబీఎస్ఈపై నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పేరు కోసం గత జగన్ ప్రభుత్వం చేసిన మరో ప్రయోగం బెడిసికొట్టింది. వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన సీబీఎస్ఈ విధానం వికటించింది. గత కొన్నేళ్లుగా సీబీఎస్ఈ విధానంలోనే చదువుతున్నప్పటికీ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడలేదు. కనీసం పాస్ మార్కులు సాధించే విషయంలోనూ వారు వెనకబడ్డారు. వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లోని 77 వేల మందికి పైగా విద్యార్థులు ఈ ఏడాది తొలిసారి సీబీఎస్ఈ బోర్డులో పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం కొన్నేళ్ల కిందట ఈ వెయ్యి పాఠశాలలను స్టేట్ బోర్డు నుంచి సీబీఎస్ఈలోకి మార్చింది. అలా ఏటా ఒక్కో తరగతి చొప్పున మారుతూ వచ్చిన విద్యార్థులు ఈ సంవత్సరం తొలిసారిగా సీబీఎస్ఈ బోర్డులో పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. దాదాపు 77వేల మంది విద్యార్థులు తొలిసారి రాస్తున్నందున.. ఎందుకైనా మంచిదనే ఉద్దేశంతో

మిగతా 11వ పేజీలో...



11

6 కొత్త పారిశ్రామిక పార్కులు!

- చంద్రబాబు ఢిల్లీ వెళ్లి రాగానే రాష్ట్రానికి తీపికబురు
- ఈ వారంలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం?
- కేవలం ఏపీకే ఇస్తే విమర్శలు వస్తాయని బిహార్, పంజాబ్‌లోనూ మరో 6 పార్కులు
- మొత్తం రూ.25 వేల కోట్ల వ్యయం
- లక్షన్నర కోట్ల పెట్టుబడులకు ఆస్కారం
- ఇందులో సగం మన రాష్ట్రానికి వచ్చే చాన్సు



11

'ఫిట్‌నెస్' పరీక్షకు పచ్చజెండా!

- రెండు మూడు రోజుల్లో షెడ్యూల్‌పై ప్రకటన
- న్యాయపరమైన చిక్కుల్ని అధిగమించిన పోలీస్ శాఖ
- 6,100 కానిస్టేబుల్ పోస్టులకు పోటీలో 95 వేల మంది

డిజిటల్ అసిస్టెంట్ల మెడకు ఓటీఎస్ ఉచ్చు

- సొమ్ము చెల్లించకుండానే వైసీపీ సర్కారులో రిజిస్ట్రేషన్లు
- డిజిటల్ అసిస్టెంట్ల లాగిన్ నుంచి పత్రాల డౌన్‌లోడ్
- ప్రభుత్వం మారడంతో అంతా అయోమయం 3
- ప్రభుత్వానికి ఒక్కో ఉద్యోగి రూ.5 లక్షలకు పైగా బాకీ!
- ఇప్పుడు ఆ బాకీ లేనట్టు చూపిస్తేనే బదిలీకి అర్హత
- డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ సెక్రటరీల లబోదిబో
- నాటి ప్రభుత్వం, అధికారులు ఇరికించారని ఆవేదన



2

పాక్‌లో నరమేధం

- 21 మంది టెర్రరిస్టులు సహా 73 మంది మృతి
- బలూచిస్థాన్‌లో పోలీస్ స్టేషన్లు, రైల్వే లైన్లు, హైవేలే లక్ష్యంగా దాడులు

మిస్టరీ లవ్ స్టోరీ!



ఎన్నికల ముందు జరిగిన తతంగం
ముంబై నటితో వైసీపీ నేత చెట్టపట్టాల్

- ఆపై చీటింగ్ చేసిందంటూ ఫిర్యాదు.. ఆగమేఘాలపై ముంబైకి పోలీసులు
- నటితోపాటు తల్లిదండ్రులూ అరెస్టు.. వారంతా 14 రోజులు బెజవాడ జైలులోనే 2
- పెళ్లి ఊసెత్తబోమని రాసిచ్చాక కేసు క్లోజ్.. ఇదే ఎపిసోడ్‌లో మరో ఇండస్ట్రియలిస్టు?
- ఆయనపై అంతకుముందు ఆ నటి రేప్ కేసు.. ఇక్కడ అరెస్టు తర్వాత ఆ కేసు వాపస్

మాలీవుడ్‌లో కీచకులు

పలువురు మలయాళ నిర్మాతలు, నటులపై 'మీ టూ' ఆరోపణలు

- నటుడు సిద్ధిఖీ నా దృష్టిలో క్రిమినల్: రేవతి సంపత్
- నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించాడు
- దర్శకుడు తులసీదాస్‌పై నటి గీతావిజయన్ నిప్పులు
- రంజిత్ బాలకృష్ణ నన్ను హోటల్ గదికి రమ్మన్నాడు
- తీవ్రస్థాయిలో మండిపడ్డ బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర
- ఐదుగురి వేధింపులు తట్టుకోలేక తాను చెన్నైకి వెళ్లిపోయానంటూ నటి మీను మునీర్ ఆవేదన
- పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

AMMA

వెంటనే చర్యలు తీసుకోవట్లేదు

గాయని చిన్మయి ఆవేదన

సినిమా పేజీలో...

సొంతవాళ్లకు స్వర్గం ప్రత్యర్థులకు నరకం

- విపక్ష నేతలపై కక్ష తీర్చుకునేందుకే జైళ్లు
- కనీస సౌకర్యాలూ అందకుండా నరకయాతన
- రాజమహేంద్రిలో బాబుకు సహాయకుడే లేడు
- 70 ఏళ్ల వయసుకూ గౌరవమివ్వని దారుణం
- నాడు వివేకా హత్య కేసులో దేవిరెడ్డికి మాత్రం ముగ్గురు హెల్పర్లు
- జైలు ఆస్పత్రిలో ప్రత్యేక గది.. అక్కడికే స్నాక్స్
- గంటలు గంటలు ఫోన్లలో ముచ్చట్లు
- ఏకంగా కడప సెంట్రల్ జైలు ఆయన గుప్పిట్లోకి
- రేంజ్ డీఐజీనే బదిలీ చేయించిన వైనం
- విచారణ చేయిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి

జగన్ పాలనలో జైళ్ల తీరిదీ

మూడుసార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబుపై జగన్ పాలనలో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. 70 ఏళ్ల చంద్రబాబుకు కనీస సౌకర్యాలు కల్పించాలని కుటుంబ సభ్యులు అడిగితే.. జైలులో దోమలు ఉండవా అంటూ అసెంబ్లీలో వైసీపీ నేతలు ఎకసెక్కాలాడారు.

వివేకా హత్య కేసులో జైలుకు వెళ్లిన ప్రధాన నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి మాత్రం రాచమర్యాదలు కల్పించారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డితో చిట్‌చాట్‌ల నుంచి నచ్చని అధికారిని బదిలీపై పంపించేదాకా.. అన్ని పవర్స్ దేవిరెడ్డికే నాటి సీఎం జగన్ ఇచ్చారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నేతలు, సొంత మనుషులు హత్య కేసులో జైలుకు వెళ్లినా రాచమర్యాదలు! వారికి చట్టాలు ఏమాత్రం వర్తించవు. అధికారులు ఎవరైనా మాట వినకుంటే బదిలీ వేటు తప్పదు. అదే చంద్రబాబు సహా అప్పటి ప్రతిపక్ష నేతలు తప్పుడు కేసుల్లో జైలుకు వెళ్లినా

మిగతా 11వ పేజీలో...

ఇవేం ఫీజులు బాబోయ్!

ప్రైవేటు వర్సిటీల్లో డిగ్రీకి భారీగా ఫీజులు



- కొత్త ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ అంతే
- కాకినాడలో ఓ వర్సిటీలో బీబీఏ-ఎంబీఏకు 60 వేలు
- ఎంబీఏకు రీయింబర్స్‌మెంట్ లేకపోయినా ఖరారు
- మరో కొత్త ప్రైవేటు వర్సిటీలో బీఎస్సీకే రూ.35,500
- రాష్ట్రంలో అన్ని ప్రైవేటు వర్సిటీల్లోనూ భారీ ఫీజులే
- సాధారణ డిగ్రీ కాలేజీల్లో అందులో సగం లోపే 3

రూ.35కే క్షయ నిర్ధారణ పరీక్ష

కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, ఆగస్టు 26: ప్రపంచానికి సవాలు విసురుతున్న రోగాల్లో క్షయ ఒకటి. దీని నిర్ధారణ ఖర్చుతో కూడుకున్నది. ప్రస్తుతం సాంప్రదాయ పద్ధతుల ద్వారా టీబీని నిర్ధారించడానికి 42 రోజులు పడుతోంది. అయితే కేవలం రూ.35 ఖర్చుతోనే రోగి కఫాన్ని పరీక్షించి క్షయ వ్యాధిని నిర్ధారించే కొత్త సాంకేతిక వ్యవస్థను ఐసీఎంఆర్‌కు చెందిన అసోంలోని డిబ్రూగఢ్ ప్రాంతీయ కార్యాలయం అభివృద్ధి చేసింది. 'సీఆర్ఐఎస్‌పీఆర్ కేస్-బేస్డ్ టీబీ డిటెక్షన్ సిస్టమ్' అని పిలిచే ఈ చిన్న పరికరం చాలా తేలికైంది. మూడు దశల్లో క్షయ నిర్ధారణ చేసే ఈ పరికరంతో రెండున్నర గంటల్లో ఏకబిగిన 1,500 శాంపిల్స్‌ను పరీక్షించవచ్చని ఐసీఎంఆర్ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉన్న కొన్ని టీబీ నిర్ధారణ పద్ధతులు మెరుగైన ఫలితాలను అందిస్తున్నా సమయం, ఖర్చు ఎక్కువగా ఉంటోందని ఐసీఎంఆర్ అధికారి ఒకరు చెప్పారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే సీఆర్ఐఎస్‌పీఆర్-కేస్12ఏ ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థ మంచి పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. దీనికి విస్తృత మార్కెట్‌ను కల్పించేందుకు అర్హులైన సంస్థలు, కంపెనీలు, తయారీదారులకు ఈ టెక్నాలజీని బదిలీ చేయాలని ఐసీఎంఆర్ భావిస్తోంది. ఆసక్తి ఉన్న కంపెనీలు, సంస్థలు ముందుకురావాలని ఆహ్వానించింది. వీటి తయారీకి ముందుకొచ్చే సంస్థలకు ఐసీఎంఆర్ మార్గదర్శకత్వం,సాంకేతిక సహకారం అందిస్తుందని ఆ అధికారి తెలిపారు.

గంజాయిలోని రసాయనంతో వృద్ధాప్యం వెనక్కి!



జర్మనీ, ఇజ్రాయెల్ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 26: గంజాయి వ్యసనం ఆరోగ్యానికి ప్రమాదకరం! కానీ, అదే గంజాయిలోని టెట్రాహైడ్రోక్యానబినోల్ (టీహెచ్‌సీ) అనే రసాయనాన్ని అతి తక్కువ మోతాదులో దీర్ఘకాలంపాటు వైద్యుల పర్యవేక్షణలో ఔషధంలా వాడితే.. అది వృద్ధాప్యం వల్ల మెదడులో వచ్చే మార్పులను రివర్స్ చేస్తుందని, వయసు మీరే ప్రక్రియను ఆలస్యం చేస్తుందని (యాంటీ ఏజింగ్ ఎఫెక్ట్) తాజా అధ్యయనంలో వెల్లడైంది. జర్మనీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ బాన్, యూనివర్సిటీ హాస్పిటల్ బాన్, ఇజ్రాయెల్‌కు చెందిన హిబ్రూ వర్సిటీ పరిశోధకులు.. ఎలుకల మెదళ్లపై ఈ అధ్యయనం చేశారు. వృద్ధాప్యం వల్ల ఆ ఎలుకల మెదళ్లలో వచ్చే సాధారణ సమస్యలను టీహెచ్‌సీ నయం చేయగలిగినట్టు వారు గుర్తించారు. సాధారణంగా మనుషుల్లో వయసు పెరిగే కొద్దీ మతిమరపు, మెదడు చురుగ్గా పనిచేయకపోవడంవంటి సమస్యలువస్తుంటాయి. ఆ సమస్యలకు చెక్‌పెట్టే ఔషధాల రూపకల్పనకు ఈ అధ్యయన ఫలితాలు దోహదం చేస్తాయని వైద్యనిపుణులు భావిస్తున్నారు.



ఉక్రెయిన్‌పై భీకర దాడులు

» 200కు పైగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించిన రష్యా

» బ్రిటన్ జర్నలిస్టు సహా 13 మంది దుర్మరణం

కీవ్, ఆగస్టు 26: ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. తమదేశంలోకి చొచ్చుకువస్తున్న ఉక్రెయిన్‌కు చెక్ పెడుతూ.. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 200కు పైగా క్షిపణులు, 100కు పైగా డ్రోన్లు, రాకెట్లతో దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఉక్రెయిన్ వ్యాప్తంగా కీలక నగరాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. రాజధాని కీవ్ నగరంలో తాగునీటి సరఫరా, విద్యుత్తు వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి. ఇంధన కేంద్రాలే లక్ష్యంగా రష్యా దాడులకు పాల్పడడంతో.. చాలా చోట్ల విద్యుత్తు అంతరాయాలేర్పడ్డాయి. ఈ దాడుల్లో 13 మంది మృతిచెందగా.. డజన్ల కొద్దీ పౌరులు గాయపడ్డారు. మృతుల్లో బ్రిటన్ జర్నలిస్టు(రాయిటర్స్) కూడా ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక రష్యా దాడులు ప్రారంభమైనట్లు ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. సోమవారం ఉదయం వరకు కొనసాగిన బాంబింగ్.. రష్యా దురాక్రమణ తర్వాత అతిపెద్ద దాడులని పేర్కొన్నాయి. 127 బాలిస్టిక్, 102 క్రూయిజ్ క్షిపణులతోపాటు.. 109 డ్రోన్లతో రష్యా దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధికారిక వార్తా సంస్థ 'ఉక్రిఇన్ఫాం' తెలిపింది. ఉక్రెయిన్ వైమానిక దళం 99 రష్యన్ డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. రష్యా దాడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 13 మరణాలు నమోదయ్యాయని, డజన్ల కొద్దీ పౌరులు గాయపడ్డారని అధికారులు వివరించారు. తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్స్క్ ప్రాంతంలో.. ఓ హోటల్‌పై జరిగిన క్షిపణి దాడిలో.. బ్రిటిష్ జర్నలిస్టుల బృందం(రాయిటర్స్)లోని ఓ సభ్యుడు మరణించాడని, మరో ఐదుగురు పాత్రికేయులు గాయపడ్డారని వెల్లడించారు. ఇదే హోటల్‌లో మరో 7 మరణాలు నమోదైనట్లు తెలిపారు. ఈ దాడి అత్యంత హేయమైనదని, రష్యాకు తప్పక గుణపాఠం చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించారు.

రష్యాలో 38 అంతస్తుల భవనంపై 9/11 తరహాలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి



దాదాపు 23 ఏళ్ల క్రితం.. 2001 సెప్టెంబరు 11న న్యూయార్క్‌లోని జంట హర్మ్యాలను అల్‌ఖాయిదా ఉగ్రవాదులు విమానాలతో ఢీకొట్టారు గుర్తుందా? అచ్చం అలాగే.. ఉక్రెయిన్ డ్రోన్ ఒకటి సోమవారం రష్యాలోని సారటోవ్‌లో 38 అంతస్తుల నివాసభవనాన్ని ఢీకొట్టింది. ఈ దాడిలో ఒక మహిళ సహా నలుగురికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. కాగా.. ఉక్రెయిన్ డ్రోన్ దాడి వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో సారటోవ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించారు.

సూసైడ్ డ్రోన్‌ను పరీక్షించిన కిమ్





న్యూఢిల్లీ, ఆగస్టు 26: ఉత్తర కొరియా శనివారం శక్తిమంతమైన ఒక ఆత్మాహుతి డ్రోన్‌ను పరీక్షించింది. ఈ విషయాన్ని ఆ దేశ మీడియా సోమవారం వెల్లడించింది. పరీక్షల్లో భాగంగా దక్షిణ కొరియాకు చెందిన కే-2 యుద్ధ ట్యాంకును పోలి ఉన్న ఓ వాహనాన్ని ఈ డ్రోన్‌తో పేల్చివేశారు. దీన్ని అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా పర్యవేక్షించారు. తమ యుద్ధ సన్నద్ధతను మరింత మెరుగుపర్చుకోవడానికి ఈ సూసైడ్ డ్రోన్లు దోహదపడతాయని, వీటి తయారీని వేగవంతం చేస్తామని కిమ్ చెప్పారు. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్న వేళ కిమ్ ఈ సూసైడ్ డ్రోన్‌ను పరీక్షించడం విశేషం.

కుప్పకూలిన 35 అడుగుల శివాజీ విగ్రహం

» ముంబైలో ప్రారంభించిన 8 నెలలకే నేలమట్టం

ముంబై, ఆగస్టు 26: మహారాష్ట్రలో ప్రారంభించిన 8 నెలలకే ఛత్రపతి శివాజీ మహరాజ్ 35 అడుగుల భారీ విగ్రహం కుప్పకూలింది. ఈ ఘటన సోమవారం సింధుదుర్గ్ జిల్లా మాల్వాన్‌లో జరిగింది. గత సంవత్సరం డిసెంబరు 4న నౌకదళ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ విగ్రహాన్ని మాల్వాన్‌లోని రాజ్‌కోట్ కోటలో ప్రారంభించారు. గత రెండు మూడు రోజులుగా జిల్లాలో ఎడతెరిపిలేని వానలు కురుస్తున్నాయని, బలమైన గాలుల ధాటికి విగ్రహం నేలమట్టం అయినట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అయితే, శివాజీ విగ్రహాన్ని సాధ్యమైనంత త్వరగా తిరిగి అక్కడే ఏర్పాటు చేస్తామని సీఎం శిందే తెలిపారు.

ఉబెర్‌కు 2,716 కోట్ల జరిమానా

ది హేగ్, ఆగస్టు 26: ప్రయాణ సేవలు అందించే ఉబెర్‌పై డచ్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ (డీపీఏ) కొరడా ఝుళిపించింది. తగినంత రక్షణ లేకుండా అమెరికాకు యూరోపియన్ డ్రైవర్ల వ్యక్తిగత వివరాలను బదిలీ చేసినట్టు ఆరోపిస్తూ ఉబెర్‌పై 32.4 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,716 కోట్లు) జరిమానాను డచ్ డీపీఏ సోమవారం విధించింది. అయితే ఈ నిర్ణయం లోపభూయిష్టంగా ఉందని, అసాధారణమైన జరిమానా పూర్తిగా అన్యాయమైందని, దీనిపై అప్పీల్‌కు వెళ్తామని ఉబెర్ తెలిపింది.

కంగనా... నోరు జారొద్దు: బీజేపీ



న్యూఢిల్లీ, ఆగస్టు 26: రైతుల నిరసనలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఆ పార్టీ అధిష్ఠానం తప్పు పట్టింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దంటూ ఆమెను మందలించింది. రైతుల నిరసనల విషయంలో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోకపోతే దేశంలో బంగ్లాదేశ్ వంటి పరిస్థితులు ఏర్పడేవని ఆదివారం కంగన వ్యాఖ్యానించారు. ఈ కుట్రలో చైనా, అమెరికా ప్రమేయం ఉందని ఆరోపించారు. కేంద్రం రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేసినపుడు అత్యాచార ఘటనలు జరిగాయని, శవాలు చెట్లకు వేలాడాయన్నారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో సోమవారం బీజేపీ స్పందించింది. ఆమె వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేసింది. పార్టీ తరఫున విధాన పరమైన అంశాలపై మాట్లాడే అధికారం కంగనకు లేదంది. కంగన వ్యాఖ్యలు రైతులను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని, రైతు వ్యతిరేకతే మోదీ ప్రభుత్వ డీఎన్‌యే అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ విమర్శించారు.

పాకిస్థాన్‌లో నరమేధం!

బలూచిస్థాన్‌లో బస్సులు ఆపి, 23 మంది ప్రయాణికుల కాల్చివేత

» ఉగ్ర దాడుల్లో మొత్తం 73 మంది మృతి

» 21 మంది ఉగ్రవాదులు కూడా హతం

» బలూచిస్థాన్‌లో పోలీస్ స్టేషన్లు, రైల్వే లైన్లు, హైవేలే లక్ష్యంగా ఉగ్ర దాడులు

» దాడులు మా పనే: బీఎల్ఏ





తీవ్రవాదులు నిప్పు పెట్టడంతో కాలిపోయిన వాహనాలు


కరాచీ, ఆగస్టు 26: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పోలీస్ స్టేషన్లు, రైల్వే లైన్లు, హైవేలపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. వేర్వేరు చోట్ల జరిపిన దాడుల్లో మొత్తం 73 మంది మరణించారు. మృతుల్లో 14 మంది సైనికులు, పోలీసులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. 21 మంది ఉగ్రవాదులను కూడా హతమార్చినట్లు చెప్పారు. బలూచిస్థాన్‌లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం కొందరు ఉగ్రవాదులు ప్రధాన హైవేలపై బస్సులు, ట్రక్కులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడినట్లు తెలిపారు. వాహనాలను అడ్డగించి, ప్రయాణికులను కిందకు దింపి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 23 మంది మరణించారు. ఖలాత్ జిల్లాలో జరిగిన కాల్పుల ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. బస్సులు, ట్రక్కులను అడ్డుకొని, ప్రయాణికులను కిందకు దింపి, వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసి కాల్పులు జరిపినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పంజాబ్ ప్రావిన్స్ నుంచి వచ్చేవారే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి వచ్చేవారు తమ వనరులను దోచుకుంటున్నారన్న ఆగ్రహంతోనే ఈ దాడులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. మృతుల్లో అత్యధికులు దక్షిణ పంజాబ్ ప్రాంతానికి చెందినవారు కాగా, మరి కొందరు ఖైబర్ పఖ్తున్ఖ్వాకు చెందిన వారని తెలిపారు. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో కూడా ఉగ్రదాడులు జరిగినట్లు తెలిపారు. ముసాఖెల్ హైవేపై 35కు పైగా వాహనాలకు నిప్పు పెట్టినట్లు చెప్పారు. మరో ఘటనలో పాకిస్థాన్-ఇరాన్ మధ్యనున్న రైల్వే మార్గంలో క్వెట్టాను పాక్‌తో అనుసంధానించే వంతెనను మందుపాతరలతో ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు మరణించినట్లు చెప్పారు. ఈ దాడులకు తామే బాధ్యులమని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించింది. బలూచిస్థాన్‌లో జరిగిన వేర్వేరు దాడుల్లో మొత్తం 73 మంది ప్రాణాలు కోల్పోయినట్లు బలూచిస్థాన్ ప్రావిన్స్ అధికార ప్రతినిధి తెలిపారు. బీఎల్ఏ దాడులను పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ జర్దారీ, ప్రధాని షెహబాజ్ తీవ్రంగా ఖండించారు.

ఇజ్రాయెల్-హమాస్ చర్చలు విఫలం

కాల్పుల విరమణ, బందీల విడుదలపై కైరోలో చర్చలు

ఎలాంటి నిర్ణయం లేకుండానే ముగింపు.. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తప్పదన్న ఇరాన్

జెరుసలేం, ఆగస్టు 26: ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య గత పది నెలలుగా సాగుతున్న భీకర యుద్ధానికి ముగింపు పలికేలా ఇరు దేశాల మధ్య చర్చలకు శ్రీకారం చుట్టినా ఏమాత్రం ఫలించలేదు. కాల్పుల విరమణ, బందీల విడుదల వంటి కీలక అంశాలు సహా ఇతర అంశాలపై ఈజిప్టు రాజధాని కైరోలో చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. ఆదివారం ఇరు పక్షాలు ఎలాంటి తుది ఒప్పందం చేసుకోకుండానే చర్చలు ముగించాయి. ఈ చర్చలు వారాంతాల్లో కొనసాగుతాయని, ఇజ్రాయెల్, హమాస్‌లకు మధ్యవర్తులుగా ఉన్న అమెరికా, ఖతార్, ఈజిప్ట్ బృందాలతో ద్వితీయ శ్రేణి బృందం కైరోలోనే చర్చలు జరుపుతుందని అమెరికాకు చెందిన ఓ అధికారి తెలిపారు. గత గురువారం ప్రారంభమైన చర్చలు ఆదివారం వరకు సాగాయని, ఈ చర్చలు నిర్మాణాత్మకంగా ఉండడంతోపాటు తుది ఆచరణయోగ్యమైన ఒప్పందాలను చేరుకునే దిశగా సాగాయని వివరించారు. అయితే ఈ చర్చలు అర్ధంతరంగా ముగియడానికి ఆదివారం ఇజ్రాయెల్, లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హిజ్బొల్లా మధ్య యుద్ధం మరింత భీకరంగా మారడేమనని అమెరికా అధికారి తెలిపారు. ఇదిలావుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాత్రం.. యుద్ధం ముగిసిపోలేదని నొక్కి చెప్పారు. కాగా ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుని తీరతామని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి పేర్కొన్నారు. టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారం కచ్చితంగా ఉంటుందన్నారు.



ఎర్ర సముద్రంలో ట్యాంకర్‌కు నిప్పు

ఎర్ర సముద్రంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. గ్రీక్ జాతీయ పతాకంతో ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్‌పై యెమన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు నిప్పు పెట్టారు. ఈ దాడిలో 1.5 లక్షల టన్నుల క్రూడ్ ఆయిల్ ఉన్న చమురు ట్యాంకర్ కాలిపోయింది. అయితే ట్యాంకర్ నుంచి భారీ ఎత్తున చమురు లీక్ కాలేదని, గత కొన్ని వారాల్లో ఇదే అతిపెద్ద దాడి అని యూరోపియన్ యూనియన్‌కు చెందిన నౌకా కమాండ్ సోమవారం తెలిపింది. చమురు ట్యాంకర్ ధ్వంసంతో రూ.లక్ష కోట్ల వ్యాపారం దెబ్బతిందని పేర్కొంది.

యూపీఐ తరహాలో.. రుణాల కోసం యూఎల్ఐ

» ఒక్క సమ్మతితో వెంటనే రుణాలు

» త్వరలో దేశమంతా అందుబాటులోకి

» ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



బెంగళూరు, ఆగస్టు 26: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) మాదిరిగా.. సులభతర రుణాల కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్(యూఎల్ఐ)ని పరిచయం చేయనున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. 2016 డిజిటల్ చెల్లింపుల కోసం తీసుకువచ్చిన యూపీఐ విజయవంతమవ్వడంతో.. చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈలు, గ్రామీణులకు ఎలాంటి ఆటంకాల్లేకుండా రుణాలు తీసుకోవడానికి యూఎల్ఐని గత ఏడాది రెండు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ విధానం విజయవంతమైందని, దాంతో.. దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆర్‌బీఐ ఆవిర్భవించి 90 ఏళ్లవుతున్న సందర్భంగా సోమవారం బెంగళూరులో 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' అనే అంశంపై ఏర్పాటు చేసిన గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. "ఆర్‌బీఐ పరిధిలో పనిచేసే భారత జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్‌పీసీఐ) ద్వారా యూపీఐని అందుబాటులోకి తీసుకువచ్చాం. నగదు రహిత చెల్లింపులకు ఈ విధానం ఎంతగానో ఉపకరిస్తోంది. ఒక్క క్యూఆర్ కోడ్ లేదా యూపీఐ ఐడీ లేదా మొబైల్ నంబర్‌తో చెల్లింపులు చేసే వెసులుబాటును కల్పించింది. ఆర్థిక సేవల డిజిటలీకరణను విజయవంతం చేసింది. ఇదే స్ఫూర్తితో కేవలం ఒక సమ్మతి(కన్సెంట్)తో గ్రామీణులు, చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈలు రుణాలు తీసుకునేందుకు యూఎల్ఐ దోహదపడుతుంది" అని ఆయన వివరించారు. యూఎల్ఐ ప్లాట్‌ఫారంతో బహుళ డేటా సర్వీస్ ప్రొవైడర్లు, రుణదాతలు, వివిధ రాష్ట్రాల భూరికార్డుల డిజిటల్ సమాచారంతో అనుసంధానమై ఉంటాయని వివరించారు. "క్రెడిట్ అర్హత మదింపు కోసం పట్టే సమయాన్ని యూఎల్ఐ తగ్గిస్తుంది. యూపీఐ మాదిరిగానే.. అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్(ఏపీఐ) ఆధారంగా యూఎల్ఐ పనిచేస్తుంది. అంటే.. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు ఈ ఏపీఐ ఆధారంగా రుణాలను అందజేయవచ్చు. ఈ ఏపీఐ ద్వారా.. రుణాలు తీసుకునేవారి ఆర్థిక, ఆర్థికేతర డేటా ఒకే చోట లభ్యమవుతుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. దేశవ్యాప్తంగా యూఎల్ఐ అందుబాటులోకి వస్తే.. మరో డిజిటల్ విప్లవానికి నాంది పలికినట్లవుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

నేను వెళ్లేసరికే ఆమె చనిపోయి ఉంది

» పాలీగ్రాఫ్ పరీక్షలో ఆర్జీ కర్ ఆస్పత్రి హత్యాచార నిందితుడు సంజయ్ రాయ్



కోల్‌కతా, ఆగస్టు 26: కోల్‌కతా హత్యాచార ఘటన నిందితుడు సంజయ్ రాయ్.. పాలీగ్రాఫ్ పరీక్షల్లో ఒకదానికొకటి సంబంధం లేని సమాధానాలు చెప్పాడు. జాతీయ మీడియాలో వచ్చిన కథనాల ప్రకారం.. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అతడికి ఇటీవల సీబీఐ పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించింది. అందులో.. తాను ఈ నెల 9న రాత్రి తాను ఆస్పత్రికి వెళ్లేసరికే సెమినార్ హాలులో యువ వైద్యురాలు చనిపోయి కనిపించిందని.. భయంతో పారిపోయానని సంజయ్ చెప్పాడు. అయితే, ఆధారాలు చూపించడంతో అసలు తాను అక్కడ లేనంటూ బుకాయించాడు. విచారణ సందర్భంగా సీబీఐ ప్రశ్నలకు ఏదో ఆలోచిస్తూ.. హడావుడి పడ్డాడు. అవాస్తవాలు, పొంతన లేకుండా మాట్లాడాడు. ఈ నెల 10న సంజయ్‌ను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేసిన సమయంలో హత్యాచారం చేసింది తానేనంటూ అంగీకరించినట్లుగా కథనాలు వచ్చాయి. ఫోరెన్సిక్ వైద్య బృందం విచారణ సందర్భంగానూ ఆస్పత్రిలో ఆ రోజు ఏం జరిగిందో వివరంగా చెప్పాడని సీబీఐ పేర్కొంది. కానీ, కోర్టుకు తీసుకెళ్లాక తనను కొందరు కేసులో ఇరికించారంటూ మాట మార్చాడు. కాగా, సంజయ్‌కు మళ్లీ పాలీగ్రాఫ్ పరీక్షలు చేయనున్నారు. మరోవైపు ఆర్జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ సహా మరో నలుగురికి సోమవారం నుంచి రెండో దఫా పాలీగ్రాఫ్ పరీక్షలు చేస్తున్నారు.

బెంగాల్లో 48వేల రేప్ కేసులు పెండింగ్

మమతపై కేంద్రం ఫైర్.. సీఎంకు కేంద్రమంత్రి లేఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 26: పశ్చిమ బెంగాల్ సీఎం మమత తీరుపై కేంద్రప్రభుత్వం విరుచుకుపడింది. ఆ రాష్ట్రానికి తాము 123 ఫాస్ట్‌ట్రాక్/పోక్సో కోర్టులు మంజూరు చేస్తే కేవలం ఆరు మాత్రమే ఏర్పాటు చేశారని ఆక్షేపించింది. అది కూడా గత ఏడాదే అందుబాటులోకి తెచ్చారని పేర్కొంటూ కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి ఘాటుగా ఆమెకు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా రోజుకు సగటున 90 రేప్ కేసులు నమోదవుతున్నాయని.. దోషులకు 15 రోజుల్లోనే కఠిన శిక్షలు విధించేలా పార్లమెంటులో చట్టం చేయాలని మమత ప్రధాని మోదీకి ఇటీవల లేఖ రాశారు. దీనిపై అన్నపూర్ణాదేవి తీవ్రంగా స్పందించారు. బెంగాల్లో 48,600 అత్యాచార, పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. కష్టాల్లో ఉన్న మహిళలు, పిల్లలను ఆదుకోవడానికి కేంద్రం.. 181, 112, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులోకి తెస్తే.. ఎన్ని సార్లు గుర్తుచేసినా మమత సర్కారు వీటిని అమలు చేయలేదన్నారు.

మిస్టరీ లవ్ స్టోరీ!

ఒక ఆంధ్రా పారిశ్రామిక వేత్త! పైగా... వైసీపీ నేత! అందులోనూ అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు బాగా సన్నిహితుడు! అటువైపు.. ముంబైలో ఓ మోస్తరు నటి, సెలబ్రిటీ మహిళ! ఇద్దరి మధ్యా ప్రేమలాంటి ఒక వ్యవహారం... ఆ తర్వాత వివాదం! కథ అనేక మలుపులు తిరిగింది. 'ఆమె నన్ను బ్లాక్ మెయిల్ చేస్తోంది' అంటూ ఆయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడమే ఆలస్యం! పోలీసులు ఆగమేఘాల మీద ముంబైకి వెళ్లి ఆ మహిళను, ఆమె తల్లిదండ్రులనూ పట్టుకొచ్చి అరెస్టు చేసేశారు. చిన్న చిన్న కేసులకే భారీ హడావుడి చేసే పోలీసులు... ఈ మొత్తం వ్యవహారాన్ని 'సైలెంట్'గా నడిపారు. చివరికి... రెండు పక్షాల మధ్య రాజీ కుదిరింది. కేసు క్లోజ్! ఇదంతా ఎన్నికల ముందు, ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన తతంగం! ఇప్పుడు అనుకోని పరిస్థితుల్లో వెలుగులోకి వచ్చింది! బాలీవుడ్ తరహా 'థ్రిల్లర్ క్రైమ్ లవ్‌స్టోరీ'లో జాతీయస్థాయిలో పేరుపొందిన ఒక బడా పారిశ్రామికవేత్త పాత్ర కూడా ఉందండోయ్! ఆయన కూడా జగన్‌కు బాగా సన్నిహితుడే! ఆ పారిశ్రామిక వేత్త తనను లైంగికంగా వేధించినట్లు ఈ 'మోడల్ మహిళ' కేసు పెట్టినట్లు సమాచారం. ఆమె నుంచి ఈ బడా ఇండస్ట్రియలిస్టును కాపాడేందుకే... ఏపీలో ఆమెపై 'తప్పుడు' కేసు పెట్టించి.. జైల్లో వేసి బెదిరించారా? 'చెప్పింది చెప్పినట్లు చేసే' ఐపీఎస్ అధికారి ద్వారా ఈ తతంగం నడిపించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇబ్రహీంపట్నం కేసులో రాజీ పడటం, ముంబైలో బడా పారిశ్రామిక వేత్తపై పెట్టిన కేసును ఆమె వెనక్కి తీసుకోవడం అన్నీ ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోయాయి! అందుకే... ఎన్నెన్నో అనుమానాలు!

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు జరిగిన తతంగం

ముంబై నటితో వైసీపీ నేత చెట్టపట్టాల్

ఆపై చీటింగ్ చేసిందంటూ పోలీసులకు ఫిర్యాదు

ఆగమేఘాల మీద ముంబైకి పోలీసులు

నటితోపాటు ఆమె తల్లి దండ్రులు అరెస్టు

కృష్ణా జిల్లాకు చెందిన ఓ వైసీపీ నాయకుడి 'లవ్ స్టోరీ' ఒకటి తాజాగా బయటపడింది. ఆ మహిళ ముంబైకి చెందిన ఓ మోస్తరు నటి, సెలబ్రిటీ కావడం విశేషం. ఆ వైసీపీ నేతకు హైదరాబాద్‌లో ఓ వివాహ వేడుకలో సదరు నటితో పరిచయం ఏర్పడింది. ఈ నాయకుడి కుటుంబ నేపథ్యం చాలా పెద్దది. 2014 ఎన్నికల్లో విజయవాడకు చెంతనే ఉన్న నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆయన తండ్రి ప్రముఖ పారిశ్రామికవేత్త. విశాఖపట్నం పోర్టులో ఎగుమతులు, దిగుమతుల వ్యాపారంతో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లా కొండపల్లి, జగ్గయ్యపేటల్లో పెద్దఎత్తున భూములు ఉన్నాయి. తండ్రి బాగా సంపదించారు. కుమారుడు చక్కగా ఎంజాయ్ చేస్తున్నారన్న మాట! ఇదే క్రమంలో ముంబై నటితో చాలాకాలం సన్నిహితంగా మెలిగారు. అయితే... తనను పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో కథ మలుపు తిరిగింది. ఇతను ససేవిరా అనడం, ఆమె 'బ్లాక్ మెయిల్' తరహా బెదిరింపులకు దిగడంతో ఈ నాయకుడు బెంబేలెత్తారు. ఆమెను వదిలించుకునేందుకు భారీ స్కెచ్ వేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ సలహాదారును సంప్రదించారు. ఆయన సూచన మేరకు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ముంబై నటిపైన, ఆమె కుటుంబ సభ్యులపైన ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు పెట్టారు. తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, ఫోర్జరీ పత్రాలతో చీటింగ్ చేశారని ఆరోపించారు. సలహాదారుకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు ఆగమేఘాలపై స్పందించారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరి రెండో తేదీన క్రైం నంబర్ 90/2024తో కేసు నమోదైంది. మాయమాటలతో వైసీపీ నేతను లోబరచుకుని నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ వెంటనే విజయవాడ నుంచి ప్రత్యేక పోలీసు బృందం ముంబై వెళ్లింది. ఆ నటిని, ఆమె తల్లిదండ్రులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం తీసుకొచ్చారు. వైసీపీ నేతను పెళ్లి చేసుకునే విషయం మరచిపోవాలని వారిని పోలీసులు తీవ్రంగా బెదిరించినట్లు సమాచారం. అనంతరం వారిని విజయవాడ 4వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచి.. 14 రోజులపాటు విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉంచారు. పోలీసుల తీరు.. అక్రమ కేసుల బనాయింపుతో ముంబై నటి కుటుంబం బెంబేలెత్తింది. తమ కుమార్తె మున్ముందు వివాహం విషయం ప్రస్తావించదంటూ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరువర్గాలు రాజీపడ్డాయంటూ నటిపై నమోదైన చీటింగ్ కేసును పోలీసులు మూసివేశారు. ఈ మొత్తం వ్యవహారంలో సలహాదారుకు రూ.5 కోట్ల వరకు ముట్టినట్లు సమాచారం.

బడా పారిశ్రామికవేత్తకు సంబంధం ఉందా?

ఈ కేసుకు సంబంధించి మరో వాదన కూడా వినిపిస్తోంది. ముంబై నటిపై కేసు పెట్టిన వైసీపీ నేత ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఓ పావు మాత్రమేనని.. అసలు వ్యక్తి ఇండియాలోనే పేరుమోసిన ఓ బడా పారిశ్రామికవేత్త అనే ప్రచారం ఉంది. ఆ బడా పారిశ్రామికవేత్త 2022 జనవరిలో తనను రేప్ చేశారని ఆమె 2023 డిసెంబరులో ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తనకు సన్నిహితంగా ఉండే వైసీపీ ముఖ్యనేతను ఆశ్రయించారనే అనుమానాలున్నాయి. ముఖ్యనేత సూచనతో సలహాదారు రంగంలోకి దిగి.. వైసీపీకి చెందిన కృష్ణా జిల్లా నేతతో ఫిర్యాదు చేయించి.. నటిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారనే వాదన వినిపిస్తోంది. ఫిబ్రవరిలో ఈ తతంగం ముగియగానే.. సదరు ఇండస్ట్రియలిస్టుపై పెట్టిన కేసును ఆ నటి ఉపసంహరించుకోవడం గమనార్హం. అయితే.. ఎవరో బడా పారిశ్రామికవేత్తను కాపాడేందుకు, కృష్ణా జిల్లా వైసీపీ నాయకుడు తాను స్వయంగా తెర మీదికి వస్తారా? ఎందుకంటే.. ఆయనదేం తక్కువ స్థాయి కాదు! 2014లో వైసీపీ అభ్యర్థిగా నిలిచిన నాయకుడు! తండ్రి నుంచి వచ్చిన కోట్ల రూపాయల ఆస్తులకు వారసుడు! ఎవరినో కాపాడేందుకు తన పేరు ఎందుకు బద్నామ్ చేసుకుంటారు? మరి... ఇవి రెండూ వేర్వేరు కథలా? ఒకే కథలోని రెండు అధ్యాయాలా? ఈ ఎపిసోడ్‌లో ఏం జరిగిందో చెప్పాల్సింది పోలీసు అధికారులే!

బాధితులు ముందుకొస్తే విచారణ

ముంబై నటి వ్యవహారంలో బాధితులెవరూ ఇంతవరకు మమ్మల్ని సంప్రదించలేదు. వారెవరైనా ముందుకొస్తే తగిన విచారణ చేసి న్యాయం చేస్తాం.

- రాజశేఖర్‌బాబు, విజయవాడ పోలీసు కమిషనర్

పోలవరం బ్యాక్‌వాటర్‌పై ఒడిశా పేచీ

58 లక్షల క్యూసెక్కుల వరద ప్రకారం భూసేకరణకు డిమాండ్

- ఏకీభవించని కేంద్ర జలసంఘం, ఏపీ
- రేపు 4 రాష్ట్రాలతో ఢిల్లీలో ప్రత్యేక భేటీ



అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌పై ఒడిశా రాష్ట్రం పేచీ పెడుతోంది. 58 లక్షల క్యూసెక్కుల వరదను పరిగణనలోకి తీసుకుని భూసేకరణ జరపాలని డిమాండ్ చేస్తోంది. దీనిని ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్ర జలసంఘం కూడా అంగీకరించడం లేదు. తప్పులతడక భూసేకరణ లెక్కలతో ప్రాజెక్టును అమలు చేస్తున్నారని, ముంపుపై మళ్లీ సర్వే జరపాలంటూ కేంద్రానికి వ్యతిరేకంగా ఒడిశా ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో ఏకాభిప్రాయానికి రావాలని ఆంధ్ర, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కోర్టు ఆదేశించింది. ఇందుకోసం కేంద్ర జలసంఘం ఈ రాష్ట్రాలతో ఇంతవరకు నాలుగు దఫాలు సమావేశాలు జరిపింది. అలాగే బ్యాక్‌వాటర్‌పై రాష్ట్ర జల వనరుల శాఖ సంయుక్త సర్వే నిర్వహించింది. అయినా ఒడిశా పదేపదే సుప్రీంకోర్టులో భూసేకరణ అంశంపై అభ్యంతరాలు చెబుతోంది. అలాగే నవీన్ పట్నాయక్ ఆ రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో.. భూసేకరణ, బ్యాక్‌వాటర్ అంశాలపై పలు అభ్యంతరాలతో కేంద్రానికి లేఖ రాశారు. దీనిని విశ్వాసంలోకి తీసుకున్న కేంద్ర జల సంఘం.. పోలవరం ప్రాజెక్టు పరిధిలోని రాష్ట్రాలతో సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే నాలుగు రాష్ట్రాల జల వనరుల శాఖ అధికారులతో బుధవారం ఢిల్లీలో సమావేశం కానున్నది. మన రాష్ట్రం నుంచి జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్ హాజరవుతున్నారు. 50 లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా, జలాశయంలో 36 లక్షల క్యూసెక్కుల నీరు నిల్వ చేసేలా పోలవరం ప్రాజెక్టును జల సంఘమే డిజైన్ చేసింది. అయితే.. 50 లక్షల క్యూసెక్కుల నీటి నిల్వ మేరకు భూసేకరణ చేపట్టాలని తెలంగాణ, 58 లక్షల క్యూసెక్కుల వరదను పరిగణనలోకి తీసుకోవాలని ఒడిశా డిమాండ్ చేస్తున్నాయి. ఈ వాదనలతో ఏపీ ఏకీభవించడం లేదు. 58 లక్షల క్యూసెక్కుల వరదను పరిగణనలోకి తీసుకుంటే.. భారీగా భూసేకరణ జరపాలని, ఖర్చు తడిసి మోపెడవుతుందని పేర్కొంటోంది. దీనినే సమర్థించిన జలసంఘం ఒడిశా వాదనను తోసిపుచ్చింది.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ వెంకటరమణ



జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఆయన అనంతరం అఖిలాండం వద్దకు చేరుకుని కర్పూరం వెలిగించి కొబ్బరి కాయలు కొట్టారు. మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ కూడా సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి ఆలయంలో నేడు గోకులాష్టమి ఆస్థానం

- రేపు ఉట్లోత్సవం

తిరుమల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం, ఉట్లోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలిలో మంగళవారం రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య ఉగ్ర శ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశారాధన నిర్వహిస్తారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం చేపడతారు. బుధవారం తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి, కృష్ణస్వామి మాడవీధుల్లో విహరిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తిరుమలలోని గోగర్భం డ్యాం వద్ద మంగళవారం గోకులాష్టమి వేడుకలు నిర్వహిస్తారు.

మూడో విడతలో 5,707 బీటెక్ సీట్లు భర్తీ

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మూడో విడత కౌన్సెలింగ్‌లో 5,707 ఇంజనీరింగ్ సీట్లు భర్తీ అయినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ జి.గణేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 30లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు. మొత్తంగా 248 కాలేజీల్లో 1,39,488 సీట్లు అందుబాటులో ఉంటే 1,16,333 భర్తీ అయ్యాయని, 23,155 సీట్లు మిగిలిపోయాయని వివరించారు. యూనివర్సిటీల ఇంజనీరింగ్ కాలేజీల్లో 7,047 సీట్లు ఉంటే 5,920, ప్రైవేటు కాలేజీల్లో 1,24,491 సీట్లకు గాను 1,02,669, ప్రైవేటు యూనివర్సిటీల్లో 7,950 సీట్లకు 7,744 సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు.

అగ్రి డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్ తేదీలివే

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో ద్వితీయ, తృతీయ సంవత్సర డిప్లొమా కోర్సులకు స్పెషల్ కేటగిరి, చివరి మాన్యువల్, స్పాట్ కౌన్సెలింగ్ తేదీలను వర్సిటీ ప్రకటించింది. ఈ నెల 30వ తేదీ ఉదయం స్పెషల్ కేటగిరిలోని స్పోర్ట్స్, గేమ్స్, ఎన్సీసీ, పీహెచ్, క్యాప్ అభ్యర్థులకు లాంలోని వర్సిటీ సెమినార్ హాల్‌లో కౌన్సెలింగ్ జరగనుంది. అలాగే మాన్యువల్ కౌన్సెలింగ్ అదే రోజు మధ్యాహ్నం జరగనుంది. వచ్చే నెల 5న లాం ప్రాంతీయ పరిశోధన స్థానం ఆడిటోరియంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఓపీఎస్ తప్ప మరో స్కీం అంగీకరించం: యూటీఎఫ్

విజయవాడ (గవర్నర్‌పేట)/అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానం తప్ప మరే ఇతర పెన్షన్ స్కీంను అంగీకరించేది లేదని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. సోమవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘ ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

మసీదులు, చర్చిలను కూల్చాలన్న ఆలోచన బీజేపీకి లేదు: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26: మసీదులు, చర్చిలను కూల్చాలని, రిజర్వేషన్లు ఎత్తివేయాలని బీజేపీ ఎప్పుడూ ఆలోచించలేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడారు. 'బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని సంపూర్ణంగా రద్దు చేస్తుందని ప్రచారం చేశారు. రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదు. రాజ్యాంగానికి కట్టుబడి పనిచేసే పార్టీ బీజేపీ. ప్రతిపక్ష కూటమి కావాలనే దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. జమ్ము కశ్మీర్‌లో అలయెన్స్‌లో భాగంగా కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ.. ఉమ్మడి మేనిఫెస్టో తీసుకొచ్చాయి. తాము అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తామని చెప్పాయి. దేశాన్ని విభజించే ఆలోచన ఇండియా కూటమిదే' అని పురందేశ్వరి ఆరోపించారు.

ఇవేం ఫీజులు బాబోయ్..!

ప్రైవేటు వర్సిటీల్లో డిగ్రీకి భారీ ఫీజులు

- కొత్త ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ అంతే
- కాకినాడలో ఓ వర్సిటీలో బీబీఏ-ఎంబీఏకు 60వేలు
- ఎంబీఏకు రీయింబర్స్‌మెంట్ లేకపోయినా ఖరారు
- మరో కొత్త ప్రైవేటు వర్సిటీలో బీఎస్సీకే రూ.35,500
- రాష్ట్రంలో అన్ని ప్రైవేటు వర్సిటీల్లోనూ భారీ ఫీజులే
- సాధారణ డిగ్రీ కాలేజీల్లో అందులో సగం లోపే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులు చూసి విద్యార్థుల తల్లిదండ్రులు భయపడేవాళ్లు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలోని ప్రైవేటు వర్సిటీల్లో సాధారణ డిగ్రీ ఫీజులు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. తాజాగా డిగ్రీ కోర్సుల ఫీజులు కూడా దాదాపుగా ఇంజనీరింగ్ స్థాయిలో ఖరారు చేయడం విమర్శలకు దారితీస్తోంది. గతంలో ఎప్పుడో ప్రారంభమైన ప్రైవేటు యూనివర్సిటీలతో పాటు ఇటీవల ఇంజనీరింగ్ కాలేజీల నుంచి ప్రైవేటు యూనివర్సిటీలుగా మారిన విద్యా సంస్థల్లోనూ డిగ్రీకి ఫీజులు భారీగా నిర్ణయించారు. కాకినాడ, అన్నమయ్య జిల్లాల్లో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటైన ప్రైవేటు యూనివర్సిటీలకూ భారీ స్థాయిలో ఫీజులు ఖరారు చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీటితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ డిగ్రీకి ఫీజులు భారీగా ఉన్నాయి. మరోవైపు ఈ ఏడాది కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీలకూ డిగ్రీ కోర్సులు అనుమతివ్వగా వాటిలో మాత్రం ఫీజులు రూ. 30వేలు దాటలేదు. ఇక సాధారణ డిగ్రీ కాలేజీల్లో అయితే ఫీజులు మరింత తక్కువగా ఉన్నాయి. అయితే ఎప్పటినుంచో ఉన్న ప్రైవేటు యూనివర్సిటీల్లో ఫీజులు ఎక్కువ ఉండటం ఒకెత్తయితే తాజాగా ప్రైవేటు యూనివర్సిటీలుగా వాటిలోనూ ఈ స్థాయిలో ఫీజులు ఎందుకు నిర్ణయించారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వైసీపీకి సన్నిహితుడిగా ఉండే వ్యక్తికి చెందిన విద్యా సంస్థ ఒకటి ఈ ఏడాది ప్రైవేటు యూనివర్సిటీగా మారింది. ఈ ఏడాది ఆ వర్సిటీలో కొత్తగా ప్రారంభించిన బీబీఏ హానర్స్-ఎంబీఏ అనే ఇంటిగ్రేటెడ్ కోర్సుకు ఏకంగా రూ.60వేలు ఫీజు ఖరారు చేశారు. అయితే ఈ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు ఎలా అనుమతిచ్చారనేది కూడా అనుమానంగా మారింది. ఎందుకంటే రాష్ట్రంలో డిగ్రీకి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతున్నా... పీజీకి ఈ పథకం అమల్లో లేదు. వైసీపీ ప్రభుత్వం పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేసింది. కానీ ఇంటిగ్రేటెడ్ కోర్సులో డిగ్రీతో పాటు ఎంబీఏ కూడా ఉంటుంది. మరి రీయింబర్స్‌మెంట్ లేనప్పుడు బీబీఏతో పాటు ఎంబీఏ కూడా కలిసి ఉండే కోర్సుకు ఎలా అనుమతిచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లాలోని కొత్త ప్రైవేటు యూనివర్సిటీలోనూ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ-ఏఐ, బీఎస్సీ-డేటా సైన్స్ కోర్సులకు రూ.35,500గా ఫీజులు పెట్టారు. మరో కొత్త ప్రైవేటు వర్సిటీలో బీసీఏకు రూ.37వేలు ఫీజు నిర్ణయించారు. గత ప్రభుత్వంలో ప్రారంభమైన ఒక ప్రైవేటు యూనివర్సిటీలో డిగ్రీ ఫీజులు రూ.42పైనే ఉన్నాయి. మరో ప్రైవేటు యూనివర్సిటీలో బీఎస్సీ-ఫారెస్ట్రీ కోర్సు ఫీజు రూ.59వేలుగా ఉంది. తిరుపతిలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలోనూ బీసీఏ, బీబీఏ కోర్సుల ఫీజులు రూ.44వేలకు పైగా ఉన్నాయి.



భారీ వ్యత్యాసం

డిగ్రీ ఫీజుల విషయంలో రాష్ట్రంలో పలు విద్యా సంస్థల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. 1,150 సాధారణ డిగ్రీ కాలేజీల్లో కేవలం 30 కాలేజీలకే మెరుగ్గా ఫీజులున్నాయి. బీసీఏ, బీబీఏ కోర్సులకు 30 కాలేజీల్లో ఫీజులు రూ.30వేలుగా ఖరారు చేశారు. మిగిలిన 1,100కు పైగా కాలేజీల్లో ఆ కోర్సుల ఫీజులు రూ.18వేలు దాటలేదు. ఇక బీఎస్సీ ఫీజు రూ.15వేలు, బీఏ ఫీజు రూ.12వేలుగా ఉన్నాయి. ఇక ఈ ఏడాది కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ కోర్సులు ప్రారంభించగా వాటిలో బీసీఏ, బీబీఏ కోర్సుల ఫీజులు రూ.30వేలుగా నిర్ణయించారు. ఇలా డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు, ప్రైవేటు యూనివర్సిటీల మధ్య ఫీజుల్లో భారీ వ్యత్యాసం ఏర్పడింది. అందులోనూ కొత్త ప్రైవేటు వర్సిటీలకు భారీ ఫీజులు నిర్ణయించడంపై కాలేజీ యాజమాన్యాల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది.



శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి వెళుతున్న రష్యన్లు

ముక్కంటి సేవలో రష్యన్లు

శ్రీకాళహస్తి, ఆగస్టు 26: శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రష్యా దేశానికి చెందిన 40 మంది భక్తులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయగా వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో శిల్పకళ చాలా అద్భుతంగా ఉందన్నారు.

'ఆర్డీఎస్, గురు రాఘవేంద్ర'లకు నిధులివ్వండి

- సీఎం చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్)కు, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం మరమ్మతులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం ఆయన లేఖ రాశారు. 'మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలు కరువు కాటకాలతో అల్లాడుతున్నాయి. అవి అభివృద్ధి చెందాలంటే 4 టీఎంసీలతో రాజోలిబండ కుడి కాలువ నిర్మించాల్సిన అవసరముంది. దీనికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1,985.42 కోట్ల అంచనా వ్యయంతో పాలన ఆమోదం తెలిపింది. సుమారు రూ.13 కోట్ల విలువైన పనులు కూడా చేశారు. ఈ ప్రాజెక్టు తక్షణ మరమ్మతులకు అవసరమైన నిధులను గత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో మరమ్మతులు జరగలేదు' అని రామకృష్ణ తన లేఖలో వివరించారు.

ఏనుగుల దాడిలో రైతు మృతి

కొమరాడ, ఆగస్టు 26: పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం ఏనుగుల దాడిలో ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన వాన శివుడు (60) అరటి తోటలో కలుపుతీసేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లాడు. ఆ సమయంలో తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు ఆయనపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన శివుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత అటుగా వచ్చిన కొంతమంది రైతులు శివుడు మృతదేహాన్ని చూసి గ్రామస్థులకు , కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ నీలకంఠం ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతుని కుటుంబాన్ని స్థానిక టీడీపీ నాయకులు పరామర్శించారు.

'అంత సొమ్ము'ను విత్‌హోల్డ్ చేయండి

- మిగిలిన పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించండి
- బంగారం చోరీకి గురైందని.. ప్రయోజనాలు నిలిపివేయడం సరికాదు
- యూబీఐ బ్యాంకుకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శాఖాపరమైన విచారణ పెండింగ్‌లో ఉందనే కారణంతో ఓ ఉద్యోగి పదవీ విరమణ ప్రయోజనాలను బ్యాంకు నిలిపివేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. బంగారం చోరీ చేసి బ్యాంకుకు నష్టం చేకూర్చారని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో బంగారానికి సమాన విలువ సొమ్మును విత్‌హోల్డ్ చేసి పదవీ విరమణ ప్రయోజనాలను విడుదల చేయాలని బ్యాంకు అధికారులకు స్పష్టం చేసింది. శాఖాపరమైన విచారణను మూడు నెలల్లో పూర్తి చేయాలని, విఫలమైతే విత్‌హోల్డ్ చేసిన రూ.4.42లక్షల సొమ్మును ఉద్యోగికి చెల్లించాలని తేల్చి చెప్పింది. శాఖపరమైన విచారణ పూర్తయ్యేవరకు ఉద్యోగికి ప్రొవిజనల్ పెన్షన్ విడుదల చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉందనే కారణంతో తన పదవీ విరమణ ప్రయోజనాలను విడుదల చేయడం లేదని, బ్యాంకు ఖాతాను సైతం స్తంభింపజేశారని పేర్కొంటూ నరసరావుపేటకు చెందిన యూబీఐ బ్యాంకు ఉద్యోగి బీఎం నాయక్ 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి విచారణ పెండింగ్‌లో ఉందనే కారణంతో పిటిషనర్ పదవీ విరమణ ప్రయోజనాలను నిలిపివేయడం సరికాదన్నారు. తక్షణం సొమ్ము విడుదల చేయాలని 2023 అక్టోబరులో తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ యూబీఐ అధికారులు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. వారి తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ ఆభరణాలు భద్రపరిచిన గదిలోకి వెళ్లి బంగారాన్ని దొంగిలించారన్నారు. అతనిపై క్రిమినల్ కేసు నమోదైందన్నారు. పిటిషనర్‌పై ఆరోపణలు తేలేవరకు గ్రాట్యుటీ సొమ్మును విత్‌హోల్డ్ చేసే అధికారం బ్యాంకుకు ఉందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌కు పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించే విషయాన్ని బ్యాంకు అధికారులు ఎక్కడా వ్యతిరేకించడం లేదని గుర్తు చేసింది.

టమాటా ధరలపై మార్కెటింగ్ శాఖ జోక్యం

- రైతులను ఆదుకోవాలని మంత్రి అచ్చెన్న ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న టమాటాల ధరలు తగ్గిన నేపథ్యంలో రైతుల శ్రేయస్సు దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో మంగళవారం నుంచి టమాటాల వేలంలో జోక్యం చేసుకుని, మార్కెట్‌లో పోటీ ఏర్పర్చాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. అవసరమైతే ధరల స్థిరీకరణ నిధితో టమాటాలను సేకరించి రైతు బజార్లలో విక్రయించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో సాగవుతున్న టమాటా పంట వర్షాల వల్ల దెబ్బతినడంతో నాణ్యత తగ్గి, రైతులకు గిట్టుబాటు ధర రావట్లేదు. దీంతో కొందరు రైతులు తక్కువ ధరకు అమ్మలేక, కూలీ ఖర్చులు దండగ పడలేక పంటను తోటల్లో వదిలేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం, కర్నూలు మార్కెట్లలో టమాటా కిలో రూ.7 నుంచి రూ.23వరకు పలుకుతోంది. ఈ మార్కెట్లకు రోజుకు 3వేల నుంచి 4,500టన్నుల టమాటా వస్తోంది. 555, 448రకాల టమాటా తక్కువ నిల్వ స్వభావం కలిగి ఉండటంతో ఈ రకాలకు వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. ప్రాసెసింగ్‌కు అనువు కాని ఈ రకాలకు మంచి ధర రావట్లేదు. మంత్రి ఆదేశాలతో మార్కెట్‌లో జోక్యం చేసుకుని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ల మెడకు ఓటీఎస్ ఉచ్చు

సొమ్ము చెల్లించకుండానే వైసీపీ సర్కారులో రిజిస్ట్రేషన్లు

- ఒక్కోవార్డు పరిధిలో 50-100 ఇళ్లు
- ఒక్కో ఇంటికి రూ.10వేల రుసుము
- లబ్ధిదారులు నగదు ఇవ్వకపోయినా ఓటీఎస్ పూర్తి
- ప్రభుత్వం మారడంతో అంతా అయోమయం
- లబోదిబోమంటున్న డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ సెక్రటరీలు

గుంటూరు సిటీ, ఆగస్టు 26: గత ప్రభుత్వ పాపాలు సచివాలయ ఉద్యోగుల పాలిట శాపాలుగా మారాయి. ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్మెంట్) కార్యక్రమం డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల మెడకు చుట్టుకుంది. గృహ నిర్మాణాలపై బకాయిలు ఉన్న లబ్ధిదారులు.. వన్ టైం సెటిల్‌మెంట్ పథకం కింద రూ.10 వేలు చెల్లిస్తే.. ఆ ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్న కార్యక్రమాన్ని గత ప్రభుత్వం చేపట్టింది. 2022లో మొదలైన ఈ కార్యక్రమం సుమారు ఆరు నెలల పాటు సాగింది. ప్రతి రోజూ కొంత లక్ష్యాన్ని నిర్దేశించి ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్‌లను బాధ్యులుగా చేశారు. ప్రభుత్వం చెప్పిన మాటలు లబ్ధిదారులకు అధికారులు వివరించినా చాలా మంది రూ.10 వేలు చెల్లించేందుకు ముందుకు రాలేదు. పైగా 'మా ఇళ్లకు మీరు రిజిస్ట్రేషన్లు చేసేదేమిటం'టూ లబ్ధిదారులు ఎదురు తిరిగారు. చేసేది లేక ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు ఆ బాధ్యతను భుజానెత్తుకున్నారు. లబ్ధిదారులు నగదు చెల్లించకపోయినా ఆయా ఇళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లు, నో డ్యూ సర్టిఫికెట్లు డిజిటల్ అసిస్టెంట్‌లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల లాగిన్‌ల నుంచి డౌన్‌లోడ్ చేయించారు. వీటికి సంబంధించి నగదు అడిగితే.. తర్వాత చూద్దాంలే అంటూ ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు కాలం గడుపుతూ వచ్చారు. ఒక్కొక్క డిజిటల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ లాగిన్ నుంచి సుమారు 50 నుంచి 100కు తగ్గకుండా డాక్యుమెంట్లు, నో డ్యూ సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో లబ్ధిదారు తరఫున రూ.10వేల చొప్పున అనుకుంటే.. 50 నుంచి 100 ఇళ్లకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు బదిలీ కావాలంటే నో డ్యూ (బాకీ లేనట్టు) సర్టిఫికెట్ కూడా దరఖాస్తుకు జత పరచాలి. నో డ్యూ సర్టిఫికెట్ లేకుండా అసలు బదిలీకి దరఖాస్తు చేసే అవకాశమే లేదు. అయితే, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు చెబితేనే డబ్బులు చెల్లించకపోయినా లబ్ధిదారులకు ఆయా పత్రాలు డౌన్‌లోడ్ చేసి ఇచ్చామని, వాటికి సంబంధించిన లక్షలాది రూపాయలు చెల్లించాలంటే తామెక్కడ నుంచి తీసుకురావాలని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. పోనీ ఈ విషయంలో ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లను నిలదీద్దాం అంటే వాళ్లంతా బదిలీలపై వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారని చెబుతున్నారు. అప్పటి ప్రభుత్వం, అధికారులు తమను ఈ వ్యవహారంలో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 14వేల మంది డిజిటల్ అసిస్టెంట్‌లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు ఉండగా, ఎక్కువమంది ఇలా ఓటీఎస్ ఉచ్చులో చిక్కుకొని ఆందోళన చెందుతున్నారని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ తెలిపారు. అధికారులు చెప్పినట్టు చేసినందుకు చిన్న ఉద్యోగులను ఇరికించారని ఆరోపించారు. ఒక్కొక్క ఉద్యోగి రూ.ఐదు నుంచి రూ.10 లక్షల వరకు చెల్లించాలంటే ఎక్కడ నుంచి తీసుకురావాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, డిజిటల్ అసిస్టెంట్‌లు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల బదిలీకి అనుమతించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులతో ఎస్పీ ఎం.దీపిక, ఇతర అధికారులు

912 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు, లారీ సీజ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26: ఒడిశా రాష్ట్రం నుంచి రవాణా అవుతున్న 912 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మల్కన్‌గిరి ప్రాంతం నుంచి గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం అందడంతో సబ్బవరం మండలం గుల్లేపల్లి జంక్షన్ వద్ద ఆదివారం పొద్దుపోయాక సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ ఆర్.ధనుంజయ్ వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఏపీ రిజిస్ట్రేషన్ కలిగిన ఒక లారీ క్యాబిన్‌లో వెనుక, డ్రైవర్ పైభాగంలో రహస్యంగా అమర్చిన 912 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని, దాని విలువ రూ.45.6 లక్షలు ఉంటుందన్నారు. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా పాలకుర్తి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బారావత్ తరుణ్ (22)తో పాటు రూట్ గైడ్‌గా వ్యవహరిస్తున్న మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు గ్రామానికి చెందిన సేతి మల్లేశ్వరరావు (24)ను అరెస్టు చేసినట్టు ఆమె తెలిపారు. వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో ఐదుగురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు.

చెన్నైలో అమరజీవి స్మారక భవన నిధులకు కృషి చేస్తా: మండలి

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణకు కారణమైన అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదానాన్ని, ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం చెన్నై వచ్చిన ఆయన మైలాపూర్‌లో ఉన్న అమరజీవి స్మారక మందిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చెన్నైకు వచ్చే ప్రముఖులు పొట్టి శ్రీరాములు స్మారక భవనాన్ని సందర్శించాలని కోరారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కాగానే అమరజీవి స్మారక భవనాన్ని నిర్మించారని, ప్రస్తుతం టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో గతంలో కంటే ఎక్కువ నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పొట్టి శ్రీరాములు ఆశయాలంటే అమితమైన ఇష్టమని, అందుకే సభల్లో ఆయన ఆశయాలను ప్రస్తావిస్తుంటారని తెలిపారు.



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద బుద్ధప్రసాద్ తదితరులు

'సినర్జిన్' ఫార్మా ప్రమాదంలో మరో ఇద్దరు మృతి

- మూడుకు చేరిన మృతుల సంఖ్య



సూర్యనారాయణ, లాల్‌సింగ్ పూర్తే

పరవాడ/అనకాపల్లి, ఆగస్టు 26: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని 'సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ'లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరు మృతిచెందారు. హెల్పర్ లాల్‌సింగ్‌పూర్తే (23) ఆదివారం రాత్రి, కెమిస్ట్ కోరాడ సూర్యనారాయణ సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. గత గురువారం అర్ధరాత్రి సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో కెమిస్ట్‌తో పాటు మరో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందజేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'అమెరికా యుద్ధం'

పశ్చిమాసియాలో వేడెక్కిన పరిస్థితులను చూస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు మూడో ప్రపంచయుద్ధం తప్పదనిపిస్తోందట. క్షిపణులతో దాడులు చేసుకుంటున్న దేశాలతో చర్చలు జరపాల్సిన కమలాహారిస్ తీరిగ్గా బస్సులో తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేసుకుంటోందనీ, నిద్రముఖం బైడెన్ కాలిఫోర్నియా బీచ్‌లో నిద్రపోతున్నాడనీ ట్రంప్ విమర్శించారు. మూడోప్రపంచ యుద్ధం వస్తోందంటూ ట్రంప్ హెచ్చరించడం గత పదేళ్ళకాలంలో ఇది ముప్పైరెండోసారి అని ఓ సర్వే సంస్థ లెక్కలు వేసింది. కమల నాయకత్వంలో అమెరికా క్షేమంగా ఉండబోదని, మనందరినీ ఆమె అణుయుద్ధంవైపు తీసుకుపోతోందనీ, ప్రపంచంలోని నియంతలు ఆమెను లెక్కచేయరనీ అమెరికన్లను హెచ్చరించడం ట్రంప్ లక్ష్యం. నవంబరు 5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో వీరిద్దరిలో ఎవరు గెలిచినా, ఇజ్రాయెల్‌తో ఎంత ప్రేమగా ఉంటారో తెలియనిదేమీ కాదు.

జో బైడెన్ తప్పుకోకుండా, అధ్యక్ష అభ్యర్థిగానే కొనసాగివుండివుంటే, ఎన్నికల ప్రచారం ఇంత వేడిగా సాగేది కాదేమో. విమర్శలతోపాటు విధానాల ప్రస్తావనలు, హామీలు కూడా ప్రచారంలో వినవస్తున్నాయి. డెమొక్రాటిక్ పార్టీ కన్వెన్షన్ ఆఖరురోజున కమలాహారిస్ చేసిన ప్రసంగం ఆకర్షణీయంగా ఉంది. ట్రంప్ అధికారంలోకివస్తే దేశాన్ని నాశనం చేస్తాడన్న విమర్శతో పాటు, పార్టీ, జాతి, లింగం, భాష ఇత్యాది భేదాలేవీ లేకుండా ప్రతీ ఒక్క అమెరికన్ శ్రేయస్సు కోసం తాను కృషిచేస్తానని ఆమె ప్రకటించారు. గతంలో దేశం చవిచూసిన విభజన, విద్వేషం తన ఏలుబడిలో ఉండబోవని హామీ ఇచ్చారు. అధికారం దక్కితే పట్టపగ్గాల్లేకుండా వ్యవహరించడం ట్రంప్‌కు అలవాటంటూ కొన్ని ఘట్టాలను ఆమె ఉదహరించారు. ప్రజాస్వామ్యం మీద ఏమాత్రం విశ్వాసం లేని, నిలకడలేని వ్యక్తి అంటూ, అధికార బదిలీ సందర్భంగా ఆయన తన పార్టీ కార్యకర్తలను కాపిటల్ హిల్ మీద దాడులకు పురిగొల్పిన ఘట్టాన్ని గుర్తుచేశారు. పార్టీ నామినేషన్‌ను ఆమోదిస్తున్న ఈ సందర్భాన్ని తన భావజాలాన్నీ, నేపథ్యాన్నీ వివరించేందుకు ఉపయోగించుకున్నారు. భారతదేశంనుంచి వలసవచ్చిన తన తల్లిప్రయాణాన్ని, తల్లిదండ్రుల జీవితాన్ని వివరించారు ఆమె. శ్రామికులు అధికంగా ఉండే ప్రాంతంలో పెరగడం, మధ్యతరగతి నేపథ్యం, పొదుపుగా బతకడం, ఉన్నదానిలో సర్దుకోవడం వంటి ప్రస్తావనలు ఓటర్ల మనసు గెలుచుకోవడానికి ఉపకరిస్తాయని ఆమె ఆశిస్తున్నట్టుంది. తన విధానాలను వివరిస్తున్నప్పుడు కూడా ఆరోగ్యం, నివాసం, రోజువారీ అవసరాలు, ఖర్చులు ఇత్యాది విషయాలపైనే ఆమె దృష్టిపెట్టారు. చైనాను నెంబర్ వన్ కానివ్వనంటూ అమెరికన్లను ఉత్సాహపరిచారు కానీ, గాజాయుద్ధం, ఉక్రెయిన్‌కు సాయం అంశాల్లో మార్పేమీ ఉండబోదని ఆమె ప్రసంగం సారాంశం. పాలస్తీనియన్ల బాధలు వర్ణనాతీతం అంటూ ఎప్పటిలాగానే కాస్తంత జాలిపడ్డారంతే.

ఒబామాలు, క్లింటన్లు సహా అనేకమంది దిగ్గజాల మద్దతుతో కమలాహారిస్ మరింత శక్తిమంతురాలైనారు. నెలరోజుల క్రితం వరకూ డెమొక్రాట్లలో ఈ మాత్రం ఉత్సాహం లేదు. ట్రంప్‌మీద హత్యాయత్నం జరిగి, రక్తమోడుతున్న మొఖంతో ఆయన గాలిలోకి తన పిడికిలి విసిరిన దృశ్యం చూసిన తరువాత డెమొక్రాట్లు పూర్తిగా నీరుకారిపోయారు. దీనికి కాస్తంత ముందు ట్రంప్‌తో జరిగిన చర్చలో బైడెన్ బాగా తడబడి ట్రంప్‌కు ఎక్కడలేని శక్తీ ఇచ్చారు. పార్టీ నాయకుల ఒత్తిళ్ళమేరకు, విధిలేక బరినుంచి తప్పుకోవాల్సివచ్చినప్పటికీ ఆ నిర్ణయంతో బైడెన్ పార్టీని గట్టిపోటీకి సిద్ధంచేశారు. జారిపోయి, పారిపోయిన డెమొక్రాట్లు ఇప్పుడు కొత్తనాయకత్వంలో తిరిగి యుద్ధరంగంలోకి అడుగుపెట్టి మంచిపోరాట పటిమను ప్రదర్శించడం ట్రంప్‌ను ఆత్మరక్షణలో పడవేసింది. ఆమె జెండర్‌ను, మూలాలను ప్రస్తావించడం, అవహేళన చేయడం ఆరంభించారు. ఫాసిస్టులు, కమ్యూనిస్టులు అమెరికాను ఆక్రమించుకోవడానికి కుట్రపన్నుతున్నారని హెచ్చరిస్తూ, కమలకు ముందు కామ్రేడ్ అనే పదాన్ని చేర్చి మరీ సంబోధిస్తున్నారు. ట్రంప్ వస్తే దేశానికి ఎంత ప్రమాదమో కమల చెబుతున్నారు. ఆయనకు అధికార కాంక్షతప్ప, దేశం మీద ప్రేమలేదని ఆమె హెచ్చరిస్తున్నారు. జూన్‌లో జరిగిన ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్‌ను వెనక్కునెట్టేసిన ట్రంప్, వచ్చేనెల చర్చలో కమలను ఎలా ఎదుర్కొంటారో చూడాలి. ప్రస్తుతానికి ఎన్నికల సర్వేల్లో కమలాహారిస్ ఓ మెట్టు పైనే ఉన్నప్పటికీ, ఎన్నికలకు మరో రెండునెలలు ఉన్నందున గాలి ఎటువైపు బలంగా తిరుగుతుందో ఇప్పుడే చెప్పలేం. 'మేకింగ్ అమెరికా గ్రేట్' అన్నమాటనే నమ్ముతారో, బహుళత్వాన్నే బలపరుస్తారో చూడాలి.

ఎన్నికలు కశ్మీర్‌ను గట్టెక్కించగలవా?



పదేళ్ల తర్వాత జమ్ము కశ్మీర్ శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇది అమిత ఆనంద దాయక పరిణామం. సుప్రీంకోర్టు విధించిన గడువు (సెప్టెంబర్ 30) మూలంగానే అక్కడ ఈ ఎన్నికలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్నికలైనా కశ్మీర్‌ను నిరంతర సంక్షోభం నుంచి బయటపడేలా చేయగలవా, జమ్మూ కశ్మీర్ ప్రాంతాలు రెండు మతాలకు ప్రాతినిధ్యం వహించేవిగా కాకుండా తోబుట్టువులుగా బతికే రోజులను ఆవిష్కరిస్తాయా? టెర్రరిజం నుంచి కశ్మీర్‌ను విముక్తం చేయగలుగుతాయా?

2019లో జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని (ఆర్టికల్ 370) రద్దు చేసి దానిని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడదీసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొంత కాలానికి రాష్ట్ర హోదాను తిరిగి ఇవ్వగలమని పదే పదే హామీ ఇచ్చారు. చివరికి దానిని నెరవేర్చకుండానే శాసన సభ ఎన్నికలు జరిపిస్తున్నారు. కేవలం ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. అవి దానికి ముఖద్వారం మాత్రమే. సమానతకు, సమనీతికి, స్వేచ్ఛకు, మానవ హక్కులకు ప్రజాస్వామ్యం హామీగా నిలుస్తుంది. దానికి దారి దీపం వంటి ఎన్నికల వ్యవస్థ స్వచ్ఛతను హరించే పాలకుల వల్ల ఏమి జరుగుతుందో కశ్మీర్, హర్యానా షెడ్యూల్ ప్రకటన సందర్భంలో వెల్లడయింది.

బీజేపీ కూటమికి విజయావకాశాలు తక్కువగా ఉన్న మహారాష్ట్రలో వాటిని పెంచుకోడానికి అవసరమైన సమయం కోసం అక్కడ ఎన్నికలను కేంద్ర పాలకులు వాయిదా వేయించుకోగలిగారు. హర్యానాతో బాటు జరగవలసిన ఆ రాష్ట్ర ఎన్నికలను పండగల సాకు చూపి ఆవలకు జరిపించగలిగారు. ఇటువంటి అవసరాలను దృష్టిలో ఉంచుకునే కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థను చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. గత పార్లమెంటులో తమకున్న స్పష్టమైన మెజారిటీని ఉపయోగించుకుని ముగ్గురు సభ్యుల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి చోటు లేకుండా చేశారు. ఎన్నికల నిర్వహణ మీద కూడా దీని ప్రభావం పడుతున్నది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల ప్రచార ఘట్టంలో ప్రధాని మోదీ ఎంతగా నియమోల్లంఘనకు పాల్పడ్డారో తెలిసిందే. అయినా ఎన్నికల కమిషన్ కళ్ళప్పగించి చూసిందే గాని ఏమీ చేయలేకపోయింది.

జమ్మూ కశ్మీర్‌లో టెర్రరిజం నిర్మూలన ఇంకా జరగలేదు. ఇప్పుడు అది కొత్తగా జమ్మూ ప్రాంతానికి వ్యాపించి పేట్రేగుతున్నది. ఆ రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తిని హరించిన తర్వాత త్వరలోనే ఎన్నికలు జరిపి ప్రజామోదం పొందుతామని బీజేపీ చెప్పింది. 2021లోనే ప్రధాని మోదీ ఇందుకు హామీ ఇచ్చారు. శాసనసభ నియోజకవర్గాల హద్దుల పునర్నిర్ణయ ప్రక్రియ పూర్తి కాగానే జమ్మూ కశ్మీర్లో ఎన్నికలు జరిపిస్తామని ప్రకటించారు. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేసి, రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత మొట్టమొదటిసారిగా మాజీ ముఖ్యమంత్రులు సహా ఆ ప్రాంత కీలక నాయకులతో సమావేశమైనప్పుడు ప్రధాని ఈ హామీ ఇచ్చారు.

> ప్రజలను వేధింపులకు గురిచేసి వారి స్వేచ్ఛలను కాలరాస్తున్నారనే అభిప్రాయం ఉన్న చోట వారు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఎక్కడైనా, ఎప్పుడైనా మిలిటరీ పరిష్కారం ఒక్కటే చాలదు. ప్రజల హృదయాలను గెలుచుకోవాలి. ప్రస్తుత కశ్మీర్ ఎన్నికల ఘట్టం స్వాగతించదగినదే. ఏదో ఒక స్థాయి ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ వల్ల ఆ ప్రాంతం ఆ మేరకు గాలి పీల్చుకోగలుగుతుంది.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత మొదటిసారిగా గత మార్చిలో ప్రధాని కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర ప్రజల అభిమానాన్ని సంపాదించడం కోసం ఆయన ఈ యాత్రకు వెళ్లారు. 370 రద్దు వల్ల కశ్మీర్ ప్రజలు స్వతంత్రంగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నారని బానిసత్వం నుంచి బయటపడ్డారని వారి హృదయాలను గెలుచుకుంటానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అయితే ఇంతకాలం అక్కడ ఎన్నికలు జరిపించడం కంటే, ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా చేసుకోడానికే ప్రాధాన్యమిస్తూ కమలనాథులు పావులు కదిపారు. నియోజకవర్గాల పునర్విభజనను కూడా ఇందుకు దుర్వినియోగం చేశారు. అధిక జనాభా గల కశ్మీర్ లోయలో అదనంగా ఒకే ఒక నియోజకవర్గాన్ని కలిపి జమ్మూ ప్రాంతానికి ఆరు కొత్త నియోజక వర్గాలను చేర్చిన పునర్విభజన ప్రక్రియ విమర్శలకు గురి అయింది. హిందూ ప్రాంతమైన జమ్మూకి అధిక నియోజకవర్గాలను చేర్చడం వెనుక బీజేపీ కుట్ర ఉన్నదని కశ్మీర్ నాయకులు, మేధావులు ఆరోపించారు. దేశమంతటా నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరగవలసి ఉండగా జమ్మూ కశ్మీర్‌లో అందుకు తొందరేల వచ్చిందనే ప్రశ్న తలెత్తింది.

ఇటువంటి చర్యల ద్వారా బీజేపీ కశ్మీర్ లోయ ప్రజలకు మరింత దూరమైంది. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ లోయలో బీజేపీ పోటీ చేయలేకపోడం ఇందుకు ప్రబల నిదర్శనం. కశ్మీర్ లోయలో మూడు లోక్‌సభ స్థానాలున్నాయి. మొన్నటి ఎన్నికల్లో అందులో రెండింటిని నేషనల్ కాన్ఫరెన్స్ గెలుచుకోగా ఒకటి ఇండిపెండెంట్ కైవసమయింది. జమ్మూలోని రెండు స్థానాల్లో బీజేపీ గెలిచింది. కశ్మీర్‌ను చావబాది చెవులు మూశామని దేశమంతటా జబ్బలు చరుచుకునే బీజేపీ తన చర్యకు లోయ ప్రజల మద్దతు కూడగట్టలేకపోయిన వాస్తవం కళ్ళకు కడుతున్నది. తన ఆశయ సాధన కోసం లోక్‌సభలో మెజారిటీ సిద్ధించగానే ఆర్టికల్ 370 రద్దును జరిపించివేసి ఆ తర్వాత దానికి అక్కడి ప్రజల మద్దతు కూడగట్టాలని వేసుకున్న పథకం బెడిసికొట్టింది. గవర్నర్ ఉండే రాష్ట్ర అసెంబ్లీకి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) గల కేంద్రపాలిత ప్రాంత (యుటి) అసెంబ్లీకి చాలా తేడా ఉంది. ఎల్‌జి అదుపాజ్ఞలలోని యుటి శాసనసభకు ఆ ప్రాంత మనుగడకు సంబంధించిన కీలక అంశాలపై శాసనాలు చేసే అధికారం ఉండదు. అవి కేంద్రానికే దఖలుపడి ఉంటాయి. విద్య సాంస్కృతిక వ్యవహారాల వంటి కొద్ది అంశాలకే కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ పరిమితమై ఉంటుంది. కశ్మీర్ ఎల్‌జి అధికారాలను అపరిమితంగా పెంచుతూ మొన్న జూలైలోనే కేంద్రం చట్టాన్ని సవరించింది. పోలీసులు శాంతిభద్రతలు, నియామకాలు, బదిలీలపై అంతిమ అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కట్టబెట్టింది. అందుకే లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలోని కేంద్ర పాలిత ప్రాంత శాసనసభ ఎన్నికల్లో పోటీచేయడం నామోషీ అనుకొని వాటికి దూరంగా ఉండడానికి ప్రధాన రాజకీయ పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపిలు మొదట్లో నిర్ణయించుకున్నాయి. ఇప్పుడు అవి మనసు మార్చుకున్నాయి. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని బరిలో దిగుతున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నది. మరో ప్రధాన రాజకీయపక్షం పిడిపి కూడా బీజేపీతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఇండియా కూటమి భాగస్వామిగా కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్‌లతో పొత్తుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించింది. అక్కడ కేంద్ర పాలన విధించడానికి ముందు వరకు ఆ పార్టీ బీజేపీతో కలిసి అప్పటి రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపింది. ఆర్టికల్ 370, 35ఎ (జమ్మూ కశ్మీర్ శాశ్వత పౌరుల హక్కుల పరిరక్షణ)లను పునరుద్ధరింప జేస్తానన్న వాగ్దానాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ తన ఎన్నికల ప్రణాళికలో చేర్చడం గమనించవలసిన అంశం.. అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ద్వారా ఇచ్చిన తన తాజా తీర్పులో కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని, ప్రత్యేక హక్కుల రద్దును ధ్రువీకరించినప్పటికీ అంతకు ముందు మూడు సార్లు ఆర్టికల్ 370ను సుప్రీంకోర్టు సమర్థించిన విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా గుర్తుచేస్తున్నారు. ఈ ఆర్టికల్ పునరుద్ధరణకు రాజకీయంగా పోరాడుతామని ఆయన ప్రకటించారు. హర్యానా, జమ్మూ కశ్మీర్ శాసనసభల్లోని ఎన్నికలు జరుగుతున్న స్థానాల సంఖ్య ఒకటే (90). కాని హర్యానాలో ఒకే ఒక్క రోజులో పోలింగ్ ముగిసిపోనుండగా కశ్మీర్‌లో మూడువిడతల్లో జరుగనుండడం గమనించదగినది. ప్రశ్నకు, ప్రతిపక్షానికి ఆస్కారం లేని లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలోనూ జమ్మూ కశ్మీర్‌ను దారికి తెచ్చుకోలేకపోడం స్పష్టంగా కనిపిస్తున్న బీజేపీ వైఫల్యం.


1989 నుంచి 2019 వరకు అక్కడ కశ్మీర్‌లో ఎన్నికల స్వచ్ఛతపై అంతర్జాతీయ ప్రజాస్వామిక పర్యవేక్షకులు అనుమానం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. భద్రతా దళాలు, ప్రజలను భయపెట్టి పోలింగ్ బూత్‌లకు తరుముతున్నాయనే ఆరోపణ తరచూ వినిపిస్తుంది. జమ్మూ కశ్మీర్ జనాభా 1.56 కోట్లు, ఓటర్లు 87.09 లక్షలు, పురుష ఓటర్లు 44.46 లక్షలు, స్త్రీలు 42.62 లక్షలు. మొదటిసారి ఓటు హక్కు పొందినవారు 3.71 లక్షల మంది. ప్రజలను వేధింపులకు గురిచేసి వారి స్వేచ్ఛలను కాలరాస్తున్నారనే అభిప్రాయం ఉన్న చోట వారు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఎక్కడైనా, ఎప్పుడైనా మిలిటరీ పరిష్కారం ఒక్కటే చాలదు. ప్రజల హృదయాలను గెలుచుకోవాలి. ప్రస్తుత కశ్మీర్ ఎన్నికల ఘట్టం స్వాగతించదగినదే. ఏదో ఒక స్థాయి ప్రజాప్రాతినిధ్య వ్యవస్థ వల్ల ఆ ప్రాంతం ఆ మేరకు గాలి పీల్చుకోగలుగుతుంది.

• జి. శ్రీరామమూర్తి
(సీనియర్ జర్నలిస్ట్)

కులగణన వెనుక కుట్ర కోణం!

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఎప్పుడూ గుర్తుకురాని కులగణన అంశం కేంద్రంలో బీజేపీ అధికారంలోకి పదేపదే వస్తుండడంతోనే ఎందుకు మొదలైంది అనేది ఆలోచించాల్సిన అంశం. భారత్‌లో వందలాది కులాలు ఉన్నాయి. అందులో అధిక భాగం హిందువులే కావడం గమనార్హం. వాస్తవానికి భారత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, జూన్ 2011లో దేశవ్యాప్తంగా ఇంటింటికి సమగ్ర గణన ద్వారా సామాజిక, ఆర్థిక, కుల గణన (SECC) 2011ను ప్రారంభించింది. ఇటీవల బిహార్‌లో జేడీయూ నేతృత్వంలోని నితీశ్ కుమార్ ప్రభుత్వం ఓబీసీ జన గణనను చేపట్టింది. దేశంలో ఉన్న ముస్లింలంతా ఓటు బ్యాంక్‌గా మారడంతో ఆయా రాజకీయ పార్టీలు వారి ఓట్ల కోసం నానా అవస్థలు పడుతున్నాయి. తద్వారా వారి ఓట్లు 20శాతం దాకా గంపగుత్తగా పడితే చాలు తమ పార్టీల గెలుపు సులువవుతుందని భావిస్తూ బహిరంగంగా వారికి మద్దతు పలుకుతున్నాయి. ఇక క్రిస్టియన్‌లు కూడా అంతే. మైనార్టీ జపం చేసే పార్టీల వెంట వెళుతున్నారు. ఇక మిగిలింది 75శాతం పైగా ఉన్న హిందువులు, ముఖ్యంగా ఓబీసీలు ఇటీవల ఐక్యమవుతుండడంతో బీజేపీ అధికారంలోకి వస్తోందని, కాబట్టే హిందువులు ఒకటిగా కాకుండా చూడాలనే కుట్రలో భాగంగా ఈ పార్టీలు కులగణన అంశాన్ని నెత్తినెట్టుకుంటున్నాయి. కులాల పేరుతో, రిజర్వేషన్ల పేరుతో హిందువులైన ఓబీసీలను విడగొట్టి బీజేపీ నుంచి దూరం చేయాలని భావిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అందుకే కావచ్చు ఇటీవల రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో బహిరంగంగా హిందువులు హింసావాదులు అంటూ తీవ్ర విమర్శలు చేయడమే కాకుండా ఓబీసీల కులగణన అంశాన్ని లేవనెత్తారు. ఆయన అదే సమయంలో ఇతర మతాలలో ఉన్న కులాల జన గణన కూడా జరగాలని అనకపోవడం గమనార్హం.

అచ్చం ఇలాంటి కుట్రే స్వాతంత్ర్యానికి పూర్వం జరిగింది. అదే మెకాలే విద్యావిధాన ప్రవేశం. భారత్‌లో ఎక్కువ కాలం తమ పాలన సాగించాలంటే ఏం చేయాలనే అంశంపై అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం లండన్‌లో మేధావుల అభిప్రాయం కోరింది. దీంతో ఈ విషయంపై అధ్యయనం చేసిన లార్డ్ మెకాలే భారత్‌లో అప్పటికే అమలవుతున్న విద్యా విధానాన్ని సమూలంగా మార్చాలని, వారికి గత వైభవ చరిత్ర తెలియకుండా చేయాలని, పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని ఒక నివేదిక అందజేశారు. భారత్‌లో బ్రిటిష్ వారికి పూర్వమే పటిష్ఠమైన గురుకులాల ద్వారా నూరు శాతం జనాభా విద్యావంతులు. రతనాలు, బంగారం రాశులుగా పోసి మార్కెట్లో అమ్మే ఘనమైన ఆర్థిక వ్యవస్థ ఉందని మెకాలే నివేదించారు. దీనిని బట్టి భారతదేశం ఎంత సంపన్నమైన, వైభవోపేతమైనదో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి అపారమైన దేశభక్తి కలిగిన భారతీయులు తమ చరిత్రను మరిచిపోయేలా అక్కడి చరిత్రను వక్రీకరించాలని, అదే అక్కడి విద్యార్థులకు బోధించాలని, అలా వారు వారి సంస్కృతీ సంప్రదాయాలను పూర్తిగా మరిచిపోయేలా చేయాలని నివేదించడంతో బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌లో అప్పటివరకున్న గురుకులాల వ్యవస్థను రూపుమాపి కొత్తగా మెకాలే విద్యావిధానాన్ని ప్రవేశపెట్టింది. దురదృష్టకరమైన విషయమేంటంటే స్వాతంత్ర్యానంతరం అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలపాటు అదే విద్యావిధానాన్ని కొనసాగించింది. కాబట్టే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఘనమైన భారత చరిత్రను నూతన విద్యావిధానంలో అమలులోకి తేవాలనుకుంటే స్వార్థంతోనే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయి. సెక్యులరిజానికి దెబ్బ, హిందూ మతతత్వం పెరుగుతుంది అంటూ మైనార్టీలను అనవసరంగా భయపెడుతూ కేంద్ర ప్రభుత్వ సదాశయానికి మోకాలడ్డుతున్నారు. ఇలాగే ఓట్ల కోసం మరెన్నో కుట్రలు చేస్తున్నారు.



> దృఢమైన ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంటే తమ ఆటలు సాగవని కొన్ని విదేశీ శక్తులు మన దేశంలో కుట్రలు చేస్తున్నాయి. అశాంతి రేకెత్తించి ప్రజల్లో వ్యతిరేకత పెంచి, వచ్చే ఎన్నికల్లో అయినా తమ కనుసన్నల్లో మెసలే డమ్మీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయి.

ఇటీవల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పొరుగు దేశం నుంచి వచ్చే ముస్లింలందరికి తమ రాష్ట్రంలో ఆశ్రయం కల్పిస్తామనడమే కాకుండా, దశాబ్దాలుగా భారత్‌లో నివసిస్తున్న విదేశీయులను ఎలా పంపిస్తామన్నట్లుగా బహిరంగంగా మాట్లాడారంటే ఆమె వారి ఓట్ల కోసం ఎంతగా దిగజారుతున్నారో తెలుస్తోంది. తన స్వార్థం కోసం దేశ హితాన్నే పణంగా పెడుతున్నారు. వెంటనే స్పందించిన హోం మంత్రి అమిత్ షా ఆమె మాటలను ఖండిస్తూ, వందల ఏళ్ల పాటు ఇక్కడే ఉండి పరిపాలించిన బ్రిటిష్ వారిని మన దేశం నుంచి ఎందుకు పారదోలామని ఎదురు ప్రశ్నించాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఇప్పటికీ మమత వ్యాఖ్యలను ఖండించకపోవడం గమనార్హం. పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణా జిల్లాలో సద్దాం సర్దార్ అనే వ్యక్తి ఇంటిపై పోలీసులు దాడి చేయగా అతని ఇంట్లోని బెడ్ రూమ్ నుంచి బంగ్లాదేశ్ దాకా ఒక భారీ సొరంగం బయటపడిందంటే ఆ రాష్ట్రంలో అరాచకశక్తులు ఎలా పేట్రేగిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పాలనలో దేశం ప్రతి విషయంలో విదేశాలపై ఆధారపడే దుస్థితి ఉండేది. చివరికి పీపీఈ కిట్ కూడా తయారు చేసుకోలేని పరిస్థితి. కరోనా సమయంలో బీజేపీ ప్రభుత్వం వేగంగా స్పందించి దేశంలోనే వాక్సిన్‌లు తయారు చేయించి హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా 140 కోట్ల మంది భారతీయులను కాపాడడమే కాకుండా 100కి పైగా విదేశాలకు ఉచితంగా వాక్సిన్ సరఫరా చేయగలిగింది. ఇది విదేశీ మెడికల్ మాఫియాకు నచ్చని అంశం. "మనదేశంలో తయారైన వాక్సిన్ సరిగ్గా పనిచేస్తుందని ఏంటి నమ్మకం? ఫైజర్ లాంటి విదేశీ కంపెనీలు తయారు చేసిన వాక్సిన్ వాడాలి" అని రాహుల్‌గాంధీ పదేపదే కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చారంటే ఆయన ఆలోచనను సులువుగా అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం స్వదేశీ వ్యాక్సిన్ తయారు చేయడానికి ఎన్నో రకాల ఒత్తిడులు తట్టుకొని నిలబడాల్సి వచ్చింది అన్న సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి రమణ మాటలను బట్టి మోదీ ప్రభుత్వం దేశ స్వావలంబన కోసం ఎంత దృఢంగా కృషి చేస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఇలాంటి దృఢమైన ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంటే తమ ఆటలు సాగవనే కొన్ని విదేశీ శక్తులు మన దేశంలో కుట్రలు చేస్తూ, అశాంతి రేకెత్తించి ప్రజల్లో వ్యతిరేకత పెంచి, వచ్చే ఎన్నికల్లో అయినా తమ కనుసన్నల్లో మెసలే డమ్మీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కుట్రదారుల ఆటలు సాగకుండా చేసి కులాలు, రిజర్వేషన్ల పేరుతో హిందువులు విడిపోకుండా దేశ హితం కోరే ప్రభుత్వాన్ని కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది.

○ శ్యామ్‌సుందర్ వరయోగి

కనీస నిర్వహణ గాలికొదిలేసిన పాపం

లక్షలకోట్ల బడ్జెట్‌లో జలవనరులు, రోడ్లు భవనాలు, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, విద్యుత్ మొదలైన వివిధ శాఖలకు బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ పాలకులు అభివృద్ధి పనులు చేయిస్తారు. ఈ క్రమంలో కనీస నిర్వహణ కోసం కూడా కొంత మొత్తాన్ని పక్కన తీసిపెడతారు. ఆయా శాఖలకు అభివృద్ధి పనుల పేరిట పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసినా, చేయకపోయినా ఇబ్బంది ఉండదుగానీ, కనీస నిర్వహణ గ్రాంట్ లేకపోతే మాత్రం ప్రజలకు తీవ్ర ఇబ్బంది తప్పదు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం ఈ దృష్టికోణాన్ని మరచి ప్రజలకు అన్యాయం చేసింది. ఉదాహరణకు రోడ్లు భవనాల శాఖనే చెప్పొచ్చు. రాష్ట్రవ్యాప్తంగా గుంతలు పడిన, పెచ్చులూడిన రహదారులను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేసివుంటే, నేడు రోడ్లు ఇంత దారుణమైన స్థితిలో ఉండేవి కావు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రం మొత్తం మీద పాడైపోయిన రహదారులను బాగుచేయడానికి వేలకోట్లు బడ్జెట్‌లో కేటాయించి, పనులు చేయిస్తున్నది. అయితే రహదారుల నిర్మాణం జరిగిన తర్వాత, వాటిని చక్కగా నిర్వహించేందుకుగాను తగిన ఏర్పాట్లు కూడా చేయాలి. ఈ క్రమంలో కనీస నిర్వహణ నిధులు మంజూరు, ఉద్యోగులు, కూలీల నియామకాలు, ఇంకా అవసరమైన సామగ్రి కొనుగోలు జరగాల్సి ఉంది. లేకపోతే ఆయా రోడ్లు మళ్లీ మరమ్మతులకు గురై యథాస్థితికి వచ్చే ప్రమాదం ఉంది. ప్రజారవాణాలో భాగంగా ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఇవ్వాలంటే పాడైపోయిన రహదారులను పునర్నిర్మించాలి. హెచ్చుస్థాయిలో రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి. ఇక, పల్లెల్లో, పట్టణాల్లో చెత్తను తొలగించడానికి, వీధుల శానిటేషన్ నిమిత్తం బ్లీచింగ్, ఫాగింగ్ కోసం రోజువారీ కొంతఖర్చు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ నిర్వహణ నిధులకు లోటులేకుండా చూసుకోవాలి. నీటిపారుదల శాఖలో కాలువల పూడికతీత, మరమ్మత్తులకు నిధులలేమి ఉండకూడదు. గతంలో పంట కాలువలను పర్యవేక్షించేందుకు లస్కర్ వ్యవస్థ ఉండేది. ప్రస్తుతం వారు రిటైర్ అవుతున్నారు, కానీ ఆ పోస్టులను భర్తీ చేయడం లేదు. దీనివల్ల కాలువల నిర్వహణ గతి తప్పుతున్నది. కొందరు వ్యక్తులు కాలువలకు గండికొట్టి నీటిని తరలించుకుపోతున్నారు. అందువల్ల ఈ లస్కర్ వ్యవస్థను పటిష్ఠం చేయాల్సి ఉంది. పట్టణాల కూడళ్ళలో, రోడ్లకు ఇరువైపుల ట్రాఫిక్ నియంత్రించే సిగ్నల్ లైట్స్, సైన్ బోర్డ్స్, హోర్డింగ్స్ కచ్చితంగా పనిచేసేట్టు చూడాలి. ఇంకా చాలా రంగాలలో కనీస నిర్వహణలకు కేటాయింపులు అధికంగా చేయాల్సి ఉంది. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా నిర్వహణను గాలికొదిలేయకూడదు. వదిలేస్తే అది నేరమే.

– పిల్లా తిరుపతిరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

జాతి యెఱుకలో చిరంజీవి

ప్రపంచంలో ప్రసిద్ధులు పలువురు పలువిధాలుగా ఉంటారు గాని పెక్కు ప్రతిభలు ఒక్కచోట గలవారు మిక్కిలి అరుదు. అట్టి బహుముఖ ప్రజ్ఞాధురీణులలో ఆంధ్ర విద్వజ్జ్యోతి 'హరికథా పితామహ' శ్రీమదజ్జాడాదిభట్ల కుల శేఖరులగు నారాయణదాసవర్యులు ఒకరు. దేశంలోని రసజ్ఞులందరు 'పుంభావ సరస్వతి' అని కొనియాడిన నారాయణదాసు నవరసభరితంగా కథాగానం చేయటంలో అందెవేసిన చేయి. నారాయణదాసు ఒక్క తెలుగుజాతికే కాక యావద్భారత దేశానికి చిరస్మరణీయులే.

తెలుగు సంస్కృతి చరిత్రలోనే కాదు భారత సంస్కృతి చరిత్రలోనే అపూర్వ వైశిష్ట్యం కలవారు నారాయణదాసు. ఒక్కొక్క రంగంలో ప్రావీణ్యం ఉన్నవారు ఎందరో ఉండవచ్చు కానీ 'ఆటలో పాటలో మాటలో మేటి' అని ఆయనలా అనిపించుకున్నవారు బహు అరుదు. నారాయణదాసుకు పూర్వం హరికథా ఛాయలు ఉన్నా దానికి ఒక సమగ్ర స్వరూపం, ఉన్నతమైన పీఠం, విశాలమైన పరిధి సంతరించి పెట్టినవారు నారాయణదాసే. ఆయన పాండిత్యం అనేక భాషలకు, శాస్త్రాలకు సంబంధించినది. ప్రావీణ్యం బహు కళలకు విస్తృతమైనది, వ్యక్తిత్వం విశిష్టమైనది, జీవితం స్వతంత్రమైనది.

నారాయణదాసు సంస్కృతాంధ్రాలలో మహాకవి, హరికథకు సృష్టికర్త. అచ్చతెలుగుకు అశ్వత్థవృక్షం, మహానటుడు, గంధర్వ గాయకుడు, సకలశాస్త్ర పారంగతుడు, వీణావాదన విశారదుడు, అష్టభాషాకవి. హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో మన తెలుగు ప్రజలకు దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపాధ్యాయుడు ఈ పరమ భక్తాగ్రేసరుడు.

నారాయణదాసు కథాకాలక్షేపము విలక్షణమైనది. కథ స్వవిరచితము. కవితారసం ఆస్వాదించువారికి కవిత్వం చేతను, సంగీతప్రియులను పాటలతోను, లయకాండ్రను క్లిష్టమగు ముక్తాయింపులతోను, పామరులను చమత్కార పూరిత మాటలతోను మెప్పించేవారు. అటు సంగీతంలో ఇటు సాహిత్యంలో అందులోను సంస్కృతం, ఆంధ్రం, అచ్చ తెనుగు, ఆంగ్లం, పార్సీ ఇత్యాది అనేక భాషల్లో హరికథా కథనంలో, ఆశుకవితావధానంలో విరాట్ స్వరూపం ప్రదర్శించిన మూర్తి నారాయణదాసు. లయ బ్రహ్మ, శృంగార సర్వజ్ఞుడు, సంగీత సాహిత్య సార్వభౌముడు, పంచముఖీ పరమేశ్వరుడు ఇత్యాది బిరుదులూ ఎన్ని ఉన్నప్పటికీ, తెలుగునాట వారు హరిదాస జగద్గురువులే.

నారాయణదాసు గాత్రం చాలా గంభీరమైనది. గానమే కాదు, సంస్కృతాంధ్ర సాహిత్యమేకాదు, నాట్యమేకాదు అదీ ఇదీ అనడమెందుకు? ఈయనకు వశమైన సర్వవిద్యలున్నూ గురూపదేశం వినాగా లభ్యమైనవే. దాసుది గంభీరమైన, నిండైన విగ్రహం. మధ్యాపిటలో జులపాలు సంస్కరించుకొని, పూలు ముడుచుకొని, మెలిపెట్టిన పెద్ద పెద్ద మీసాలతో వారి రూపాన్ని చూస్తుంటే ఏ రాజాధిరాజో హుందాగా ఉన్నట్లు కన్పించేవారు. నారాయణదాసు నడుస్తూ ఉంటే సంగీత సాహిత్య సరస్వతీ సాక్షాత్కారం, శంభో అంటూ అయన ఎక్కడ నిలిస్తే అక్కడే కథాకథన రంగస్థలం. నారాయణదాసు అన్నిటిలో ఆరి తేరి ఆటను, పాటను, మాటను సమ్మేళనం చేసి రక్తితో భక్తిద్వారా ముక్తికి దారి చూపిన లోకైక నటుడు. ఆటకాండ్రకు ఆటగాడు, పాటకాండ్రకు పాటగాడు, మాటకాండ్రకు మాటకాడు, వేషధారులకు వేషధారి. సంగీత స్వరకల్పనలో వీరిదొక విలక్షణమైన బాణి. ఇతరులను వీరు అనుకరించేవారు కాదు, ఇతరులు వీరిని అనుకరించడానికి అలవి కాని ప్రతిభాసంపత్తి నారాయణదాసు సొంతం. కర్ణాటక, హిందుస్తానీ బాణీల రెండింటినీ సమన్వయించి మైసూరు రాజ దర్బారులో ఆయన సంగీత కచేరి చేసినపుడు మహారాజావారు దాసు గానానికి పులకించి మీరు ఎక్కడ సంగీతం నేర్చుకున్నారు అంటే 'నా సంగీత సాహిత్యాలు సహజ పాండిత్యమే కానీ ఒకరి వద్ద నేర్చుకున్నవి కావు' అని చెప్పారు.

> సంస్కృతాంధ్రాలలో మహాకవి, హరికథకు సృష్టికర్త. అచ్చతెలుగుకు అశ్వత్థవృక్షం, మహానటుడు, గంధర్వ గాయకుడు, సకలశాస్త్ర పారంగతుడు, వీణావాదన విశారదుడు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన పూర్వం హరికథా ఛాయలు ఉన్నా దానికి ఒక సమగ్ర స్వరూపం, ఉన్నతమైన పీఠం, విశాలమైన పరిధి సంతరించిపెట్టిన అసమాన ప్రతిభామూర్తి నారాయణదాసే. ఆయన పాండిత్యం అనేక భాషలకు, శాస్త్రాలకు సంబంధించినది. ప్రావీణ్యం బహు కళలకు విస్తృతమైనది. వ్యక్తిత్వం విశిష్టమైనది. జీవితం స్వతంత్రమైనది.



విజయనగరంలో ఆ రోజుల్లో సర్వ విద్యలూ తాండవిస్తూ ఉండేవి. ఈ వరప్రసాదునకు శ్రుతి మాత్రం చేత అవన్నీ స్వాధీనపడ్డాయి. నారాయణదాసు హరికథలతో పాటు సంస్కృతాంధ్రాలలో, అచ్చతెలుగులోను అనేక గ్రంథాలు రచించారు. 'సావిత్రీ చరిత్రం' 'జానకీ శపథం' హరికథలు వారి అసమాన సంగీత వైభవానికి నిదర్శనం. తారకం, హరికథామృతం అనే సంస్కృత కావ్యాలను రచించి జర్మన్ పండితుల మెప్పు పొందారు. ఋగ్వేదాన్ని స్వరసహితంగా తెలుగులోకి అనువాదం చేశారు. పంచముఖి, షణ్ముఖి లాంటి అసాధ్యాలైన తాళాలలో రచనలు చేసి, గానం చేసి విద్వాంసుల మన్ననలు పొందారు. వారి బహుభాషా పాండిత్యానికి 'ఉమర్ ఖయ్యాం' మచ్చుతునక. పార్సీలోని ఉమర్ ఖయ్యాం రుబాయత్‌ని ఫిట్జ్ గెరాల్డ్ ఆంగ్లంలోకి అనువదిస్తే దాసుగారు దానిని సంస్కృతంలోనూ, దేశ్యాంధ్రంలోను అనువదించారు.

నారాయణదాసు అటు కలకత్తా నుండి ఇటు కన్యాకుమారి వరకు దేశమంతా తమ హరికథాగానంతో 'ఆట పాట మాట మీటల మేటిగా' ప్రసిద్ధిగాంచారు. ఆయన మన తెలుగు జాతిలో పుట్టడం మన అదృష్టం. మనకి తెలియని కాలంలో పుట్టి కాలధర్మం చెందిన అసాధారణ ప్రజ్ఞాధురీణులు. లయ బ్రహ్మ బిరుదాంకితులై మైసూరు, విజయనగరం మొదలైన సంస్థానాలలో మహారాజుల మన్ననలందుకున్నారు. ఆయన ఎవరినీ సేవించలేదు. మైసూరు మహారాజావారు 'మా దర్బారులో పని ఉండరాదా' అన్నప్పుడు 'మర్త్యుల గొలువను' అన్న మేరు పర్వతం నారాయణదాసు. మైసూరు మహారాజు ఆయన గాత్రాన్ని ఫోనోగ్రామ్ ద్వారా రికార్డు చేయించుకొని తరచుగా వినేవారు. నారాయణదాసు అల్ప సంతోషి. 1895లో మైసూరు మహారాజావారు దాసును మెచ్చుకొని ఏమి కావలెనో కోరుకోమనగా అందులకు దాసుగారు 'ఒక బుట్టెడు బెంగుళూరు వంకాయలు' ఇప్పించమని కోరారు. విజయనగర సంస్థాన ప్రభువులు ఆయన్ని సకల రీతుల్లో గౌరవించి చరితార్థులైనారు. విజయనగర సంగీత పాఠశాల ప్రథమ ప్రధానాధికారిగా నియమించి పూజించినారు. విజయనగర మహారాజుతో పరిహాసాలాడడమూ దాసుకే చెల్లింది. నారాయణదాసు ఘనగంభీర, మధుర స్వరంతో కథ చెప్పితే వేలాది ప్రజలు మైకుల అవసరం లేకుండా వినగలిగెడివారు. కలకత్తాలో ఒకసారి దాసుగారి 'శ్రీకృష్ణజననం' సంస్కృత కథాగానం విన్న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ తరువాత ఒకసారి విజయనగరం వచ్చినప్పుడు దాసుని ప్రత్యేకముగా పలుకరించి ఆనాడు మీరు ఆలపించిన బేహాగ్ రాగం ఈ నాటికీ నా చెవుల్లో మార్మోగుతోంది అని ప్రశంసించారు.

తెలుగు నాట ప్రఖ్యాతిపొందిన హరిదాసులు దాసుగారి శిష్యుల్లో, ప్రశిష్యుల్లో అయి ఉన్నారు. హరికథా వాఙ్మయ ప్రాచుర్యానికి, హరికథా ప్రదర్శన నైపుణ్యానికి మూల పురుషులు శ్రీ నారాయణదాసుగారే! కనుకనే 'హరికథా పితామహ' బిరుదానికి సర్వవిధాలుగా పాత్రులయ్యారు. దాసు శిష్య ప్రశిష్యులు అనేకులు ఉన్నప్పటికీ, నేతి లక్ష్మీ నారాయణ భాగవతులు, వాజపేయాజుల సుబ్బయ్యదాసు వారి ప్రియాతి ప్రియమైన శిష్యులు. దాసుకి వారు పుత్ర సమానులు. వీరిరువురికి, ఇతర కథలతో పాటుగా 'యథార్థ రామాయణం' పూర్తిగా చెప్పి దాసుగారు ఆ ఇరువురినీ 'రామాయణ సోదరులు' అని పిలిచేవారు. ఇతర శిష్యులలో నేమాని వరహాలుదాసు, వడ్లమాని నరసింహదాసు, వేదన భట్ల వెంకటరమణయ్య, పరిమి సుబ్రహ్మణ్యదాసు, చొప్పల్లె సూర్యనారాయణ భాగవతార్ మున్నగువారు ఉన్నారు. శిష్యుల పట్ల వాత్సల్యాన్ని చూపడంలో దాసుకి సాటి ఎవరూ ఉండరూ అనే ప్రఖ్యాతి ఉంది. తన వద్దకు కొత్తగా వచ్చిన విద్యార్థి నేతి లక్ష్మీనారాయణను శిక్షణ పూర్తి కాలం తనతో సహపంక్తి భోజనం చేయించారు. శిష్యులకు సకల సదుపాయాలు దాసుగారే సమకూర్చేవారు. తమ ఇంట కుదరని పక్షంలో అభిమానులకు సిఫార్సు చేసి భోజన వారాలను ఏర్పరచేవారు. శిష్యులకు బిడియం పోగొట్టేందుకు, హరికథకు ప్రచారం కల్పించి వారికి ఉపాధి చూపేందుకు నడివీధిలో తాను గజ్జెకట్టి నాట్యం చేస్తూ వారిని పాడమనుచు, తాను తాళము ఊసూ అక్కడికక్కడ శిష్యులకు విద్య నూరి పోసేడివారు.

'ప్రహ్లాద నారద పరాశర పుండరీక.. అన్న పరమభక్తుల సరసన పరిగణింపదగ్గవాడు, అంతరంగం బహునిర్మలమైనది. ప్రపేదిరే ప్రాక్తనజన్మ విద్యాః అన్న కాళిదాసోక్తి ఈతని యందు సమన్వయించినట్లు మరియొకరియందు సమన్వయించదు' అని నారాయణదాసును చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి ప్రశంసించారు. 'హరికథా పితామహుడు ఆదిభట్లదాసు! సంగీతం సాహిత్యం సరితూచిన త్రాసు' అని మహాకవి శ్రీశ్రీ వారిని ప్రశంసించారు. సంగీతం ద్వారా త్యాగరాజు భగవంతుని సేవించి పరమపదమును పొందగా నారాయణ దాసు తన సంగీత సాహిత్య హరికథా గానములతో పరమాత్మని కీర్తించారు. దాసు మహాత్యాగి, దేవేంద్ర భోగి. తెలుగు జాతి నిండు గుండెల్లో అజరామరంగా నిలిచిన అపర సరస్వతీ మూర్తి. విజయనగరం జిల్లా అజ్జాడ అనే గ్రామంలో 1864లో జన్మించి 1945లో సరిగ్గా త్యాగరాజు అస్తమయ తిథి రోజునే తుది శ్వాస విడిచిన పుణ్యమూర్తి దాసు. 1951 జనవరి 25న విజయవాడ సత్యనారాయణపురం శివాలయం ఆవరణలో దాసు ప్రియశిష్యులు 'హరికథా కేసరి', మా తాతగారు అయిన నేతి లక్ష్మీనారాయణ భాగవతులచే ఆగమోక్తముగా ప్రతిష్ఠచేసిన నారాయణదాసు ప్రతిమకు గడచిన 74 ఏళ్లుగా శ్రావణ బహుళ చతుర్దశినాడు వారి జయంతి, పుష్య బహుళ పంచమినాడు వర్ధంతి ఉత్సవాలను శిష్య ప్రశిష్యులు ఘనంగా జరుపుతూ వస్తున్నారు.

■ యనమండ్ర వెంకటక్రిష్ణయ్య
98499 86679

(రేపటి నుంచి సెప్టెంబర్ 1 వరకూ విజయవాడ సత్యనారాయణపురం సీతారామ కల్యాణమండపంలో ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంత్యుత్సవాలు)

ఆంధ్రజ్యోతి



ఆనందం ఉట్టి పడేలా..



శ్రీకృష్ణాష్టమి వేడుకలతో సోమవారం జిల్లా బృందావనాన్ని తలపించింది. చిన్నికృష్ణులు, చిన్నారి రాధమ్మల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సాయంత్రం జరిగిన ఉట్టికొట్టే సంబరాలతో ఉత్సవాలు మరింత శోభాయమానమయ్యాయి. దుర్గగుడిలో జరిగిన ఉట్టికొట్టే కార్యక్రమంలో ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కిడ్నీ వ్యాధికి మరో ఇద్దరు బలి



మృతుడు కృష్ణారావు (ఫైల్)



మృతుడు స్వామిదాసు (ఫైల్)

ఎ.కొండూరు/చింతలపాడు (తిరువూరు), ఆగస్టు 26 : ఎ.కొండూరులో వరుస మరణాలు స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాకు చెందిన మరో వ్యక్తి సోమవారం మృతిచెందాడు. మండల కేంద్రమైన మాత్రియా తండాకు చెందిన బర్మావతు కృష్ణారావు (35) కొంతకాలంగా కిడ్నీ, లివర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. తనకున్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకుని విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సేవలు పొందుతున్నాడు. వ్యాధి తీవ్రత పెరిగి సోమవారం ఇంటి వద్ద మృతిచెందాడు. కుటుంబ సభ్యులను సీపీఎం నేతలు వెంకటేశ్వరరావు, కుమార్‌నాయక్, ఆనందరావు పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చింతలపాడులో..

తిరువూరు మండలంలోని చింతలపాడు గ్రామానికి చెందిన మోదుగు స్వామిదాసు (35) కిడ్నీ వ్యాధితో ఆదివారం రాత్రి మృతిచెందాడు. వ్యవసాయ కూలీ పనులు చేస్తు జీవిస్తున్న స్వామి దాసు మూడు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్య శాలలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి అతని ఆరోగ్య పరిస్థితి విషవించి ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లపై యుద్ధం మొదలైంది. 16 టాప్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నేరాలకు అడ్డుకట్ట వేసే సైనికులు సిద్ధమయ్యారు. సైబర్ సిటిజన్స్ యాప్‌నే అస్త్రంగా మలచుకుని ఇక అంతర్యుద్ధం చేయనున్నారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పోలీసుల్లో కొంతమందిని కమాండోలుగా, యువత నుంచి మరికొందరిని సోల్జర్స్‌గా నియమించారు. ముమ్మందు ఈ సైన్యాన్ని మరింత విస్తృతం చేసే దిశగా సోమవారం మొదటి అడుగు పడింది.



సైబర్ కమాండోలు, సోల్జర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

సైబర్ సైన్యం

ఈ-నేరాల అడ్డుకట్టకు సరికొత్త సైన్యం సిద్ధం

- టెక్నాలజీపై పట్టున్న పోలీసు సిబ్బందే కమాండోలు
- యువత నుంచి 2వేల మంది సోల్జర్స్
- సైబర్ సిటిజన్స్‌ను తయారు చేయనున్న సోల్జర్స్
- సిటిజన్స్‌ను తయారుచేసే వారికి ప్రోత్సాహకాలు
- అందుబాటులోకి సైబర్ సిటిజన్స్ యాప్
- ఫిర్యాదుల తగ్గింపునకు 15 రోజుల ప్రణాళిక

16 కీలక నేరాలపై అవగాహన : సీపీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నగర పోలీసు కమిషనర్‌గా రాజశేఖరబాబు బాధ్యతలు చేపట్టాక సైబర్ నేరాలను తగ్గించడమెలా..? అనే అంశంపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా పోలీసు విభాగంలో సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్న 200 మందితో సైబర్ కమాండోలను ఎంపిక చేశారు. వారి ద్వారా యువత నుంచి సైబర్ సోల్జర్స్‌ను తయారు చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఈ సోల్జర్స్. సైబర్ సిటిజన్స్‌ను తయారు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రస్తుతం 2వేల మంది యువతీ యువకులు సైబర్ సోల్జర్స్‌గా పేర్లు నమోదు చేసుకున్నారు. ఒక్కో సోల్జర్ 200 మంది సిటిజన్స్‌ను తయారు చేసేలా టార్గెట్ విధించారు. సోల్జర్స్‌ను తయారు చేసిన కమాండోలకు, సిటిజన్స్‌ను తయారు చేసిన సోల్జర్స్‌కు కొన్ని పాయింట్లు ఉంటాయి.

పాయింట్లు ఎలా వస్తాయి..?

'ఈ' నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడానికి పోలీసు శాఖ ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేసింది. దీనికి సైబర్ సిటిజన్స్ యాప్ అని నామకరణం చేశారు. దీన్ని ప్లేస్టోర్‌లోకి వదిలారు. మంగళవారం నుంచి ఈ యాప్ అందుబాటులోకి రానుంది. 16 టాప్ సైబర్ నేరాలతో దీనిని రూపొందించారు. కమాండోల ఫోన్లలో ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. వాయిస్ కాల్స్ ద్వారా సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, మెసేజ్‌ల ద్వారా సైబర్ నేరగాళ్ల మాయలో ప్రజలు ఎలా పడుతున్నారో వివరిస్తూ ఈ యాప్‌ను సిద్ధం చేశారు. కమాండోలు, సోల్జర్స్‌కు ఒక టెక్నికల్ ఐడీ ఉంటుంది. ఈ యాప్‌ను స్కాన్ చేయగానే ఒక అప్లికేషన్ వస్తుంది. అందులో పేరు, వివరాలు నమోదు చేయాలి. ఇలా చేశాక కమాండోలు, సోల్జర్స్‌కు ఒక పాయింట్ వస్తుంది. ఇలా మరో వ్యక్తి చేస్తే మరో పాయింట్ వస్తుంది. యాప్‌లో ఉన్న 16 నేరాలకు సంబంధించిన మోసాల వీడియోలను వీక్షిస్తేనే పాయింట్ వస్తుంది. ఇలా ఎక్కువ పాయింట్లు సాధించిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. 50, 100, 150, 200.. ఇలా పాయింట్ల లెక్కన ప్రోత్సాహకం ఉంటుంది. సైబర్ నేరాల తగ్గింపునకు 15 రోజుల ప్రణాళికను సిద్ధం చేశారు. ముఖ్యంగా ఈ నేరగాళ్ల మాయలో పడిన వారికి నష్టం కలగకుండా చేయడానికి గోల్డెన్ అవర్‌పైనా అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

19 వీడియోలకు ప్రోత్సాహకాలు

సైబర్ సేఫ్టీ, మహిళలు, బాలికల భద్రత, రహదారి భద్రతకు సంబంధించి అవగాహన కల్పించేలా వీడియోలు రూపొందించాలని పోలీసులు ఆహ్వానాలు పంపారు. ఈ మూడు కేటగిరీల్లో 64 వీడియోలు పోలీసులకు అందాయి. వాటిని పరిశీలించిన అధికారులు 19 వీడియోలు బాగున్నాయని గుర్తించారు. వాటికి చిన్నచిన్న మార్పులు చేయాల్సి ఉందని తేల్చారు. ఈ వీడియోలను రూపొందించిన వారికి విజయవాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో నగదు పారితోషకాలను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమీషాలి, టి.హరికృష్ణ, ఉదయరాణి, చక్రవర్తి, మహేశ్వరరాజు, ఏసీపీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు గుణరాము, పలివెల శ్రీను, వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే నేరాలు తగ్గుతాయి : రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు ప్రజలకు చేరడం లేదు. సైబర్ నేరాల నుంచి తప్పించుకునే విధానాలపై అవగాహన కల్పించే యాప్ ఎక్కడా కనిపించడం లేదు. వీటిపై పూర్తి అవగాహన కల్పించడానికి సిమ్యూలేటెడ్ యాప్‌ను రూపొందించాం. ఇందులో 16 రకాల సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. మూడు నెలల్లో 2లక్షల మంది సైబర్ సిటిజన్స్‌ను తయారు చేయడమే లక్ష్యం. అంతకుమించి సిటిజన్స్‌ను తయారు చేస్తామని కూడా కంకణం కట్టుకోవాలి. సోల్జర్స్ రిజిస్ట్రేషన్‌ను పెంచిన కమాండోలకు కొన్ని పాయింట్లు, సిటిజన్స్‌ను తయారు చేసిన సోల్జర్స్‌కు కొన్ని పాయింట్లు ఉంటాయి.

ఎలక్ట్రిక్ షాక్

రెండు జిల్లాల్లో పడిపోయిన ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు



ఫేమ్-2 ఎత్తివేత, రోడ్డు ట్యాక్స్ అదనపు భారం వల్లే..

ఈఎంపీఎస్ కొనసాగుతున్నా గణనీయంగా తగ్గిన రాయితీ

రవాణా రంగ రాజధాని విజయవాడలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పడిపోతున్నాయి. వాతావరణాన్ని దెబ్బతీయని వాహన వ్యవస్థ అందుబాటులోకి వచ్చినా వినియోగం తక్కువగా ఉండటంతో ఈ రంగం అసాధారణ కుదుపునకు గురవుతోంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తేయడం, రాష్ట్రంలో రోడ్డు ట్యాక్స్ అదనపు భారంతో కొద్దినెలలుగా రెండు జిల్లాల్లో అమ్మకాలు భారీగా పడిపోయాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెండు జిల్లాల్లో ఎనిమిది నెలలుగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) అమ్మకాలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ధరలు అందుబాటులో లేకపోవటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పెట్రోల్ ఆధారిత ద్విచక్రవాహనాల కంటే ఈవీల ధరలు రూ.అరలక్ష, ఆపైన ఎక్కువగా ఉంటున్నాయి. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే నిర్వహణ వ్యయం తక్కువే అయినా అంత మొత్తం పెట్టి కొనే స్తోమత లేనివారు ఈవీలవైపు చూడట్లేదు. కంపెనీలు కొంతవరకు తగ్గింపు రాయితీలు ఇస్తున్నా ప్రభావితం చూపట్లేదు. చిన్న, మధ్య తరహా ఈవీ ద్విచక్రవాహనాల విషయంలో ఈ సమస్య పెద్దగా లేకున్నా, మైలేజీ 140 నుంచి 180 కిలోమీటర్ల వరకు ఉండే హై ఎండ్ ద్విచక్రవాహనాల విషయంలో ఎక్కువగానే ఉంది. నూటికి 90 శాతం మంది ఈ హైఎండ్ మైలేజ్ రేంజ్ వాహనాలనే కోరుకుంటున్నారు. వీటి ధర రూ.లక్షన్నర నుంచి రూ.1.80 లక్షల వరకు ఉంది. అదే పెట్రోల్ ద్విచక్రవాహనమైతే రూ.లక్ష, అంతకంటే తక్కువ ధరకే లభిస్తోంది.

ఎందుకిలా..?

ఈవీల అమ్మకాలు తగ్గడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. వీటి ప్రోత్సాహానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేమ్-2 పథకం గడువు ముగియడం ఒక కారణమైతే, ఇంకా ఫేమ్-3 పథకాన్ని అమల్లోకి తీసుకురాకపోవడం మరొకటి. ఫేమ్-3 అక్టోబరు నుంచి అందుబాటులోకి వస్తుందంటున్నారు కానీ, స్పష్టత లేదు. ఫేమ్-2 వల్ల ద్విచక్ర వినియోగదారుడికి రూ.21 వేల నుంచి రూ.25 వేల వరకు ప్రయోజనం కలిగేది. ప్రస్తుతం ఫేమ్-2 అమల్లో లేదు. అయితే, కేంద్రం ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ (ఈఎంపీఎస్)ను అమలు చేస్తోంది. ఫేమ్-2 భారాన్ని తగ్గించుకునేందుకే కేంద్రం ఈఎంపీఎస్‌ను అమలు చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఈఎంపీఎస్ కింద రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే రాయితీ వస్తుంది. అలాగే, రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం లైఫ్ ట్యాక్స్‌ను మోపటం వల్ల రూ.లక్ష విలువ కలిగిన వాహనంపై 12 శాతం అంటే రూ.12 వేల చొప్పున పన్ను భారం పడింది. ఆ తర్వాత ఈవీ మార్కెట్ నుంచి వచ్చిన డిమాండ్‌తో జూలై వరకు లైఫ్ ట్యాక్స్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ గడువు ముగిసింది. ప్రస్తుతం రోడ్డు ట్యాక్స్ విధిస్తున్నారు. దీనివల్ల ద్విచక్ర ఈవీ కొనుగోలుపై రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు భారం పడుతోంది. ఈ మొత్తం కారణాల వల్ల ఒక్కో ఈవీపై గరిష్ఠంగా రూ.43 వేల చొప్పున భారం పడుతోంది.

కొనుగోళ్లకు బ్రేక్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈవీలకు సంబంధించి ఆథరైజ్డ్ డీలర్లు 15 మంది వరకు ఉన్నారు. టీవీఎస్, హీరో, బజాజ్ వంటి పెట్రోల్ వాహనాల డీలర్లే తమ షోరూమ్‌లలో ఈవీలను విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ షోరూమ్‌లు 50 వరకు ఉన్నాయి. రిజిస్టర్డ్ షోరూమ్‌లలో నెలకు 20 నుంచి 30 వరకు ఎలక్ట్రానిక్ వాహనాలను విక్రయించేవారు. కేంద్ర ప్రభుత్వ ఫేమ్-2 పథకం ఎత్తివేత, రోడ్డు ట్యాక్సుల కారణంగా నెలకు 5 నుంచి 10లోపే విక్ర యాలు జరుగుతున్నాయి. దీనిని బట్టి సగం కంటే ఎక్కువే కొనుగోళ్లు పడిపోయాయంటున్నారు.

జిల్లాల పునర్విభజన పేరుతో కిందటి వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అతలాకుతలం చేసింది. కొత్త జిల్లాలను ఏర్పాటు అయితే చేసింది కానీ, అందుకు తగినట్టుగా సిబ్బందిని ఇవ్వకపోవటంతో రెవెన్యూ సిబ్బంది పనిభారంతో అల్లాడిపోతున్నారు. కలెక్టరేట్లు మొదలుకుని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల వరకు సిబ్బంది కొరత, నిధులలేమి, మౌలిక సదుపాయాల కల్పనలేమి, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తుందని ఉద్యోగులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

రెవెన్యూ వ్యవస్థ గందరగోళం



కొత్త జిల్లాలకు కొత్త సిబ్బందిని ఇవ్వని గత ప్రభుత్వం

- పాత కలెక్టరేట్ సెక్షన్లలోని సిబ్బంది విభజన
- 8 సెక్షన్లకుగాను 3, 4 సెక్షన్లకే సిబ్బంది
- మిగిలిన సెక్షన్ల భారం కూడా ఉన్నవారిపైనే
- తహసీల్దార్ కార్యాలయాలకు నిధుల కొరత
- ఆర్డీవో కార్యాలయాల్లో సిబ్బందిలేమి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లా కలెక్టరేట్లలో పనిచేసే సిబ్బందినే విభజించి పంచటం వల్ల ఎన్టీఆర్, కృష్ణా కలెక్టరేట్లలో సిబ్బంది కొరత ఏర్పడింది. కొత్త జిల్లాలకు, పాత విభజిత జిల్లాల కలెక్టరేట్లకు సిబ్బందిని పంచటం వల్ల పలు సెక్షన్లను కుదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత జిల్లా కలెక్టరేట్ సిబ్బందినే కొత్త జిల్లాలకు సర్దుబాటు చేయటం వల్ల రెవెన్యూ ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం నెలకొంది. కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికీ ఆయా సెక్షన్ల పనివిధానాల్లో ఏమైనా మార్పులు వస్తాయా.. అంటే అలాంటివేమీ ఉండవు. సెక్షన్ల తగ్గింపు అనేది ఉండదు. ఉన్న సెక్షన్ల ప్రకారం ఉద్యోగులు పనిచేస్తేనే జిల్లా పాలన సవ్యంగా సాగుతుంది. కలెక్టరేట్లలో గతంలో ఉన్న విధంగా 8 సెక్షన్లకు సరిపడా సిబ్బందిని నియమించి ఉన్న సిబ్బందిపై పనిభారం లేకుండా చేస్తే జిల్లా పాలన సవ్యంగా నడిచిపోతుంది.

తహసీల్దార్ కార్యాలయాల పరిస్థితి దయనీయం

జిల్లాల పునర్విభజన తర్వాత తహసీల్దార్ కార్యాలయాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఈ కార్యాలయాలకు కిందటి ప్రభుత్వ హయాంలో రోజువారీ ఖర్చులకు సరిపడా నిధులు వచ్చేవి కావు. ప్రస్తుతం కూడా పరిస్థితి ఇలాగే ఉంది. నిధులు లేకపోవటం వల్ల కార్యాలయ నిర్వహణ సక్రమంగా జరగటం లేదు. కార్యాలయ అవసరాల కోసం నిర్వహిస్తున్న అద్దె వాహనాలకు సరిపడా నిధులు కూడా రావటం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రొటోకాల్ పేరుతో అదనపు ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. ప్రొటోకాల్ ఖర్చుల కోసం సరిపడా నిధులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో అనేక కోర్టు కేసులు కూడా నడుస్తున్నాయి. ఈ కోర్టు కేసుల పరిష్కారానికి సరిపడా నిధుల కేటాయింపు కూడా ఉండటం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఉపయోగించే కంప్యూటర్లు ఏనాడో మూలనపడ్డాయి. సొంత ఖర్చులతో కొనుగోలు చేశారు. వీటికి ఇంటర్నెట్ సౌకర్యం కూడా సొంతంగా ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులకు టాయిలెట్లు కూడా లేవు.

ఆర్డీవో కార్యాలయాలలోనూ ఇదే దుస్థితి

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింట్లోనూ సిబ్బంది కొరత వేడిస్తోంది. ఆర్డీవో కార్యాలయాల్లో తగినంత మంది సిబ్బంది లేకపోవటంతో.. ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్డీవో కార్యాలయాలను కూడా నిర్వహించటం భారంగా మారుతోంది. కార్యాలయాల నిర్వహణ కోసం ఖర్చులు ఇవ్వకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

చిచ్చా చిక్కాడు

రౌడీషీటర్ సహా 11 మంది గంజాయి బ్యాచ్ అరెస్టు

- నగరంతో పాటు ఇతర జిల్లాల్లోనూ చోరీలు, స్నాచింగ్‌లు
- కొత్తపేటకు చెందిన చిన్నా చిచ్చానే సూత్రధారి
- ఒడిశాలోని గిరిజనులకు చోరీ సొత్తు ఇచ్చి గంజాయి కొనుగోలు
- జైల్లో పరిచయమైన మైనర్లతో గ్యాంగ్.. గంజాయి అమ్మకాలు

6లో..



నిందితులను మీడియా ముందు హాజరుపరిచిన పోలీసులు

అసాంఘికాలకు అడ్డా.. హిల్‌టాప్ గెస్ట్‌హౌస్

- ముంబయి సినీనటి వివాదంతో వెలుగులోకి వైసీపీ అక్రమాలు
- ఉలిక్కిపడిన అధికారులు

6లో..

చిచ్చా చిక్కాడు

- రౌడీషీటర్ సహా 11 మంది గంజాయి బ్యాచ్ అరెస్టు
- నగరంతో పాటు ఇతర జిల్లాల్లోనూ చోరీలు, స్నాచింగ్‌లు
- కొత్తపేటకు చెందిన చిన్నా చిచ్చానే సూత్రధారి
- ఒడిశాలోని గిరిజనులకు చోరీ సొత్తు ఇచ్చి గంజాయి కొనుగోలు
- జైల్లో పరిచయమైన మైనర్లతో గ్యాంగ్.. గంజాయి అమ్మకాలు

కనిపించిన ఏ వస్తువునైనా మాయం చేయడమే అతని వృత్తి. ఏదైనా ఊరు వెళ్తే దారిలో కనిపించిన బైకులను సైతం దోచేస్తాడు. ఏదీ కుదరకపోతే ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళల మెడలో బంగారు గొలుసులను లాగేస్తాడు. పోలీసులకు చిక్కి, జైలుకు వెళ్లినా, విడుదలైన తర్వాత మళ్లీ మామూలే. ఇలా దొంగిలించిన వస్తువులను ఒడిసాలోని చిత్రకొండకు తీసుకెళ్తాడు. అక్కడున్న గిరిజనులకు ఆ వస్తువులను ఇచ్చేసి వేలాది రూపాయల విలువైన గంజాయిని తీసుకొస్తాడు. గంజాయి కొనుగోలుకు అవసరమైన వస్తువులను కాజేయడానికి మైనర్లతో ఒక బృందాన్ని తయారు చేసుకుంటాడు. ఇదీ క్రిమినల్ షీటర్ కొండా రమేశ్ అలియాస్ చిన్న చిచ్చా గంజాయి ఆపరేషన్. టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆపరేషన్‌లో చిచ్చా సహా 11 మంది పోలీసులకు చిక్కారు.

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగిన చోరీలు, స్నాచింగ్‌ల ద్వారా కాజేసిన వస్తువులను ఒడిశాలోని గిరిజనులకు ఇచ్చేసి, అక్కడి నుంచి గంజాయిని తీసుకొస్తున్న రౌడీషీటర్ కొండా రమేశ్ అలియాస్ చిన్న చిచ్చాతో పాటు 11 మందిని టాస్క్‌ఫోర్స్, యాంటీనార్కోటిక్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను డీసీపీ టి.హరికృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఆర్.శ్రీహరిబాబు, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, వి.పవన్‌కిశోర్, ఎన్‌సీహెచ్ కొండలరావుతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం వెల్లడించారు.

హైదరాబాద్ నుంచి ఆపరేషన్

చిచ్చాపై రౌడీషీట్ ఉండటం, పీడీ యాక్ట్ నమోదు చేయడం, నగర బహిష్కరణ కూడా విధించడంతో హైదరాబాద్‌లోని చర్లపల్లికి మకాం మార్చాడు. అక్కడి నుంచే ఆపరేషన్ చేస్తున్నాడు. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన గురవర్తి నాగరాజు, షేక్ సిద్ధిక్ హుస్సేన్ బాషా, పసుపులేటి వెంకటేశ్, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ నేలటూరి రవి కుమారుడు ప్రవీణ్ గంజాయి విక్రయాలకు సంబంధించిన కేసుల్లో జైలుకు వెళ్లారు. అక్కడ వారితో చిన్న చిచ్చాకు పరిచయాలు ఏర్పడ్డాయి. బయటకు వచ్చాక వారితో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశాడు. జైల్లో పరిచయమైన మరో ముగ్గురు మైనర్లను మరో టీమ్‌గా ఏర్పాటు చేశాడు. కొద్దిరోజుల కిందట హైదరాబాద్ నుంచి వచ్చిన చిన్న చిచ్చా మైనర్లతో కలిసి పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో స్నాచింగ్‌లు చేశాడు. తర్వాత నాగరాజు, బాషా, వెంకటేశ్, ప్రవీణ్‌తో కలిసి ఏలూరు జిల్లా వీరవల్లికి వెళ్లాడు. అక్కడ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను కాజేశారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డ్యూక్ బైక్‌ను దొంగిలించారు. ఈ వస్తువులను ఒడిసాలోని మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గిరిజనులతో సంబంధం ఉన్న బ్యాచ్‌కు అప్పగించారు. మల్కాన్‌గిరి జిల్లాలో ఈ వస్తువులు ఇచ్చేసి 23.5 కిలోల గంజాయిని ల్యాప్‌ట్యాప్ బ్యాగ్‌లో పెట్టుకుని తీసుకొచ్చారు. ఈ బ్యాచ్‌లో ఉన్నవారికి తలో కొంత ఇచ్చిన చిన్న చిచ్చా మిగిలిన మొత్తాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాడు. బైకుపై హైదరాబాద్‌కు వెళ్తుండగా, జగ్గయ్యపేటలో వస్త్రదుకాణం తాళాలు పగలగొట్టి దుస్తులు దొంగిలించాడు. వాటిని తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. ఈ నేరాలకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులకు చిన్న చిచ్చా అసలు స్వరూపం తెలిసింది. అతడితో పాటు నాగరాజు, బాషా, వెంకటేశ్, ప్రవీణ్, మరో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. ఒడిసాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన సుమన్ బిసోయ్, సాగర్ జెనా, పెనమలూరు మండలం గంగూరుకు చెందిన పటాన్ జియాఖాన్‌కు ఇవ్వడానికి గంజాయిని తీసుకొచ్చారు. వారిని పటమట పోలీసులు అరెస్టు చేశారు. చిన్న చిచ్చా కుటుంబం ఇంతకుముందు భవానీపురంలో ఉండేది. అతడి తల్లిదండ్రులు ప్రస్తుతం కొత్తపేటలోని సాయిరామ్ థియేటర్ వద్ద ఉంటున్నారు. దీంతో భవానీపురంలో ఉన్న షీట్‌ను కొత్తపేట పీఎస్‌కు బదిలీ చేస్తున్నారు.



సుజనా మాతృమూర్తి సుశీలకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

సుజనాచౌదరి మాతృమూర్తి జన్మదినం

- హాజరైన కూటమి ప్రజాప్రతినిధులు

కంచికచర్ల, ఆగస్టు 26 : కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి మాతృమూర్తి యలమంచిలి సుశీల 90వ జన్మదిన వేడుకలను సోమవారం వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వగృహంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సుజనా చౌదరి పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేయించారు. వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, నెట్టెం రఘురామ్, కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణ ప్రసాద్, కొలికిపూడి శ్రీనివాసరావు, బోడె ప్రసాద్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, జలీల్‌ఖాన్, బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొని సుశీలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ క్రాప్ నమోదులో జాప్యం నివారించాలి

- ఏపీ కౌలు రైతు సంఘం

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 26 : ప్రభుత్వం ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభించి, పంట వేసిన ప్రతి రైతును నేరుగా వెళ్లి నమోదు చేస్తామని ప్రకటించినా నమోదు కార్యక్రమం సజావుగా సాగటంలేదని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఈ క్రాప్ నమోదు వలన రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని చెబుతున్నా నమోదులో జాప్యాన్ని నివారించాలని కోరారు. పంట నమోదుకు సంబంధిత అధికారులు వెళ్లినప్పుడు యాప్ సరిగా పని చేయకపోడం, మహిళా ఉద్యోగులు ఫీల్డ్‌లోకి వెళ్లడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం, రీ సర్వే అయిన గ్రామాలలో ల్యాండ్ డేటా యాప్‌లో పూర్తిగా రాకపోవడం లేదా చాలా తక్కువ విస్తీర్ణం చూపిండం వంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ క్రాప్ నమోదయ్యే వరకు ముఖ్యంగా వీఆర్వో, వీఏఎస్‌లు పూర్తి సహకారం ఇవ్వాలన్నారు.

రాష్ట్ర సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్‌లో ఉమ్మడికృష్ణా సత్తా



విజయవాడ స్పోర్ట్సు : భీమవరం జిల్లాలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా ప్లేయర్స్ సత్తాచాటి పతకాలు సాధించినట్టు కేడీబీఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి.అంకమ్మ చౌదరి, బోడపాటి లక్ష్మీనారాయణ, కార్యదర్శి పర్సా శ్రీనివాసరావులు తెలిపారు. బాలికల సింగిల్స్‌లో ఎం.హాసినాశ్రీ, వై రేణు శ్యామలరావు(విజయనగరం)పై 21-19, 21-1తో జయభేరి మోగించి టైటిల్‌ను వశం చేసుకుంది. డబుల్స్ విజేతగా ఎం.హసీనా శ్రీ, కె గగనశ్రీలు వై హిమబిందు, వై.రేణుశ్రీ(విజయనగరం)పై హోరాహోరీ పోరులో 21-16, 15-21, 22-20తో టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నారు.

ప్రశ్నాపత్రం లీక్ అయితే క్రిమినల్ చర్యలు


- ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి సుబ్బారావు

వన్‌టౌన్, ఆగస్టు 26 : ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 1 నుంచి 10వ తరగతి వరకు సెల్ఫ్ అసిస్మెంట్ మోడల్ పేపర్ - 1 పరీక్షా పత్రం లీక్ అయితే క్రిమినల్ చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నా పత్రాలను ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో జిల్లా కామన్ ఎగ్జిమినేషన్ బోర్డు (డిసిఈబి) ద్వారా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు మండల స్థాయిలో ఐదుగురితో కూడిన కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కమిటీలో ఎంఈవో 1, 2, ముగ్గురు సీనియర్ హెచ్‌ఎంలు ఉంటారని, పరిక్ష ప్రారంభానికి ఒక గంట ముందు మాత్రమే పాఠశాలలకు ప్రశ్నాపత్రాలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ పైన విద్యార్థులు సమాధానం ఇవ్వాలని, 9, 10వ తరగతి విద్యార్థులు ఆన్సర్ షీట్ పైనే రాయాలన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తగు జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించాలని సుబ్బారావు ఒక ప్రకటనలో ఆదేశించారు.

అసాంఘికాలకు అడ్డా.. హిల్‌టాప్ గెస్ట్‌హౌస్

- ముంబయి సినీ నటి వివాదంతో వెలుగులోకి వైసీపీ అక్రమాలు
- ఉలిక్కిపడిన అధికారులు

ఇబ్రహీంపట్నం : ఎన్టీటీపీఎస్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల వెలుగుచూసిన ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ నిలయంగా మారిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముంబాయికి చెందిన సినీనటిని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త కుమారుడి ప్రేమ వ్యవహారం బెడిసికొట్టడంతో ఆమెను ఇక్కడి గెస్ట్‌హౌస్‌కు రప్పించి 18 రోజుల పాటు వేధింపులకు గురిచేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఓ ఐపీఎస్ స్థాయి అధికారి కీలక భూమిక పోషించాడు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల అండతో పలువురు వైసీపీ శ్రేణులు ఈ గెస్ట్‌హౌస్‌లో పాగావేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్టు సమాచారం. ముంబాయి నటి చిత్ర హింసల విషయం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో ప్రసారం కావడంతో ఎన్టీటీపీఎస్ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గెస్ట్‌హౌస్‌కు పరుగులు పెట్టి రికార్డులు, సీసీ ఫుటేజ్‌లు పరిశీలించారు. అయితే రికార్డులు, సీసీ ఫుటేజ్‌లు సరిగ్గా లేవని గుర్తించి అధికారులను ప్రశ్నించగా వైసీపీ ప్రభుత్వంలో సీఎంవో కార్యాలయం నుంచి ఒత్తిడి వల్లే అలా చేయాల్సి వచ్చిందనే సమాధానం వినిపిస్తోంది. ఈ ప్రాంతానికి చెందిన ఓ మాజీమంత్రి అధికారంలో ఉండగా గెస్ట్‌హౌస్‌ను ఇష్టానుసారంగా వాడుకున్నట్టు ఆరోపణలు వస్తుండటంతో ఎన్టీటీపీఎస్ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.



ఎన్టీటీపీఎస్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్

ఆలయ భూముల అన్యాక్రాంతంపై..
వాస్తవాలు ప్రకటించండి

- 'ఆంధ్రజ్యోతి' కథనాలపై ఈవో పేరుతో సోషల్ మీడియాలో ప్రకటన హల్‌చల్
- అధికారుల అస్పష్ట వివరణ

నందిగామ : పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయభూముల అన్యాక్రాంతంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆలయ భూముల హాంఫట్' కథనంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తుండగా, దేవదాయ శాఖ అధికారులు తప్పులను కప్పిపుచ్చుకొనే పనిలోపడ్డారు. సోషల్ మీడియాలో ఈవో పేరుతో ఓ వివరణ చక్కర్లు కొడుతోంది. పట్టణంలో అంతర్భాగంగా ఉన్న 55 ఎకరాల స్వామివారి ఆలయ భూమిని దీర్ఘకాలిక లీజుకు ఇచ్చే ఆలోచన లేదని ఈవో పేరుతో సదరు ప్రకటనలో పేర్కొన్నారు. స్వయంగా డిప్యూటీ కమిషనరే పట్టణంలో ఉన్న భూములను దీర్ఘకాలిక లీజులకు ఇస్తామంటూ ప్రకటించారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ వివరణ ఇవ్వాల్సి ఉండగా, ఈవో వివరణ ఇవ్వడం సరికాదని ప్రజలు భావిస్తున్నారు.

ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం సదరు భూములను దీర్ఘకాలిక లీజుల పేరుతో అన్యాక్రాంతానికి ప్రయత్నించింది. కానీ అప్పటికే వ్యవసాయానికి గాను లీజు వేలం నిర్వహించి ఉండటంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రభుత్వం మారిన తరువాత వైసీపీ పాలకుల పాత్రను అధికారులే పోషిస్తు.. ఈవో స్థాయి అధికారితో ప్రకటన ఇప్పించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రజలు భావిస్తున్నారు.

పారువేట మండప స్థలం వివాదం..

పారువేట మండప స్థలం విషయమై అధికారుల వివరణ హాస్యాస్పదంగా ఉంది. అక్రమ నిర్మాణంపై ప్రశ్నించగా, తాము 11 ఏళ్లకు ఖాళీ చేసే విధంగా లీజుదారుడి నుంచి అఫిడవిట్ తీసుకున్నామంటూ ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి లీజు నిబంధనలోనే ఆ అంశం పొందుపరిచి ఉంటుంది. కొత్తగా అఫిడవిట్ తీసుకున్నామంటూ తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేశారు. పైగా స్థలం ఖాళీగా ఉన్నందున వేలం వేసినట్టు పేర్కొన్నారు. స్వామివారి కళ్యాణం అనంతరం అమ్మవారితో కలిసి పారువేట మండపం వద్ద పూజలందుకుంటారు. ఆ సమయంలో భజంత్రీలు, పల్లకీమోసే వారు, భక్తులు నిలబడేందుకు వినియోగించే సదరు స్థలం ఖాళీగా ఉందన్న అధికారి ప్రకటనపై భక్తులు మండిపడుతున్నారు.



సర్వేలతో ఆర్‌అండ్‌బీ, రోడ్డుపై మార్కింగ్ వేసిన అధికారులు (ఫైల్‌ఫొటో)

ఆక్రమణలపై అస్పష్ట వివరణ..

సర్వేనెంబర్ 821లో గల 5.38 ఎకరాలలో రోడ్ల నిర్మాణం, ఆక్రమణలపై అధికారుల వివరణలో సదరు భూమిలో ఏర్పాటు చేసిన మూడు రోడ్లు అక్రమమని స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. ఆ రోడ్లకు దిగువన చాలా మంది నివాసం ఉంటున్నారు. వారిలో ఎవరిని బాధ్యుల్ని చేస్తారో అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

కొలతల కిరికిరి..

వైసీపీ ఐదేళ్ల పాలన చివరలో రోడ్ల విస్తరణలో భాగంగా చందర్లపాడు రోడ్డు విస్తరణకు సిద్ధమైంది. విస్తరణలో స్వామివారి ఆలయ భూమి తీసుకోవడానికి వీలులేదని భక్తులు పట్టుబట్టడంతో మునిసిపల్, దేవదాయశాఖ అధికారుల సమక్షంలో భూమికి కొలతలు వేశారు. ఆ కొలతల ప్రకారం రోడ్డు నిర్మించారు. ఆలయానికి చెందిన 5.38 ఎకరాలు పూర్తి విస్తీర్ణం ఉన్నట్టుగా ధృవీకరించారు. కానీ ఇటీవల కొందరు భక్తులు సదరు భూమి ఆక్రమణలకు గురైనట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ దేవదాయశాఖ జాయింట్ సర్వే నిర్వహించాయి. ఈ సర్వే ప్రకారం చందర్లపాడు రోడ్డు సగానికి పైగా ఆలయ భూమిలో ఉన్నట్టు అధికారులు తేల్చారు. దీనిని బట్టి స్వామివారి ఆలయ భూమి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గానీ, ఎవరైతే ఆక్రమించారని అనుమానితులుగా ఉన్న సరిహద్దు వారి చేతుల్లోనో ఉండి ఉండాలి. ఈ రెండు సర్వేలలో ఏ సర్వే నిజమైనదో తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీంతో పాటు బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆలయానికి చెందిన 55 ఎకరాల భూముల చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా ఆక్రమణలకు దిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. వారిని కాపాడేందుకే దీర్ఘకాలిక లీజులకు భూములు ఇచ్చి చేతులు దులుపుకోవాలని అధికారులు భావిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

కదలని యంత్రాంగం..

స్వామివారి ఆలయభూములపై సమగ్ర సర్వే నిర్వహించి పటిష్టమైన హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలని ఇటీవల ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులను ఆదేశించారు. దేవదాయ శాఖ అధికారులతో కలిసి సర్వే చేపట్టాలని ఆర్డీవోను ఆమె కోరారు. దీనిపై ఇంత వరకూ ఆయా శాఖలు ముందుకు రాకపోవడం.

జాతీయ క్రీడలకు వేదికగా ఏపీ

- ఎంపీ కేశినేని శివనాథ్

నందిగామ, ఆగస్టు 22 : జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ వేదిక కాబోతుందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌లతో కలిసి నందిగామ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ ఏకగ్రీవంపై ఆయన మాట్లాడుతూ, మొత్తం 34 సంఘాలు ఏకగ్రీవం కానున్నాయని, పోటీ లేనందున త్వరలో ఎన్నిక ఫలితాలు వెలువడుతాయన్నారు. విజయవాడ,



తనను కలిసిన రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి, కడప స్టేడియాలలో అంతర్జాతీయ క్రికెట్ పోటీలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. 2027-28లలో జాతీయ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించేలా సీఎం చంద్రబాబు సహకారంతో ప్రయత్నాలు చేస్తానన్నారు. రానున్న రోజుల్లో క్రీడలు అంటే ఆంధ్రప్రదేశ్ అనేలా చేస్తామని చెప్పారు.

నందిగామ, కొండపల్లి మునిసిపాలిటీలు టీడీపీ వశం ఖాయం

త్వరలో ఎన్నికల కమిషన్‌ను కలిసి చైర్మన్ ఎన్నికపై నోటిఫికేషన్ కోరనున్నట్టు ఎంపీ తెలిపారు. నందిగామ, కొండపల్లిలో టీడీపీకి బలం ఉన్నందున చైర్మన్ పీఠం దక్కించుకుంటామన్నారు. వైసీపీ పాలనా విధానాలు నచ్చక పెద్దఎత్తున కౌన్సిలర్లు కూటమిలోకి వచ్చారని చెప్పారు. అనంతరం ఆయన ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు.

వేదాద్రి ఎత్తిపోతల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం అవసరం

వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రైతుల సహకారం అవసరమని ఎంపీ అన్నారు. రైతులతో మాట్లాడిన ఆయన త్వరలో ఒక మోటార్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని ఎత్తిపోతల పథకాలకూ మరమ్మతులు చేయించి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేశం నాయకులు కోగంటి బాబు, ఏచూరి రామకృష్ణ, కామసాని సత్యవతి, మన్నె కళావతి, కత్తురోజు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

కీచక టీచర్‌పై వేటు

కంకిపాడు, ఆగస్టు 26 : విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్టు మండల విద్యాశాఖ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు మండవ శ్రీనివాసు అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు విచారించిన విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రసాద్ తెలియజేశారు.

పుల్లేరులో మునిగి విద్యార్థి మృతి



గుడ్లవల్లేరు, ఆగస్టు 26 : స్నేహితులతో కలిసి సరదాగా కాలవకు వెళ్లి ప్రమాద వశాత్తు పుల్లేరులో మునిగి శవమై తేలిన యువకుడి ఉదంతమిది. గుడ్లవల్లేరు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రన్న కాలనీకి చెందిన కోలా జోషి(16) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి నీలకంఠేశ్వరపురంలో పుల్లేరులో ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో స్నానానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో జోషి కాలుజారి కాల్వలోకి జారిపోయాడు. కళ్లముందే జోషి నీటిలో కొట్టుకుపోవడంతో స్నేహితులు గుడ్లవల్లేరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందం, రెవెన్యూశాఖలు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం రైల్వే బ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తల్లడిల్లిపోయారు. జోషి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

సుబాబుల్‌కు రికార్డు ధర

- రైతుల్లో హర్షాతిరేకం

కంచికచర్ల : జిల్లాలో సుబాబుల్‌కు రికార్డు స్థాయిలో ధర లభిస్తున్నది. పేపరు కంపెనీల డిమాండ్‌కు తగినంతగా ముడిపదార్థమైన సుబాబుల్ కర్ర సరఫరా లేనందున ధర బాగా పెరిగింది. డంపింగ్ యార్డు వద్ద టన్నుకు రూ. 7,050ల ధర లభిస్తున్నది. గత ఏడాది ప్రారంభంలో టన్నుకు రూ.15 వందలు లభించటం గగనం కాగా, ప్రస్తుతం ఖర్చులు పోను చేతికి నికరంగా టన్నుకు రూ. ఆరు వేలకు పైగా అందుతుండటంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు.

ఎన్టీఆర్ జిల్లాలో ముఖ్యంగా నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఇంతకు ముందు సుమారుగా లక్ష ఎకరాల్లో సుబాబుల్ తోటలుండేవి. గత ఏడాది సుబాబుల్ రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. మద్దతు ధరలో సగానికి సగం కాదు కదా, నామమాత్రపు ధర కూడా రైతులకు రాలేదు. గత జనవరిలో టన్నుకు రూ. 15 వందలు రావటం చాలా కష్టమైంది. వైసీపీ పాలనలో ఐదేళ్లు గిట్టుబాటు ధర ఇవ్వకుండ పేపరు కంపెనీలు, రైతులను జలగల్లా పీల్చి పిప్పి చేశాయి. గిట్టుబాటు ధర కోసం రైతుల ఆందోళన అరణ్యరోదనగా మారింది తప్పితే పాలకులు పట్టించుకోలేదు. తీవ్రంగా నష్టపోయిన పలువురు రైతులు సుబాబుల్ తోటలు తొలగించి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయటం ప్రారంభించారు. దీంతో జిల్లాలో తోటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం సుబాబుల్ తోటలు 50 వేల ఎకరాల లోపు ఉంటాయని అంటున్నారు.



ఒకవైపు తోటల విస్తీర్ణం తగ్గటం, మరోవైపు వర్షాకాలం కావటంతో సుబాబుల్ తోటలు నరకటానికి వీలుపడకపోవటం వల్ల ప్రస్తుతం కర్ర తగ్గిపోయింది. నిన్నటి దాకా గుత్తాధిపత్యంతో ధర విషయంలో పెత్తనం చెలాయించిన కంపెనీలు కర్ర కోసం పోటీపడుతూ ధర పెంచుతున్నాయి. కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత మరల ధరలో కదలిక వచ్చింది. ప్రస్తుతం డంపింగ్ యార్డుల వద్దకు తీసుకువెళితే టన్నుకు రూ. 7,050ల వంతున ధర లభిస్తున్నది. రైతుల చేతికి నికరంగా రూ. 6,100లు అందుతున్నాయి. సుబాబుల్ చరిత్రలో ఈ ధర ఒక రికార్డు. కూటమి ప్రభుత్వంలో అత్యధిక ధర లభిస్తుండటంతో రైతులు ఎంతో సంతోషంతో ఉన్నారు. కంపెనీల అవసరాల మేరకు కర్ర సరఫరా లేనందున ఈ ధర ఇంకా పెరగవచ్చునని రైతులు అంటున్నారు. ధర పెరగటం వల్ల ఎక్కువ మంది రైతులు సుబాబుల్ తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

సాగుకు పోవాలంటే.. వాగు దాటాల్సిందే!

- పంటల సాగుకు ఆటంకంగా గుర్రపు వాగు
- వంతెన నిర్మాణానికి రైతుల ఎదురుచూపు

తిరువూరు : ఎరుకోపాడు వద్ద గుర్రపువాగుపై వంతెన నిర్మాణం పూర్తిచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. 2012లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.56 లక్షల వ్యయంతో చెపట్టిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా ఈ నిర్మాణం ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వాగువస్తే రాకపోకలకు ప్రమాదమే..

కొద్దిపాటి వరద వచ్చినా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు సాగుభూములకు వెళ్లలేని పరిస్థితి. ఎరుకోపాడుతో పాటుగా, కొమ్మిరెడ్డిపల్లి, చింతలపాడు, గొల్లగూడెం తదితర గ్రామాలకు చెందిన రైతుల సాగుభూములు గుర్రపువాగు అవతల వైపు ఉండటంతో నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలు గుర్రపువాగు దాటాల్సిందే. సాధారణ రోజుల్లో నీరు ఉన్నా వాగుదాటి వెళుతున్న రైతులకు వరద వస్తే మాత్రం వాగుదాటడం కష్టాసాధ్యం అవుతోంది. వరద తగ్గేవరకు ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోవల్సిందే.

పంట దిగుబడి తోలకాలకు ఇబ్బంది పడాల్సిందే..

వాగు అవతలవైపు ఉన్న భూముల్లో దిగుబడి అయిన పంటను



వాగు నీటిలో నుంచి సాగుభూములకు వెళుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు



అసంపూర్తిగా వంతన నిర్మాణ పనులు

రైతులు ఇంటికి తెచ్చుకునేందుకు నానాఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట లోతుడుతో వాహనాలు వాగులో దిగబడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొమ్మిరెడ్డిపల్లి, ముష్టికుంట్ల, వామకుంట్ల, గొల్లగూడెం తదితర గ్రామాల్లో మిర్చి, వరి పంటలను గంపలగూడెం మార్కెట్ యార్డుకు తరలించేందుకు రైతులు గుర్రపువాగు మీదుగా వెళుతుంటారు. ప్రస్తుతం వాగుపై బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో రైతులు చింతలపాడు మీదుగా మార్కెడ్‌యార్డుకు వెళ్లాల్సి వస్తుండంతో రైతులపై రవాణభారం పడుతుంది, పాలకులు, అధికారులు స్పందించి ఎరుకోపాడు వద్ద గుర్రపువాగుపై నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనుల్ని చేపట్టి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

భవానీపురంలో నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

విద్యాధరపురం, ఆగస్టు 26: భవానీపురంలోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ శిష్తి ఔల్యా దర్గా 40వ ఉరుసు మహోత్సవం ఈనెల 27, 28, 29 తేదీల్లో జరుగుతుందని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షా మహ్మద్ ఖాజా మొయినుద్దీన్ శిష్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న పర్చంకుషాయ్ (ఉరుసు) ప్రారంభమవుతుందన్నారు. 28న సాయంత్రం 6 గంటలకు బాబా దర్గా నుంచి గంధంతో బయల్దేరి బాబా ధ్యానం చేసిన చోటైన వెస్ట్ రైల్వే స్టేషన్ సమీపంలోని షాజహాదార్ ముసాఫిర్ ఖానా షాప్ నెం.9 వద్దకు చేరుకుని, తిరిగి రాత్రి 9 గంటలకు దర్గాకు చేరుతుందని తెలిపారు. 29న చిరాగా (దీపారాధన) కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాత్రి 9 గంటలకు ఖవాళీ ప్రోగ్రామ్, ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.



శారద విద్యాలయంలో ఎమ్మెల్యే బొండా ఉమా



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



యశోద నందన సేవాసమితి ఆధ్వర్యంలో



మంత్రి పార్థసారథికి కోలాటంతో స్వాగతం పలుకుతున్న చిన్నారులు

మానవాళికి మార్గ నిర్దేశకుడు శ్రీకృష్ణుడు

ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, ఆగస్టు 26: శ్రీ కృష్ణుడు సర్వ మానవాళికి మార్గ నిర్దేశకుడని, శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత ప్రతి ఒక్కరూ అనుసరించదగినదని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం, శ్రీ శారద స్కూల్ ఆధ్వర్యంలో పాయకాపురంలోని శారద విద్యాలయంలో సోమవారం ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా ఎనిమిది విభాగాల్లో ఉట్టి కొట్టుడు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివేకానంద స్కూల్, శారద విద్యాలయం, భారతీయ విద్యా మందిర్ స్కూళ్ల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటుగా మహిళలు, సీనియర్ సిటిజన్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి రావులు హాజరయ్యారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టుడు కార్యక్రమంలో ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రదానం జరిగింది.

శ్రీ కృష్ణుడి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌నగర్ సెంటర్‌లోని శ్రీ కృష్ణుని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథి హాజరై ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నియోజకవర్గ ప్రజలకు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ కన్వీనర్ వట్టే వెంకటేశ్వరరావు, నేతలు కొండ, వైకుంఠం, పైడి శ్రీను పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: మధురానగర్‌లోని శ్రీకృష్ణదేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మనిముక్కు శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ఇన్‌చార్జ్ గౌతమి ప్రసాద్, బీసీ నాయకుడు అంగిరేకుల రాంబాబు పాల్గొన్నారు.

గుణదల: మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి పాల్గొన్నారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన వేడుకలో భక్తులు పాల్గొన్నారు. ప్రసాద వితరణలో బొండా ఉమా పాల్గొని భక్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. 26వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు తోట పాండు, డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్ పాల్గొన్నారు. ● 6వ డివిజన్లోని బ్రహ్మానందరెడ్డి నగర్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పాల్గొని చిన్ని కృష్ణుడికి వెన్న నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్న సంతర్పణలో పాల్గొని రూ. 5వేలు విరాళంగా సమర్పించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత పాల్గొన్నారు. పడాల నాగు, మోకర గురునాథం, కండుబోతు దుర్గారావు, పడాల గంగాధర్ పాల్గొన్నారు.

రాణిగారితోట: శ్రీకృష్ణాష్టమి వేడుకలను రాణిగారితోట జాతీయ రహదారిపై ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసుకుని వచ్చే సంవత్సరం నూతన ఆలయంలో ఈ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. బొప్పన భవకుమార్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బలగాని శ్రీను, ఉపాధ్యక్షుడు కుర్ర కొండయ్య, గంధ్ర వేంకటేశ్వర్లు, బోట్ల కాశయ్య, మాదల వెంకటేశ్వర్లు, వేముల దర్గారావు, రాయి రంగమ్మ, గంధ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టికొట్టిన సుజనా

● ఊర్మిళానగర్‌లో భారీ అన్నదానం



భవానీపురం: 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో మోరబోయిన రాంబాబు, శ్రీకాంత్ అండ్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ముఖ్య అతిథిగా హాజరై అందరినీ అలరించారు. కృష్ణుని విగ్రహం ప్రతిష్ఠ, అనంతరం శాస్త్రోకంగా జరిగిన పూజల్లో సీనియర్ టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు హాజరయ్యారు. మధ్యాహ్నం ఊర్మిళానగర్‌లోనే 500 మందికి అన్నదానం నిర్వహించగా, దీన్ని టీడీపీ సీనియర్ నాయకులు రాంబాబు ప్రారంభించారు. రాత్రి కన్నులపండుగగా విగ్రహం ఊరేగింపును నిర్వహించారు. కార్పొరేటర్ బుల్లా విజయకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కృష్ణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవాలయంలో జరిగిన వేడుకల్లో వైసీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. గోపూజ చేసి శ్రీకృష్ణుణ్ణి దర్శించుకున్నారు. ● మాచవరం పోతినేని వారి వీధిలో

రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

కృష్ణలంక: కృష్ణలంక మెట్లబజారులోని సుధాకర్స్ ఐడియల్ స్కూల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం జేకేజీ, ఎస్‌కేజీ విద్యార్థినీ విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలతో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కృష్ణుడి విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూజలు నిర్వహించి పాటలు పాడారు. ● బాలాజీనగర్‌లోని సుధాకర్స్ మహితా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. చైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ దేవినేని వరలక్ష్మి, డీన్ సురేష్‌కుమార్, కో ఆర్డినేటర్ పాల్గొన్నారు. చిన్నారులను బహుమతులతో సత్కరించారు.

యశోద నందన సేవాసమితి ఆధ్వర్యంలో..

చిట్టినగర్: యశోద నందన సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వీరాంజనేయ మార్కెట్ కేటీ రోడ్డులో కృష్ణ జన్మాష్టమి 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కె.నాగుల్‌మీరా, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్, టీడీపీ యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. మంగళవారం పలు పూజ కార్యక్రమాలతోపాటు సాయంత్రం తీన్‌మార్ వాయిద్యాలతో ఉట్టికొట్టుట కార్యక్రమం జరుగుతుందని సమితి నిర్వాహకులు నమ్మి భాను ప్రకాష్ తెలిపారు. 28న మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి నగర ఊరేగింపు జరుగుతుందన్నారు. సమితి సభ్యులు అయితా కృష్ణ కిషోర్, పట్నాల అప్పన్న, సందక శివకుమార్, కిలాని కామేష్, దేవర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుందావారి కండ్రికలో ...

వన్‌టౌన్: 64వ డివిజన్ పరిధి కుందావారి కండ్రికలోని శ్రీకృష్ణమందిరం వద్ద శ్రీకృష్ణకమిటీ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావులు హాజరయ్యారు. వీరికి చిన్నారులు కోలాటం ఆటతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఓ చిన్నారితో కోలాటం ఆడారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ నిర్వాహకులు పిన్నబోయిన ఏడుకొండలు, గొరిపర్తి హనుమంతరావు, మండల బుల్లిబాబు, కె. జమలయ్య, చిన్ని శ్రీను, చిన్ని వెంకటేశ్వరరావు, సాదం శ్రీను, నేలపాలు పంగిడయ్య, పిన్నబోయిన శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



రాగూర్ గ్రంథాలయానికి కుర్చీలు, టేబుల్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ బెజవాడ స్టార్స్ సభ్యులు

గ్రంథాలయానికి కుర్చీలు, రీడింగ్ బల్లలు బహూకరణ

గవర్నర్‌పేట, ఆగస్టు 26: రోటరీ క్లబ్ ఆఫ్ బెజవాడ స్టార్స్ ఆదివారం ఎంజీ రోడ్డులోని రాగూర్ స్మారక గ్రంథాలయానికి పాఠకులకు ఉపయోగపడే కుర్చీలు, రీడింగ్ బల్లలను బహూకరించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం, గ్రంథాలయాధికారిణి కె. రమాదేవికి వీటిని అందజేశారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె. నాగరాజు, సభ్యులు చిరంజీవి, వెంకటరమణ, చిన్నం రామకృష్ణ, కల్యాణ చక్రవర్తి, కె. పార్థసారధి, వెంకటేశ్వర్లు, కోనేరు మధు, డాక్టర్ రవికుమార్, కుర్చీలు సహాయం చేసిన ఎంఏఎం ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు, సూరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, ఆగస్టు 26: ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలో శ్రీనగర్‌కాలని 11కేవీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ జీరోలైన్ నుంచి ఐదవ రోడ్డు వరకూ, టీచర్స్‌కాలనీ ఒకటి నుంచి మూడవ రోడ్డు వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

డీసీపీ హరికృష్ణ

వన్‌టౌన్, ఆగస్టు 26: బహిరంగ ప్రదేశాల్లో మద్యంతో పాటు మత్తు పదార్థాలు సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ టి. హరికృష్ణ తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో శాంతిభద్రతలు సమర్థవంతంగా అమలు పరచాలనే కార్యక్రమంలో భాగంగా వెస్ట్ జోన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లు, నేరస్తులతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి పై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎవరైనా మద్యం సేవించిన వారు, రౌడీషీటర్లు పట్టుబడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం వెస్ట్, నార్త్ డివిజన్లలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో సుమారు 138 మందిని అదుపులోకి తీసుకుని వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించి, కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 97 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లు వారం పాటు కొనసాగుతాయని డీసీపీ తెలిపారు. నార్త్ ఏసీపీ, వెస్ట్ ఇన్‌చార్జ్ ఏసీపీ రాజారావు, సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ హరికృష్ణ

హోటళ్లు, లాడ్జిల యజమానులు నిబంధనలు పాటించాలి

గవర్నర్‌పేట సీఐ సత్యనారాయణ

వన్‌టౌన్: హోటళ్లు, లాడ్జిల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, పోలీసుల సూచనలను అమలు చేయాలని గవర్నర్‌పేట సీఐ ఎం. సత్యనారాయణ చెప్పారు. సోమవారం గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జిల యజమానులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. లాడ్జిలకు, హోటళ్లకు వచ్చే ప్రతి ఒక్కరి నుంచి గుర్తింపు కార్డులను సేకరించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిలో రికార్డింగ్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. లాడ్జిలు, హోటళ్లలో పేకాట, వ్యభిచారం, మద్యం పార్టీలు జరగకూడదన్నారు. హోటళ్లలో పనిచేసే సిబ్బందిపై ఎటువంటి నేరారోపణలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతిరోజూ హోటళ్లకు వచ్చే వారందరి వివరాలను తప్పకుండా పోలీసు స్టేషన్‌కు పంపించాలన్నారు. సైబర్ క్రైం నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి గురించి సరైన అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌ధారణ తప్పనిసరి



వన్‌టౌన్, ఆగస్టు 26: మోటార్ సైకిళ్లపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అయిదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ 1 సెక్టర్ సీఐ బాల మురళీకృష్ణ అన్నారు. ట్రాఫిక్ సీఐ బాల మురళీకృష్ణ సోమవారం తన సిబ్బందితో కలిసి వారధి సమీపంలో ఉన్న గుంటూరు బస్టాప్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి హెల్మెట్ కొనుగోలు చేయించి వారి చేత ధరింపచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడికి హెల్మెట్ ఒక రక్షణ కవచమని తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతీనగర్: మహానాడు రోడ్డు, రామవరప్పాడు రింగ్ సెంగర్‌లో పోలీసులు హెల్మెట్లు ధరించడంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతున్న పలువురు ద్విచక్రవాహనదారులతో కొత్త హెల్మెట్‌ను కొనుగోలు చేయించారు. అంతే కాకుండా వారితో రేడియం జాకెట్ ఇచ్చి ట్రాఫిక్ నియంత్రణ చేయించారు.







పశ్చిమలో ఆహ్లాదకరంగా పార్కులు

ఎమ్మెల్యే సుజనా చౌదరి భరోసా

భవానీపురం, ఆగస్టు 26 : పశ్చిమలో పార్కులను అన్ని వర్గాల ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుజనా చౌదరి భరోసా ఇచ్చారు. 43వ డివిజన్‌లోని హెచ్‌బీ కాలనీలో అబ్దుల్ కలాం, రోజ్ గార్డెన్(స్కేటింగ్) పార్కులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్కులో క్రికెట్ నెట్స్‌ను, స్కేటింగ్ రింక్‌ను యువత ఉపయోగించుకోవాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన పార్టీ విజయవాడ ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుపతి సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రధాన ఔట్‌ఫాల్ డ్రెయిన్ పరిశీలన



పాత రాజరాజేశ్వరిపేట, ఆగస్టు 26 : వనటౌన్ నుంచి పాత రాజరాజేశ్వరిపేట మీదుగా ప్రవహించే ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్‌ను నగర కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం పరిశీలించారు. ఔట్‌ఫాల్ డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలగించాలని ఎప్పటికప్పుడు డీసిల్ట్ చేస్తూ ఔట్‌ఫాల్ డ్రెయిన్ ప్రవాహంలో ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాత రాజరాజేశ్వరిపేటలో పారిశుధ్య నిర్వాహణను కూడా పరిశీలించారు. పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా జరగాలని, సైడ్ కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సమర్థతతో చంద్రబాబు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఆగస్టు 26: పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పట్టాలు ఎక్కించి పరుగులు పెట్టిస్తారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధి మూడవ డివిజన్‌లోని శ్రీ రామచంద్ర నగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్లో పురాతన కాలం నుంచి ఉన్న డ్రెయిన్ సమస్యను పరిష్కరించడానికి గతంలో చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో మాట్లాడానని గతంలో విడుదల చేసి, ఖర్చు చేయగా మిగిలిన నిధులతో కలిపి అదనంగా మరికొన్ని నిధులను కేంద్రం నుంచి విడుదల చేయించేలా చేస్తానన్నారు. రామచంద్ర నగర్, కరెన్సీ నగర్, నాగార్జున నగర్‌లో ఉన్న డ్రైయిన్లు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. కేంద్రం నుంచి విడుదలైన రూ. 200 కోట్ల నుంచి రూ.15 కోట్లను ఈ డివిజన్లోని సమస్యల పరిష్కారానికి వినియోగిస్తామని తెలిపారు. శ్రీ రామచంద్రనగర్ కాలనీ పెద్దలు సీతారామయ్య చౌదరి, సీహెచ్ ఈశ్వరరావు, గుత్తికొండ మోహన్, గద్దె రమేష్, కేశినేని విజయ కుమార్, యలమంచిలి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరపురంలో పట్టపగలు చోరీ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 26 : పట్టపగలు ఇంటి తలుపులు పగలకొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి వస్తువులు చోరీ చేసిన ఘటన వీరవల్లి పీఎస్ పరిధిలోని ఉమామహేశ్వరపురంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కరణం వెంకటరమణ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన ఐదున్నర కాసుల బంగారు ఆభరణాలు, రూ. లక్ష విలువ చేసే వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి వెళ్లి వేలి ముద్రలు సేకరించారు.

22 మద్యం సీసాలు పట్టివేత

పెనమలూరు: గోసాల ఎలిమెంటరీ పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 22 సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. ● పోరంకి ఆంధ్రాబ్యాంకు పక్కనే ఉన్న ఒక ఇంట్లో పేకాడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పెనమలూరు పోలీసులు అరెస్టు చేసి, రూ. 15వేలు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

ఉమ్మడి పౌరస్మృతి 'ఒకే దేశం - ఒకే చట్టం'



గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం

(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

H ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాకముం దు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దీన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

H ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

H ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధా న కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో.... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

H **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.

H వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసి(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదేవిధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

H ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంతమంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

దిక్సూచి

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3Y60EZ7లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

40 రోజులు వైజాగ్‌లోనే...



సినీ నటుడు, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం నగరానికి విచ్చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై-విశాఖ విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయన నగరంలోకి వెళ్లారు. కాగా విమానాశ్రయంలో రజనీకాంత్ కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కూలీ' చిత్రం షూటింగ్ 40 రోజులపాటు నగరంలోని ఫిషింగ్ హార్బర్, తదితర ప్రాంతాల్లో జరగనున్నట్టు తెలిసింది.

గోపాలపట్నం (విశాఖపట్నం)

నటుడు దర్శన్‌కు జైల్లో రాచమర్యాదలు



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీనటుడు దర్శన్‌కు కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో రాచమర్యాదలు అందుతున్న ఫొటో, వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌తోపాటు మరో ముగ్గురు జైలు ఆవరణలోని ఒక పచ్చిక మైదానంలో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చొని జల్సాగా గడుపుతున్నట్టు ఆ ఫొటోలో ఉంది. దర్శన్ ఒక చేతిలో కాఫీ కప్పు, మరో చేతిలో సిగరెట్ ఉన్నాయి. దర్శన్ ఎదురుగా ఆయన మేనేజర్‌తోపాటు ఈ కేసులో సహనిందితులుగా ఉన్న రౌడీషీటర్లు విల్సన్ గార్డెన్ నాగ, కుల్ల సీన కూర్చుని ఉన్నారు. జైల్లో ఖైదీలకు రాచమర్యాదలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కర్ణాటక ప్రభుత్వం ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడుగురు జైలు అధికారులను సస్పెండ్ చేసింది.

కొంప ముంచిన వీడియోకాల్

రౌడీషీటర్ జానీ అలియాస్ జనార్దన్ కుమారుడు సత్య మే 7న మార్కెట్ ధర్మ అనే రౌడీషీటర్‌కు వీడియో కాల్ చేశాడు. తన సెల్ పక్కనే నటుడు దర్శన్ ఉన్నాడని చూపించి.. దర్శన్‌తో హాయ్ చెప్పించాడు. ఈ వీడియోను రికార్డు చేసుకున్న సత్య.. తన దర్జాను చాటుకునేందుకు కలాసిపాళ్యలోని కొందరికి షేర్ చేశాడు. అదే దర్శన్ కొంప ముంచింది. మరోవైపు సత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అభిమాని కుటుంబానికి మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని ఈశ్వరయ్య తిరుపతి నుంచి తిరుమల కొండ వరకూ పొర్లు దండాలు పెట్టుకుంటూ వెళ్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విషయం చిరంజీవికి తెలిసి ఈశ్వరయ్యను, ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించి, ఇంట్లో బట్టలు పెట్టి సత్కరించారు. ఈశ్వరయ్య కుటుంబానికి తను అండగా ఉంటానని మెగాస్టార్ మాట ఇచ్చారు. గతంలో కూడా ఈశ్వరయ్య తిరుపతి నుంచి హైదరాబాద్‌లోని మెగాస్టార్ ఇంటి వరకూ సైకిల్ యాత్ర నిర్వహించారు.

హీరోయిన్‌ను చూసి హీరో ఉరుకులు, పరుగులు



'హుషారు' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాలభాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమా గురించి వివరిస్తూ 'పెళ్లి వయసు వచ్చినా హీరోకి పెళ్లి కాదు. కారణం అతనికి చదువు అబ్బలేదు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. ఎవరికీ నచ్చని హీరోను ఈ హీరోయిన్ ఎలా ప్రేమించిందా అన్నదే కథలో ట్విస్ట్. హీరోయిన్‌లోని మరో కోణం బయటకు రావడంతో హీరో భయపడి పారిపోవాలని అనుకుంటాడు. ఆమెని చూసి ఎందుకలా పారిపోవాలని అనుకున్నాడన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని చెప్పారు దర్శకనిర్మాతలు.



ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. సోమవారం ప్రియదర్శి పుట్టినరోజు కావడంతో సెట్‌లో వేడుక నిర్వహించారు. చాలా రోజుల తర్వాత పుట్టిన రోజుని సెలబ్రేట్ చేసుకుంటున్నాననీ, గొప్ప వ్యక్తుల మధ్య ఇలా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రియదర్శి అన్నారు.

హిందువులేనా అని అడిగారు



కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసుకునేందుకు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్లిన నటి నమిత దంపతులకు అవమానం ఎదురైంది. ప్రముఖుల దర్శన క్యూలైన్లో వెళ్లిన వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వీఐపీలు దర్శనానికి వస్తే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉందని పేర్కొన్న సిబ్బంది.. 'మీరు హిందువేనా?' అని అడిగారు. తామిరువురమూ హిందువులమేనని, తమ కుమారుడికి శ్రీకృష్ణుడి పేరే పెట్టామని వారు వివరించారు. హిందువు అయితే నుదుట కుంకుమ పెట్టుకుని రావాలని ఆ సిబ్బంది నమితకు సూచించారు. ఆ మేరకు నమిత నుదుట కుంకుమ పెట్టుకుని ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం నమిత దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. మీనాక్షి ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, తాము హిందువులమని ధ్రువీకరించేందుకు సర్టిఫికేట్ అడిగారని తెలిపారు. నమిత మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా తాను హిందూమతానికి చెందినదానిని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మీ టూ అంటూ ముందుకు వస్తున్న హీరోయిన్లు

● మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒకప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ అంటేనే బూతు సినిమాలు.. చవకబారు సినిమాలు.. అనే తేలిక అభిప్రాయం ఉండేది. కేరళలోనే కాదు ఇతర భాషల్లోనూ మలయాళ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండేది. భాష తెలియకపోయినా ఆ సినిమాల్లోని సీన్లకోసం ప్రేక్షకులు ఎగబడే వారు.. మమ్ముట్టి, మోహన్‌లాల్ వంటి హీరోలు ఉన్నా షకీలా లాంటి శృంగార తారలు అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. వారి సినిమాల కంటే షకీలా సినిమాలే ఎక్కువ కలెక్ట్ చేసేవి. అయితే క్రమేపీ ఆ ముద్ర నుంచి బయటపడింది మలయాళ చిత్ర పరిశ్రమ. కొత్త రకం కథలతో.. సహజత్వం ఉట్టిపడే సినిమాలతో మిగతా అందరి దృష్టినీ ఆకర్షించగలిగింది. అంతే కాదు ప్రయోగాత్మక చిత్రాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్స్ కోసం మలయాళం సినిమాలే చూడాలి అనే స్థాయికి ఎదిగిందీ పరిశ్రమ. అవార్డులతో పాటు రివార్డులూ పొందింది. అయితే 2017లో జరిగిన ఓ సంఘటన మలయాళ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠను దెబ్బ తీసింది. తెలుగు వారికీ పరిచయమైన హీరోయిన్ భావనపై జరిగిన లైంగిక దాడి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఈ దాడి దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అదే సమయంలో బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా ముందుకు వచ్చి, 2008లో నటుడు నానా పాటేకర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని వెల్లడించి ఇండియాలో 'మీ టూ' ఉద్యమానికి నాంది పలికింది. ఇక అప్పటి నుంచి ఈ ఉద్యమం మిగిలిన చిత్ర పరిశ్రమలకూ పాకింది. లైంగిక వేధింపులను బట్టబయలు చేసింది. ఉప్పెనలా ఎగసిన ఈ ఉద్యమం అప్పట్లో చాలా మందికి నిద్ర పట్టకుండా చేసింది,

అప్పటి నివేదిక ఇప్పుడు వెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఏడేళ్ల పాటు పరిశీలించి, జస్టిస్ హేమ కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక ఇప్పుడు ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. మళ్లీ ధైర్యంగా హీరోయిన్లు ముందుకు వచ్చి, తమపై లైంగిక దాడికి ప్రయత్నించిన వారి చిట్టా బయట పెడుతున్నారు.

ఐదేళ్ల కెరీర్ కోల్పోయా



చిన్మయి

"ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధ్యమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్ల పాటు కేసు నడుస్తూనే ఉంటుంది. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారింది" అని చిన్మయి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతాన్ని గుర్తుచేసుకున్నారు. "తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆయన గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు నాకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడు. కాగా, విదేశాల్లో ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు సీనియర్ గీత రచయిత వైర ముత్తు తనని వేధింపులకు గురి చేశారని 'మీటూ' ఉద్యమ సమయంలో ఆమె కామెంట్స్ చేశారు. ఆయన చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్ పైనే దెబ్బ కొట్టారని చిన్మయి ఆరోపించారు. ఈ క్రమంలోనే తమిళ పరిశ్రమ చిన్మయిని దాదాపు ఐదేళ్లు బ్యాన్ చేసింది. నిషేధం తర్వాత ఆమె 'లియో' చిత్రంలో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

నాతో అసభ్యంగా ప్రవర్తించాడు



శ్రీలేఖ



రంజిత్ బాలకృష్ణన్

బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు చేశారు. 2009లో రంజిత్ దర్శకత్వం వహించిన "పలేరి మాణిక్యం: ఒరు పతిర కోలపతకతింటే కథ" సినిమా ఆడిషన్ సందర్భంగా తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించారు. "నాకు సినిమా అవకాశం ఇస్తానని, సినిమా గురించి చర్చించేందు దర్శకుడు రంజిత్ నన్ను హోటల్ గదికి రమ్మన్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో షాక్ గురై అక్కడ నుంచి బయటకు వచ్చేశాను" అని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో నేను ఈ పదవిలో ఉండటం సముచితం కాదు. నాపై వస్తున్న ఆరోపణలను నేను లీగల్‌గా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

వేధింపులు ఎదుర్కొన్నా



మీను మునీర్

మరో మలయాళి నటి మీను మునీర్ తనకు జరిగిన ఓ చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మలయాళ పరిశ్రమకు చెందిన నటులు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్య, ప్రొడక్షన్ కంట్రోలర్ నోబెల్, విచు వల్ల నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. వారు అసభ్యపదజాలంతో నన్ను దూషించేవారు. షూటింగ్ సమయంలో జయసూర్య నా వెనుకనుంచి బలవంతంగా హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. ఇవన్నీ తట్టుకోలేక నేను మలయాళ ఇండస్ట్రీని వదిలి చెన్నైకు వచ్చేశా. నాకీ విషయంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన పనికి తగిన శిక్ష పడాలి" అని పేర్కొన్నారు.

నా దృష్టిలో సిద్ధిఖీ.. ఓ క్రిమినల్



సిద్ధిఖీ



రేవతి సంపత్

మలయాళ నటుడు సిద్ధిఖీ తనతో అసభ్యంగా ప్రవర్తించారని మలయాళ నటి రేవతి సంపత్ ఆరోపణలు చేశారు. "కొన్నేళ్ల క్రితం నటుడు సిద్ధిఖీ.. ఓ సినిమా కోసం నన్ను కలవాలని ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టారు. కూతురనే అర్థం వచ్చేలా ఆయన పిలవడంతో నేను ఆయనని సంప్రదించా. ఆయన నన్ను శారీరకంగా, మానసికంగా బాధించారు. నా దృష్టిలో ఆయనొక క్రిమినల్. దీని వల్ల నా కెరీర్ కూడా దెబ్బతింది. ఇప్పటికి ఈ విషయంపై మాట్లాడ్డానికి ధైర్యం వచ్చింది" అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పదవికి రాజీనామా చేశారు.

ఇండస్ట్రీలో లేకుండా చేస్తానన్నారు



గీతా విజయన్



తులసీ దాస్

నటి గీతా విజయన్ మలయాళ చిత్ర దర్శకుడు తులసీ దాస్‌పై ఆరోపణలు చేశారు. "చంచట్టం' సినిమా షూటింగ్‌లో తులసీ దాస్ నాతో అసభ్యంగా ప్రవర్తించారు. నేనుండే రూమ్ తలుపు కొడుతుండేవాడు. నేను ఆ పద్ధతిని తప్పుపట్టినందుకు షూటింగ్‌లో ఆయన నాకు డైలాగులు చెప్పేవారు కాదు. ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించేవారు" అని గీత ఆరోపించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పుకోవాలి



పృథ్వీరాజ్

హేమ కమిటీ నివేదికపై.. మలయాళ పరిశ్రమలోని ప్రముఖులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. "అధికారంలో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పదవుల నుంచి తప్పుకోవాలి. నిందితులపై విచారణ జరిపి.. దోషులని తేలితే కఠినంగా శిక్షించాలి. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే పరిశ్రమలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం మన కనీస బాధ్యత. అందుకు నేను ముందుంటా. అయితే అది నా ఒక్కడి బాధ్యత కాదు. అందరూ ఈ పద్ధతిని అనుసరించాలి" అని పేర్కొన్నారు.

జస్టిస్ హేమ కమిటీ... నివేదిక

2017లో నటి భావనపై కొందరు దుండగులు కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ సంఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే.హేమ ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు ఓ ఐ.ఏ.ఎస్ అధికారిణి ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఏకాగ్రతకు తాడాసనం

మన శరీర ఆకృతికి.. మానసిక ఆరోగ్యానికి చాలా దగ్గర సంబంధం ఉంటుంది. మంచి శారీరక ఆరోగ్యం ఉన్న వారికి మానసికంగా ఒత్తిడి కూడా తక్కువగా ఉంటుంది. యోగాలో- ఇటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచే అనేక ఆసనాలు ఉన్నాయి. వీటిలో 'తాడాసనం' కూడా ఒకటి.



ఎలా వేయాలి?

జాగ్రత్తగా గమనిస్తే చాలా మంది నిటారుగా నిలబడరు. ఒక వైపు కొద్దిగా వంగి ఉంటారు. దీని వల్ల వెన్నెముక దగ్గర ఉండే కండరాలలో మార్పు వస్తుంది. శరీర సమతౌల్యం సరిగ్గా లేకపోతే ఆ ప్రభావం - ఏకాగ్రతపై కూడా పడుతుంది. అందువల్ల తాడాసనాన్ని వేసే సమయంలో శరీరపు బరువును రెండు అరికాళ్లపైన పడేవిధంగా నిలబడాలి. తర్వాత చేతులను పూర్తిగా పైకి చాపాలి. ఆ తర్వాత చేతులు రెండింటిని జోడించాలి. అలా జోడించిన తర్వాత నడుము కదలకుండా ఛాతి భాగాన్ని వెనక్కి వంచాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే శరీర ఆకృతి సరి అవుతుంది.

వాటర్ రెమిడీస్


నీళ్లతో నూరు లాభాలు

- **పుదీనా నీరు:** శరీరమంతా డిటాక్స్ అవుతుంది. జీర్ణశక్తి పెరగడంతో పాటు, హైడ్రేషన్ కూడా వృద్ధి అవుతుంది. ఇందుకోసం కొన్ని పుదీనా ఆకులను నీళ్లలో వేసి కాచి, చల్లార్చి, వడగట్టి తాగాలి.
- **నిమ్మ నీరు:** పొట్ట చదునుగా మారుతుంది. చర్మం కాంతులీనుతుంది. వ్యాధినిరోధకశక్తి మెరుగవుతుంది. ఇందుకోసం గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం పిండుకుని పరగడుపునే తాగాలి.



- **జీలకర్ర నీరు:** జీర్ణశక్తి పెరుగుతుంది. బరువు తగ్గుతారు. నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం దక్కుతుంది. ఇందుకోసం గ్లాసు నీళ్లలో టీస్పూను జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే పరగడుపున తాగాలి.
- **అల్లం నీళ్లు:** జలుబు, తలనొప్పి, కడుపుబ్బరానికి విరుగుడుగా పని చేస్తాయి. గ్లాసు నీళ్లలో చెంచా అల్లం రసం కలిపి తాగాలి.

అకలేసియా కార్డియా



కొన్ని ఆరోగ్య లక్షణాలు తప్పుదోవ పట్టిస్తాయి. మరొక సమస్యగా భ్రమపడేలా చేసి, వ్యాధి నిర్ధారణను ఆలస్యం చేస్తాయి. అలాంటి కోవకు చెందిన అన్నవాహిక సమస్యే 'అకలేసియా కార్డియా'! సకాలంలో గుర్తిస్తే, శులభమైన చికిత్సతో అదుపులోకొచ్చే ఈ సమస్య గురించి వైద్యులు ఏమంటున్నారంటే...



ముద్ద... మింగుడు పడకపోతే?

తిన్నది గొంతులోనే ఉండిపోయినట్టు అనిపిస్తూ, ఛాతీ మంట కూడా వేధిస్తుంటే ఎవరైనా దాన్ని అజీర్తి సమస్యగానే భ్రమపడతారు. దాంతో జీర్ణకోశ వైద్యులను సంప్రతించి మందులు వాడుకోవడం మొదలు పెడతారు. ఇంకొందరు ఛాతీలో మంటను గుండె నొప్పిగా పొరబడి గుండె వైద్యులను కూడా కలుస్తూ ఉంటారు. నిజానికి ఈ లక్షణాలతో పాటు మింగడంలో కూడా ఇబ్బంది ఉంటే, దాన్ని 'అకలేసియా కార్డియా'గా భావించాలి. సాధారణంగా మనం ఏం తిన్నా, తాగినా సెకన్ల వ్యవధిలో పొట్టలోకి చేరిపోతుంది. అన్నవాహికలోని కండరాలు కదులుతూ తిన్న పదార్థాన్ని పొట్టలోకి జారుస్తూ ఉంటాయి కాబట్టి ఏం తిన్నా, తాగినా అవన్నీ క్షణాల వ్యవధిలో పొట్టలోకి చేరిపోతూ ఉంటాయి. కానీ కొందర్లో అన్నవాహికలోని కండరాల కదలికల్లో లోపం ఉంటుంది. జీర్ణాశయానికి దగ్గర్లో ఉండే లోయర్ ఈసోఫీగల్ స్పింక్టర్ బిగుతుగా మారిపోవడం వల్ల, తిన్న ఘన, ద్రవపదార్థాలన్నీ అన్నవాహికలోనే ఎక్కువ సమయం పాటు ఉండిపోయి, నెమ్మదిగా కిందకు జారుతూ ఉంటాయి. దాంతో ఛాతీలో మంట, అసౌకర్యం వేధిస్తాయి. ఇదే పరిస్థితి ఎక్కువ కాలం పాటు కొనసాగితే ట్యూబులా ఉండవలసిన అన్నవాహిక బెలూన్‌లా ఉబ్బిపోతుంది. ఆహారం గొంతులో నుంచి పైకి ఎగదన్నడంతో ఈ సమస్యను గ్యాస్ట్రోఈసోఫీగల్ రిఫ్లక్స్ (జిఇఆర్‌డి)గా భ్రమపడతారు. నిజానికి జిఇఆర్‌డి సమస్యలో పొట్టలో నుంచి ఆహారం గొంతులోకి ఎగదన్నుతుంది. కానీ అకలేసియా కార్డియాలో అన్నవాహికలోని ఆహారమే గొంతులో నుంచి పైకి ఎగదన్నుతూ ఉంటుంది.

ఈ లక్షణాలు కీలకం

- **ప్రోగ్రెసివ్ డిస్ఫాజియా:** ఘన, ద్రవ పదార్థాలు రెండింటినీ మింగడంలో ఇబ్బంది
- **జీర్ణం కాని ఆహారం నోట్లోకి చేరుకోవడం:** పొట్టలోకి ఆహారం చేరుకోలేదు కాబట్టి, కొన్ని గంటల పాటు అన్నవాహికలో ఉండిపోయిన ఆహారమే నోట్లోకి తన్నుకొస్తుంది.
- **ఛాతీ నొప్పి:** ఛాతీలో నొప్పి, పట్టేసినట్టు ఉండడం
- **బరువు తగ్గడం:** తినడంలో ఇబ్బంది ఉండడం వల్ల పోషకాహార లోపంతో బరువు తగ్గుతారు

ఎందుకీ సమస్య

సాధారణంగా మనం ఆహారం తినేటప్పుడు, నీళ్లు తాగేటప్పుడు, అన్నవాహిక దిగువన, జీర్ణకోశం మొదలులో ఉండే లోయర్ ఈసోఫీగల్ స్పింక్టర్ కండరాల సహాయంతో సంకోచిస్తూ, వ్యాకోచిస్తూ తిన్న పదార్థాలను పొట్టలోకి పంపిస్తూ ఉంటుంది. కొందర్లో మెదడు నుంచి ఈ కండరాల కదలికలకు సంకేతాలు అందవు. ఈ నాడీ సమస్య వల్ల స్పింక్టర్ రిలాక్స్ అవకుండా బిగుతుగా ఉండిపోవడం వల్ల ఆహారం పొట్టలోకి చేరుకోలేక అన్నవాహికలోనే ఉండిపోతూ ఉంటుంది. ఇది అరుదైన సమస్యే అయినా, సాధారణంగా 30 నుంచి 60 ఏళ్ల వయస్కుల్లో బయటపడుతూ ఉంటుంది. ప్రారంభంలో దీన్ని అసిడిటీగా, జీర్ణ సంబంధ సమస్యగా పొరబడి రెండు, మూడేళ్ల పాటు అసలు సమస్యను గుర్తించడంలో ఆలస్యం చేస్తూ ఉంటారు. కానీ వీలైనంత త్వరగా గుర్తుపట్టగలిగితే సమస్యను సమర్థమైన చికిత్సతో అదుపులోకి తెచ్చుకోగలిగే వీలుంటుంది.

ఈ పరీక్ష కీలకం

ప్రారంభంలోనే గుర్తించగలిగితే ఎండోస్కోపీ ద్వారా పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పిఒఇఎమ్) ద్వారా చురుగ్గా ఉన్న స్పింక్టర్ కండరాన్ని కత్తిరించి, రిలాక్స్ చేయడం జరుగుతుంది. పూర్వం ఈ సమస్యను సర్జరీతో సరిదిద్దేవారు. కానీ ప్రస్తుతం ఎండోస్కోపీ ద్వారానే సమస్యను శాశ్వతంగా సరిదిద్దడం సాధ్యపడుతోంది. సాధారణంగా ఎండోస్కోపీతోనే గొంతు, అన్నవాహిక సమస్యలన్నీ తెలిసిపోతాయి అనుకుంటారు. కానీ ఈసోఫేజియల్ మ్యానోమెట్రీ అనే పరీక్షతో అన్నవాహికలోని కండరాల పనితీరును స్పష్టంగా, కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ పరీక్షతో అకలేసియా కార్డియాతో పాటు అన్నవాహిక కండరాల కదలికల సమస్యలన్నిటినీ కనిపెట్టవచ్చు.



వాళ్లలో కూడా ఇవే లక్షణాలు

కొందరు పిల్లలు ఎంతసేపు నములుతూ ఉంటారే తప్ప నోట్లో పెట్టుకున్న ముద్దను మింగలేరు. ఇది జన్యుపరమైన డెవలప్‌మెంటల్ అబ్నార్మాలిటీ. పుట్టుకతోనే అన్నవాహికలో, స్పింక్టర్‌లో లోపాలే ఈ లక్షణాలకు కారణం. కానీ ఈ సమస్యకూ అకలేసియా కార్డియాకు సంబంధం ఉండదు. అలాగే కొందర్లో అన్నవాహికలో అల్సర్లు ఉండి, పదార్థాలను మింగలేక ఇబ్బంది పడుతూ ఉంటారు. అకలేసియా సమస్యను మరిపించే ఇంకొన్ని ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- **ఓరోఫారింజియల్ డిస్ఫాజియా:** బ్రెయిన్ స్ట్రోక్, పార్కిన్సన్స్ వ్యాధుల మూలంగా గొంతు, నోట్లో సమస్యలు తలెత్తి, మింగడానికి గొంతు సహకరించకపోవచ్చు.
- **ఈసోఫేజియల్ డిస్ఫాజియా:** గొంతులో లేదా ఛాతీలో ఆహారం ఇరుక్కుపోయినట్టు అనిపించడం. గ్యాస్ట్రోఈసోఫీగల్ రిఫ్లక్స్ డిసీజ్, స్ట్రిక్చర్స్ లేదా మొటిలిటీ డిజార్డర్ మూలంగా ఈ సమస్య తలెత్తవచ్చు

డిస్ఫాజియా కారణాలు ఇవే!

మింగడంలో ఇబ్బందిని డిస్ఫాజియా అంటారు. అందుకు భిన్నమైన కారణాలుంటాయి. అయితే ప్రతి కారణాన్నీ అకలేసియా కార్డియాగా ముడిపెట్టకూడదు. అలా జరగకుండా ఉండాలంటే డిస్ఫాజియాకు దారితీసే ఇతరత్రా సమస్యల పట్ల కూడా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. అవేంటంటే...

- **న్యూరలాజికల్ డిజార్డర్స్:** స్ట్రోక్, మల్టిపుల్ స్క్లెరోసిస్ లేదా అమయోట్రోఫిక్ స్క్లెరోసిస్‌ల మూలంగా మింగడానికి తోడ్పడే కండరాల్లో లోపాలు ఏర్పడడం
- **స్ట్రక్చరల్ ప్రాబ్లెమ్స్:** ట్యూమర్లు, ఈసోఫీగల్ స్ట్రిక్చర్స్ లేదా అన్నవాహికలో వంపు ఉండడం, అన్నవాహిక ఇరుకుగా ఉండడం వల్ల మింగడంలో ఇబ్బందులు ఉండవచ్చు
- **జిఇఆర్‌డి:** గ్యాస్ట్రోఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్‌లో తీవ్రమైన యాసిడ్ రిఫ్లక్స్ వల్ల అన్నవాహిక ఇరుకుగా మారిపోయి, డిస్ఫాజియా ఏర్పడవచ్చు.
- ఇతరత్రా డిస్ఫాజియా సమస్యలను మెత్తని, ద్రవరూప ఆహారంతో సరిదిద్దుకోవచ్చు. అలాగే స్వాలోవింగ్ థెరపీతో అన్నవాహిక కండరాల పనితీరును మెరుగపరచడం ద్వారా చక్కదిద్దుకోవచ్చు. కొన్ని మందులు కూడా ఉపయోగపడతాయి. పుట్టుకతోనే అన్నవాహికలో లోపాలుంటే వాటిని సర్జరీతో సరిదిద్దుకోవచ్చు.
- డిస్ఫాజియా, అకలేసియా కార్డియా... అన్నవాహికకకు సంబంధించిన ఈ రెండు సమస్యలూ ఒకే రకమైన లక్షణాలనే కలిగి ఉన్నప్పటికీ వాటి కారణాలు, చికిత్సా వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి సమస్యను ప్రారంభంలోనే గుర్తించి తగిన చికిత్సను ఎంచుకోగలిగితే పోషకాహారలోపం, ఆస్పిరేషన్ న్యుమోనియా లాంటి సమస్యలను ముందుగానే అడ్డుకోవచ్చు. డిస్ఫాజియాతో బాధపడేవారు మూల కారణాన్ని కనిపెట్టడం కీలకమైతే, అకలేసియా కార్డియా సమస్య కలిగిన వారు, సరైన, సమర్థమైన చికిత్సా విధానంతో లోయర్ ఈసోఫీగల్ స్రింక్టర్‌లో లోపాన్ని చక్కదిద్దుకోవడం అవసరం.

చికిత్స సులభమే

- **న్యుమాటిక్ డైలేషన్:** ఒక బెలూన్‌ను దగ్గరకు పంపించి లోయర్ ఈసోఫీగల్ స్పింక్టర్ వ్యాకోచింపచేయడం ద్వారా అన్నవాహికలోని ఆహారం తేలికగా పొట్టలోకి చేరుకోగలిగే వీలు కల్పించవచ్చు
- **పెరోరల్ ఎండోస్కోపిక్ మయోటమీ:** లోయర్ ఈసోఫీగల్ స్పింక్టర్ కండరాలను కత్తిరించి అవరోధాన్ని తొలగించవచ్చు
- **బోట్యులినమ్ టాక్సిన్ (బొటాక్స్):** లోయర్ ఈసోఫీగల్ స్పింక్టర్‌ను తాత్కాలికంగా బలహీనపరచవచ్చు. ఈ చికిత్స ఎక్కువ సార్లు అవసరం పడవచ్చు.
- **మందులు:** క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్ లేదా నైట్రేట్స్ లోయర్ ఈసోఫీగల్ స్పింక్టర్‌ను రిలాక్స్ చేస్తాయి. అయితే ఇవి సర్జరీతో సమానమైన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు



డాక్టర్ సోమశేఖర రావు,
సీనియర్ కన్సల్టెంట్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్‌సిటీ,
హైదరాబాద్.

గుడ్ హెల్త్

ఉపవాసం పరమౌషథం!

కాలుష్యాలతో నిండిన వాతావరణంలో శరీరం నుంచి కలుషితాలు, విషాలను వెళ్లగొట్టడానికి మెరుగైన మార్గం ఉపవాసం పాటించడం. ఆధునిక యుగంలోని మనమంతా ఉదయం తీసుకునే అల్పాహారమే రోజంతటిలో అత్యంత ముఖ్యమైన ఆహారమని అనుకుంటాం. కానీ మధ్యాహ్న భోజనానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలని వైద్యులు అంటున్నారు. మధ్యాహ్న సమయానికి జీర్ణ అగ్ని ఎక్కువ శక్తిమంతంగా ఉంటుంది. కాబట్టి మధ్యాహ్న భోజనం భారీగా ఉండాలి. కాబట్టి రోజంతా భోజనం మానేసి, ఉపవాసం ఉండే బదులు అడపా దడపా ఉపవాసం ఉండడం వల్ల ఫలితం ఉంటుంది. ఏదో ఒక పూట ఉపవాసం ఉండడం కాకుండా, చివరి భోజనానికి, తదుపరి భోజనానికీ మధ్య 14 నుంచి 18 గంటల విరామం ఉండాలి. ప్రతి రోజూ రెండు భోజనాలకు మధ్య కనీసం 16 గంటల విరామం ఇస్తే, శక్తి స్థాయిలు పెరుగడం స్పష్టంగా అనుభవంలోకి వస్తుంది. ఉదయం తీసుకునే టీ, కాఫీలో రెండు చెంచాల పాలు కలుపుకుని చక్కెర లేకుండా తాగాలి. రాత్రి తింటే, తిరిగి మధ్యాహ్న భోజనమే చేయాలి. ఈ నియమం పాటిస్తే రాత్రి భోజనానికీ, మధ్యాహ్న భోజనానికీ మధ్య 14 నుంచి 18 గంటల విరామం దక్కుతుంది. ఈ ఉపవాసంతో అధిక బరువు తగ్గుతాం. మరీముఖ్యంగా పొట్ట చుట్టూ ఉండే కొవ్వు కరుగుతుంది. కణ మరమ్మత్తు జరుగుతుంది. టైప్ 2 మధుమేహానికి గురయ్యే వీలు ఉండదు. హార్మోన్ల అవకతవలు తగ్గుతాయి.



ఇన్‌ఫ్లమేషన్

ఆహారంతో ఆలోచించి..

కొన్ని ఆరోగ్య సమస్యలకు సమాధానం ఆహారంలోనే ఉంటుంది. మరీ ముఖ్యంగా ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలను ఆహారంతో మెరుగ్గా అదుపులోకి తెచ్చుకోవచ్చు.

నొప్పులు, వాపులు వ్యాధికి తొలి సూచనలు. కీళ్ల నొప్పులు (ఆర్థ్రయిటిస్), హృద్రోగ సమస్యలు, ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ (విరేచనాలు), మధుమేహం, కొన్ని రకాల కేన్సర్లలో కూడా ఇవే ప్రధాన లక్షణాలు. తింటున్న పదార్థాలు సరిపడకపోతే పేగుల్లో వాపు మొదలవుతుంది. ఈ సమస్యే ముమ్ముందు హార్మోన్ల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. కొంతమందికి చుబుకం మీద మొటిమలు తలెత్తుతాయి. ఇందుకు కారణం పాల ఉత్పత్తులు సరిపడకపోవడమే. ఇలాంటి ఇన్‌ఫ్లమేషన్‌కు కలిగించే పదార్థాల్లో ప్రధానమైనవి... చక్కెర, ఎర్రని మాంసం, గ్లూటేన్. మాంసం, చక్కెరలు చర్మపు పిహెచ్ విలువలను మార్చేస్తాయి. అంతే కాదు, పెద్ద పేగుల్లోని ఉపయోగకరమైన బ్యాక్టీరియానూ మారుస్తాయి. పొట్టు తీయని, పాలిష్ పట్టించని ధాన్యాలు, సేంద్రీయ కూరగాయలు, పళ్లు, పసుపు, బ్రక్కొలి, నిమ్మ ఎక్కువగా తినగలిగితే ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది. మద్యపానం, ధూమపానం, తీపిపదార్థాలు ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. ఉపవాసంతో కూడా ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది. కంటి నిద్ర కూడా కీలకమే!



మీకు తెలుసా?

చిట్టి చిట్కాలు

ఒత్తిడి వేధిస్తుంటే, యాలకులు నమలడం లేదా వాటితో టీ తయారుచేసుకుని తాగడం చేయాలి. ఇలా చేస్తే, మెదడులోని హార్మోన్ల విడుదల సమమై ఒత్తిడి అదుపులోకొస్తుంది.

- 8 బాదం పప్పులను రాత్రంతా నానబెట్టి మరుసటి ఉదయం తోలు తీసి మెత్తగా పేస్ట్‌లా తయారు చేసి, ఆ ముద్దను పాలల్లో కలుపుకుని తాగాలి. లో బిపితో బాధపడేవారికి ఇది చక్కని విరుగుడుగా పని చేస్తుంది.
- రాత్రి నిద్రకు 3 నుంచి 4 గంటల ముందు వరకూ పొట్టను ఖాళీగా ఉంచుకుంటే, గ్రోత్ హార్మోన్ వృద్ధి అవుతుంది. కొవ్వు కరుగుతుంది. పొట్ట చదును అవుతుంది. కంటి నిండా నిద్ర పడుతుంది.
- నిద్ర పట్టకపోతే మెగ్నీషియం తగ్గిందని అర్థం. కాబట్టి మెగ్నీషియం ఎక్కువగా ఉండే పాలకూర, అవకాడోలు తినాలి.
- ఉదయం నిద్రలేవగానే అలసటగా ఉంటే పొటాషియం లోపం ఉందని అర్థం. అరటి పండు, కొబ్బరినీళ్లు ఈ సమస్యకు విరుగుడు.
- తలనొప్పి తరచూ వేధిస్తుంటే, సోడియం లోపంగా భావించవచ్చు. కీర దోస రసం సోడియం లోపాన్ని భర్తీ చేస్తుంది.
- పచ్చ అరటిలో రెసిస్టెంట్ స్టార్చ్ సమృద్ధిగా ఉంటుంది. ఈ స్టార్చ్ రక్తంలో చక్కెర మోతాదు, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను నియంత్రిస్తుంది. పేగుల్లోని మంచి బ్యాక్టీరియాకు కూడా స్టార్చ్ ఆహారంగా ఉపయోగపడుతుంది.



- గుమ్మడి విత్తనాలను దంచినప్పుడు టెట్రాసైక్లిక్ ట్రైటెర్పీన్స్ అనే కాంపౌండ్లు విడుదలవుతాయి. ఇవి శరీరంలోని పరాన్నజీవులను విసర్జించడానికి సహాయపడతాయి.
- రోజుకు మూడు ఖర్జూరాలు తింటే, జీర్ణశక్తి పెరిగి, శక్తి నిల్వలు వృద్ధి అవుతాయి. మెదడు చురుగ్గా మారుతుంది. ఎముకలు బలపడతాయి..

అవేర్‌నెస్

ఇలా బరువు బలాదూర్



అవసరానికి మించిన క్యాలరీలతో పాటు, అస్తవ్యస్థ హార్మోన్లు శరీర బరువును పెంచుతాయి. కాబట్టి తినే ఆహారంతో పాటు, వేధించే ఆరోగ్య సమస్యలను కూడా అదుపులో పెట్టుకోవాలి.

చక్కెర ఎంత తీయగా ఉంటుందో శరీరానికి అంత చేటు చేస్తుంది. చక్కెర పేగుల్లోని చెడు బ్యాక్టీరియాకు ఆహారంగా ఉపయోగపడుతుంది. శరీరంలో నొప్పితో కూడిన వాపులు (ఇన్‌ఫ్లమేషన్), సోరియాసిస్, మొటిమలు, ఎగ్జిమా, చర్మం సాగిపోవడం లాంటి చర్మ సంబంధ సమస్యలకు కూడా కారణమవుతుంది. చర్మం అడుగున ఉండే కొల్లాజెన్ ఆకారం మారిపోయి చర్మం సాగే గుణం కోల్పోయి, బిగుసుకుంటుంది. కాబట్టి తీపి కోసం చక్కెర బదులు పళ్లు తినాలి. పళ్లు సహజసిద్ధ ప్రత్యామ్నాయాలు. తెల్లని చక్కెర, బ్రౌన్ షుగర్, సుక్రలోజ్, మేపుల్ షుగర్, మొలాసిస్, తేనెలు మానేయాలి. చక్కెరలా తీయగా తినాలనుకుంటే 'స్టీవియా' ఎంచుకోవచ్చు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెద్దగా పెరగనివ్వదు.

- **ఇవి మానేయాలి:** సరళమైన పిండిపదార్థాలు అతి త్వరగా సింపుల్ షుగర్స్‌గా మారిపోతాయి. ఇలా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోకుండా ఉండాలంటే క్లిష్టమైన పిండిపదార్థాలు తినాలి. ఇవి చక్కెరగా మారే వేగం తక్కువ. కాబట్టి రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. చిలకడదుంపలు, గుమ్మడి, క్వినోవా లాంటి, ఇన్సులిన్ పెరగకుండా ఉంచే నెమ్మదైన పిండిపదార్థాలనే ఎంచుకోవాలి.

హార్మోన్ల అసమతౌల్యాలు

గ్లూటేన్, ధాన్యాలు, పాల ఉత్పత్తులు... ప్రధానమైన హార్మోన్ అసమతౌల్యాల కారకాలు. శరీరంలో అసమతౌల్యానికి లోనవుతున్న ప్రధానమైన హార్మోన్లు, ఆ హార్మోన్ల వ్యవహారశైలికి కారణమైన రుగ్మతలు కొన్ని ఉన్నాయి. అవేంటంటే....

- **ప్రొలాక్టిన్:** ఈ హార్మోన్ అసమతౌల్యానికి గురవడానికి కారణాలు... ఈటింగ్ డిజార్డర్లు, థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గడం, కాలేయం పనితీరు అస్తవ్యస్థమవడం, పిట్యుటరీ గ్రంథిలో 'ప్రొలాక్టినోమా' అనే కణితి (ఫలితంగా అత్యధికంగా ప్రొలాక్టిన్ విడుదలవుతుంది). లక్షణాలను బట్టి వైద్యులను కలిసి చికిత్స తీసుకుని, ఈ హార్మోన్ స్రావాన్ని సరిచేసుకోవాలి.
- **ఎండోమెట్రియోసిస్:** ప్రొజెస్టరాన్ హార్మోన్ తగ్గుదల కారణంగా ఎండోమెట్రియోసిస్ వచ్చే వీలుంది. ఇందుకోసం ఈస్ట్రోజన్ హార్మోన్ ఒరవడిని తగ్గించే మందులు వాడి పరిస్థితిని అదుపు చేసుకోవచ్చు.
- **పిసిఒ, పిసిఒడి:** చక్కెరకు ఫుల్‌స్టాప్ పెట్టి, పీచును పెంచి, అత్యల్ప గ్లైసెమిక్ ఆహారం తీసుకుంటూ, అత్యధిక మాంసకృత్తులు, ఒమేగా 3 కొవ్వులు తీసుకోవాలి. దాంతో బరువు తగ్గుతారు. బరువు తగ్గడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్, అత్యధిక యాండ్రోజెన్స్ సమస్య తగ్గుతుంది. ఫలితంగా పిసిఒ, పిసిఒడి సమస్యలు అదుపులోకి వస్తాయి. ఇదంతా క్రమం తప్పకుండా రోజుకు 20 నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల సాధించవచ్చు.

థైరాయిడ్ ఇబ్బందులు

పర్యావరణంలోని కాలుష్యాలు, విషాల ప్రభావం వల్ల థైరాయిడ్ గ్రంథి పనితీరు అస్తవ్యస్థమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. వాయు కాలుష్యం, సబ్బుల్లో ఉండే రసాయనాలు, ఆహారం నిల్వ కోసం ఉపయోగించే ప్రిజర్వేటివ్స్ థైరాయిడ్ గ్రంథిని దెబ్బతీస్తాయి. దాంతో భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులతో పాటు, శరీర బరువూ పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య వంశపారంపర్యంగా సంక్రమిస్తుందనీ, జన్యుపరంగా సంక్రమిస్తుందనీ అనుకుంటే అది అపోహ మాత్రమే! కొత్త కార్లు, కొత్త ఫర్నిచర్ తగలబడకుండా అడ్డు పడటానికి వాటి తయారీలో వాడే రసాయనాలు, ఆహారం నిల్వ కోసం వాడే ప్రిజర్వేటివ్స్ థైరాయిడ్ గ్రంథి మీద ప్రభావం చూపిస్తాయి.

మానసిక ఒత్తిడి కారణంగా థైరాయిడ్ పనితీరు దెబ్బతింటే నిస్సత్తువ, కుంగుబాటు ఆవరిస్తాయి. థైరాయిడ్ స్రావం తగ్గితే బద్ధకం, నీరసం, బరువు పెరగడం జరుగుతుంది. స్రావం పెరిగితే పొడి చర్మం, బరువు తగ్గడం, ఆందోళన లక్షణాలు కనిపిస్తాయి.

- **న్యూట్రియెంట్ థెరపీ:** కొన్ని ఖనిజలవణాలు థైరాయిడ్ గ్రంథి పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. రాగి, జింక్, సెలీనియం, అయొడిన్‌లను నిర్దిష్ట పరిమాణల్లో అందిస్తూ చికిత్స చేస్తే థైరాయిడ్ సమస్య అదుపులోకి వస్తుంది. రాగి, జింక్‌ల పరిమాణాలు ఎంతో కచ్చితంగా ఉండాలి. లేదంటే హైపోథైరాయిడ్ తలెత్తుతుంది. అలాగే థైరాయిడ్ గ్రంథి సక్రమమైన పనితీరుకు విటమిన్ ఎ కూడా అవసరమే!

శుద్ధి వద్దు

ఆహారానికి శుచి, రుచి ఉండాలి. కానీ అదే శుద్ధి చేసిన ఆహారాన్ని ప్యాకెట్లలో తినడం సరికాదు. ఇలాంటి ప్రాసెస్‌డ్ ఫుడ్‌లో నిల్వ రసాయనాలు, కృత్రిమ రంగులు, రుచులు జోడించి ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ మొత్తాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్, ఉప్పు, చక్కెరలూ ఉంటాయి. కాబట్టి ప్యాకెట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వీటిలో ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యే పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని మరింత సున్నితంగా మార్చేసి, పలు రకాల అలర్జీలకు తేలికగా గురయ్యేలా చేస్తాయి. గ్లూటేన్ లేని ప్యాకెట్ ఫుడ్స్ కూడా విపరీతంగా శుద్ధి చేయబడి, పీచు లేని పిండి కలిగి ఉంటాయి. ఇవన్నీ విషంతో సమానం. గ్లూటేన్ లేని పదార్థాలు తినాలనకుంటే పాలిష్ పట్టని గోధుమలు, బియ్యం, శిరి ధాన్యాలు, క్వినోవా తినాలి. ప్యాకెట్లలో దొరికే చిప్స్, కేక్స్ మానేయాలి. వీటితో పాటు ప్యాకెట్లు, ప్లాస్టిక్ డబ్బాలలో దొరికే శుద్ధి చేసిన నూనెలు (పొద్దుతిరుగుడు, వేరుసెనగ) కూడా మానేయాలి. ఇవన్నీ ఫ్రక్టోజ్, సుక్రోజ్, డెక్స్‌ట్రోజ్ చక్కెరల్లా, హార్మోన్ల పనితీరును దెబ్బతీసి స్థూలకాయులుగా మారుస్తాయి.

లవణం మరణం

ఉప్పు ఆహారంలో అత్యవసరం. ఆహారానికి రుచిని అందించడంతో పాటు నాడుల మధ్య ప్రసారాలు జరగడానికి, రక్తంలో చక్కెర స్థాయిలు సమంగా ఉండడానికీ, హార్మోన్ల స్రావాలు క్రమం అవడానికీ ఉప్పు అవసరమే! అయితే ఆ అవసరాలకు మించి ఉప్పు తీసుకుంటూ ఉంటాం. అది అనర్థాలను తెచ్చి పెడుతోంది. నిజానికి వైద్యులు రోజుకు 6 గ్రాముల ఉప్పునే తీసుకోమని సూచిస్తున్నారు. ఇది ఒక చెంచా కంటే తక్కువ. రోజుకు 13 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకునేవారు 6.8 గ్రాముల ఉప్పు తీసుకునే వారి కంటే ఎక్కువగా గుండె సమస్యల బారిన పడే ప్రమాదం ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యకరమైన ఉప్పు: లవణాల్లో 'హిమాలయన్ పింక్ సాల్ట్' అనే లేత గులాబీ రంగు ఉప్పు మేలైనది. దీన్లో 84 రకాల ఖనిజ లవణాలు ఉంటాయి. అలాగే సముద్రపు ఉప్పులోనూ ఇన్సులిన్ హార్మోన్‌ను సమంగా ఉంచే శక్తి ఉంటుంది. ఈ సముద్రపు ఉప్పు కంటే నల్ల ఉప్పు మరింత మేలు. దీన్లో ఉండే కలుషితాల కారణంగా ఈ ఉప్పుకు నల్ల రంగు వస్తుంది. కాబట్టి భయపడవలసిన పని లేదు.



షార్క్ దాడిలో కాలు పోగొట్టుకొన్నా..!

పారిస్: షార్క్ దాడిలో కాలు కోల్పోయిన అమెరికా స్విమ్మర్ అలీ ట్రూవిట్ పారిస్ పారాలింపిక్స్‌లో సత్తాచాటేందుకు సిద్ధమైంది. 100 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీస్టైల్‌తోపాటు 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పారిస్ క్రీడలకు ట్రూవిట్ అర్హత సాధించింది. గతేడాది మే 24న సముద్రంలో ఈత కొడుతుండగా.. షార్క్ చేప భయానక దాడిలో ఆమె త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. కానీ, తీవ్ర గాయాలవడంతో ఎడమ మోకాలి కింది భాగాన్ని కోల్పోవాల్సి వచ్చింది. క్రమంగా కోలుకొన్న ట్రూవిట్ మళ్లీ ప్రాక్టీస్ చేసి పారాలింపిక్స్‌కు క్వాలిఫై అయింది. తనలాంటి వారిలో మనోధైర్యం నింపడం కోసం ఓ స్వచ్ఛంద సంస్థను కూడా ఏర్పాటు చేసింది.

జూ.క్రికెట్‌లో ప్రైజ్‌మనీ

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌కు సంబంధించి బీసీసీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మహిళలు, జూనియర్ క్రికెట్ పోటీలలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపాడు. ఈమేరకు విజయ్ మర్చంట్, కూచ్ బిహార్, సీకే నాయుడు టోర్నీల్లో ఆడే క్రికెటర్లకు లబ్ధి చేకూరనుంది.

జ్వెరెవ్, స్విటోలినా శుభారంభం
సక్కారి, థీమ్ అవుట్
యూఎస్ ఓపెన్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్, కసట్‌కినా, స్విటోలినా శుభారంభం చేయగా.. 9వ సీడ్ మరియా సక్కారి తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. సోమవారం జరిగిన మొదటి రౌండ్‌లో ఏడో సీడ్ క్విన్వెన్ జాంగ్ (చైనా) 4-6, 6-4, 6-2తో అనిసిమోవా (అమెరికా)పై, 12వ సీడ్ దారియ కసట్‌కినా (రష్యా) 6-2, 6-4తో జాక్వెలిన్ (రొమేనియా)పై, 24వ సీడ్ డోనా వెకిక్ (క్రొయేషియా) 6-4, 6-4తో కింబర్లీ బిరెల్ (ఆస్ట్రేలియా)పై, ఎరికా ఆండ్రీవ 6-3, 7-6(7)తో యు యువాన్‌పై, ఉక్రెయిన్ భామ స్విటోలినా 3-6, 6-3, 6-4తో మారియా కరిపై గెలిచి ముందంజ వేశారు. కాగా, 2-6తో తొలి సెట్‌ను కోల్పోయిన 9వ సీడ్ మరియా సక్కారి.. ప్రత్యర్థి వాంగ్ యఫాన్‌కు వాకోవర్ ఇచ్చింది. పురుషుల సింగిల్స్‌లో 4వ సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 6-7(5), 6-3, 6-2తో మాక్సిమిలన్‌ను, ఫ్రాన్స్ ఆటగాడు యుగో హంబర్ట్ 6-3, 6-4, 6-4తో థియాగో (బ్రెజిల్)ను ఓడించారు. అయితే, డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 4-6, 2-6, 2-6తో బెన్ షెల్టన్ (అమెరికా) చేతిలో కంగుతిన్నాడు.

వైకల్యం వెక్కిరించినా కుంగిపోకుండా.. కాలం నేర్పిన గుణపాఠాలను సవాల్‌గా తీసుకొని.. అవరోధాలను అనుకూలంగా మార్చుకున్న పోరాట యోధులు వీళ్లు. ప్రోత్సాహం అంతగా లేకున్నా, అందుబాటులో ఉన్న వనరులను అందిపుచ్చుకొని తమ క్రీడల్లో సత్తా చాటిన విజేతలు వీళ్లు. ఇప్పుడదే ఆటల్లో దేశం తరఫున పారాలింపిక్స్‌లో పతకాలు సాధించేందుకు సిద్ధమయ్యారు మన క్రీడాకారులు. పారిస్‌లో పోడియంపై నిల్చొని, జాతీయ పతాకాన్ని రెపరెపలాడించగలరన్న అంచనాలున్న ఈ తెలుగు వెలుగులపై ఓ లుక్కేద్దాం.

పారిస్‌లో తెలుగు యోధులు

రేపటి నుంచే పారాలింపిక్స్



గౌరవం కోసం పోరాటం

అనకాపల్లి కె. కోటపాడుకు చెందిన షాట్‌పుట్ క్రీడాకారుడు రొంగలి రవి పుట్టుకతోనే మరుగుజ్జు. తన ఎత్తును చూసి మిత్రులతో పాటు చుట్టుపక్కల వాళ్లు గేలిచేసినా ఏనాడూ కుంగిపోలేదు. తాను ఏదైనా సాధిస్తే, ఇవాళ వెక్కిరించిన వాళ్లే రేపు గౌరవిస్తారని చిన్నతనంలోనే దృఢంగా నిశ్చయించుకున్న రవి.. చదువుతో పాటు ఆటల్లోనూ తనదైన ప్రతిభ చూపేవాడు. చిన్నప్పుడు ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి చదువుకునేటప్పుడే తనకిష్టమైన షాట్‌పుట్ క్రీడను కెరీర్‌గా ఎంచుకున్నాడు. అనతికాలంలోనే అందులో రాటుదేలిన రవి.. ఈ ఏడాది పారిస్ క్రీడలకు ఎంపికై పారాలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత షాట్‌పుట్ క్రీడాకారునిగా రికార్డు సృష్టించాడు. తన ఈవెంట్‌లో ప్రస్తుతం ప్రపంచ ఐదో ర్యాంకర్‌గా కొనసాగుతున్న రవి.. నిరుడు పారా ఆసియా క్రీడల్లో రజతం నెగ్గి అదరగొట్టాడు. బెంగళూరు సాయ్ కేంద్రంలో శిక్షణ తీసుకొన్న రవి.. ఇప్పుడు పారాలింపిక్స్‌లో ఏకంగా స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాడు.



రిసెప్షనిస్టుగా మొదలై...

నంద్యాలకు చెందిన సైక్లిస్ట్ షేక్ అర్షద్ మొదట తైక్వాండో క్రీడాకారుడు. అయితే, పన్నెండేళ్ల వయసులో ఉన్నప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమకాలిని మోకాలి దాకా కోల్పోయాడు. అయినా, ఓవైపు చదువు కొనసాగిస్తూనే, పారా క్రీడలపై దృష్టి సారించాడు. వైద్యుడు రవికృష్ణ ప్రోత్సాహంతో ఆర్చరీ, పర్వతారోహణ, ట్రయాథ్లాన్ లాంటి ఈవెంట్లలో జాతీయస్థాయిలో రాణించి పతకాలు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో కొన్నాళ్లు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేశాడు. అనంతరం ఆదిత్య మెహతా ఫౌండేషన్ సహకారంతో సైక్లింగ్ క్రీడను కెరీర్‌గా ఎంచుకొన్న అర్షద్.. ఇప్పటిదాకా నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పాల్గొని స్వర్ణ పతకాలు సాధించాడు. సైక్లింగ్‌లో పారాలింపిక్స్‌కు ఎంపికైన తొలి భారత ఆటగాడిగా నిలిచిన 31 ఏళ్ల అర్షద్.. పారిస్ క్రీడల్లో పతకం నెగ్గాలన్న కసితో గతనెలలో లద్దాఖ్‌లో అత్యంత కఠినమైన హై ఆల్టిట్యూడ్ శిక్షణ తీసుకున్నాడు. పారాలింపిక్స్ సైక్లింగ్‌లో నాలుగు విభాగాల్లో పోటీపడుతున్న అర్షద్.. కచ్చితంగా పతకంతో తిరిగొస్తానని చెబుతున్నాడు.

పేదరికం నుంచి..



వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తికి పుట్టుకతోనే మానసిక వైకల్యం. బంధువులు, ఇరుగు పొరుగు వారి నుంచి హేళనలు. వీటికి తోడు పేదరికం. అయినా, అన్ని అడ్డంకులను అధిగమించి పరుగునే ఊపిరిగా చేసుకుంది. అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగింది. అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ శిక్షణలో రాటుదేలింది. కెరీర్ ఆరంభంలో కూతురి వైద్యం, శిక్షణ కోసం తమకున్న ఎకరం భూమిని అమ్మిన దీప్తి తల్లిదండ్రులు.. ఆమెకు వెన్నుదన్నుగా నిలిచారు. గతేడాది పారా ఆసియా క్రీడల్లో రికార్డు ప్రదర్శనతో పసిడి నెగ్గిన దీప్తి.. పారా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఇప్పుడు పారాలింపిక్స్‌లో పతకం నెగ్గాలన్న పట్టుదలతో పారిస్‌లో అడుగుపెట్టింది. 400 మీటర్ల టీ20 రేసులో పోటీపడుతున్న దీప్తికి పతకం గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఆర్మీ విధుల్లో కాలు పోయినా..



కబడ్డీ ప్లేయర్‌గా జూనియర్ విభాగంలో జాతీయ స్థాయిలో రాణించిన నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కొంగనపల్లి నారాయణ.. దేశానికి సేవ చేయాలన్న లక్ష్యంతో 17 ఏళ్ల వయసులో ఆర్మీలో చేరాడు. జమ్మూలోని ఎల్‌ఓసీ వద్ద విధులు నిర్వర్తిస్తుండగా మందుపాతర పేలి ఒక కాలు పోగొట్టుకున్నాడు. మానసికంగా, శారీరకంగా తీవ్రంగా కుంగిపోయిన దశలో కల్నల్ గౌరవ్ దత్‌తో ఏర్పడిన పరిచయం నారాయణ జీవితాన్ని మార్చేసింది. పుణె వెళ్లి కృత్రిమ కాలు అమర్చుకున్న నారాయణ.. గౌరవ్ సహకారంతో పారా క్రీడలను కెరీర్‌గా ఎంచుకున్నాడు. మొదట జావెలిన్‌లో ప్రయత్నించినా.. పరిగెత్తడం కష్టమని భావించి ఆ తర్వాత రోయింగ్‌కు మారాడు. జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు నెగ్గిన అతడు.. గతేడాది పారా ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ స్కల్ రోయింగ్ విభాగంలో రాజస్థాన్‌కు చెందిన అనితతో కలిసి రజతం సాధించాడు. పారాలింపిక్స్‌లోనూ అనితతో కలిసి బరిలోకి దిగుతున్న నారాయణ.. పీఆర్ మిక్స్‌డ్-3 విభాగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

బీసీసీఐ కార్యదర్శిగా రోహన్ జైట్లీ?



న్యూఢిల్లీ: బీసీసీఐ కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్ష పదవికి పోటీపడడం దాదాపు ఖాయమైంది. ఈనేపథ్యంలో ఖాళీ అవనున్న బీసీసీఐ కార్యదర్శి పదవి ఎవరికి దక్కుతుందనే చర్చ మొదలైంది. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) అధ్యక్షుడు రోహన్ జైట్లీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ ప్రముఖ నేత, దివంగత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కుమారుడే రోహన్. డీడీసీఏ చీఫ్‌గా 14 ఏళ్లు బాధ్యతలు నిర్వర్తించిన అరుణ్ జైట్లీ.. బీసీసీఐ ఉపాధ్యక్షుడిగానూ వ్యవహరించారు.

అక్టోబరు 6న ఇండో-పాక్ పోరు

మహిళల టీ20 ప్రపంచకప్

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఐసీసీ సోమవారం ప్రకటించింది. యూఏఈ వేదికగా అక్టోబరు 3న టోర్నీ మొదలవనుంది. వాస్తవానికి టోర్నీ బంగ్లాదేశ్‌లో జరగాలి. కానీ, ఆ దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న కారణంగా టోర్నీ వేదికను యూఏఈకి తరలించారు. టోర్నీలోని మొత్తం 23 మ్యాచ్‌లకు దుబాయ్, షార్జాను వేదికలుగా నిర్ణయించారు. పది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. గ్రూపులో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. గ్రూప్-ఎ నుంచి భారత్, డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక ఉండగా.. గ్రూప్-బి నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ పోటీపడుతున్నాయి. భారత్ తొలి మ్యాచ్‌ను అక్టోబరు 4న న్యూజిలాండ్‌తో దుబాయ్‌లో ఆడనుంది. ఇక, టోర్నీకే హైలైట్‌గా నిలిచే భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అక్టోబరు 6న దుబాయ్‌లోనే జరగనుంది. ఆ తర్వాత 9న శ్రీలంకతో, 13న ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. అక్టోబరు 17, 18న దుబాయ్, షార్జా వేదికలుగా సెమీఫైనల్స్ జరుగుతాయి. అక్టోబరు 20న జరిగే ఫైనల్‌కు దుబాయ్ ఆతిథ్యమివ్వనుంది.

ప్రణయ్‌కు చికున్ గున్యా

న్యూఢిల్లీ: సీనియర్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ చికున్ గున్యా బారినపడ్డాడు. దాని నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో బ్యాడ్మింటన్ నుంచి విరామం తీసుకుంటున్నట్టు అతడు సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ప్రణయ్‌కు పారిస్ ఒలింపిక్స్‌కు ముందు చికున్ గున్యా సోకింది. అయినా విశ్వక్రీడల్లో పాల్గొన్నా.. ఆ వ్యాధి ప్రభావం ప్రణయ్ ప్రదర్శనపై బాగా పడింది.

పాక్, బంగ్లా పాయింట్లలో కోత

రావల్పిండి: తొలి టెస్ట్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లకు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్లలో కోత పడింది. నిర్ణీత సమయానికి ఆరు ఓవర్లు తక్కువగా వేయడంతో పాకిస్థాన్ 6 పాయింట్లు కోల్పోయింది. అలాగే జట్టు ఆటగాళ్లకు 30 శాతం చొప్పున జరిమానా విధించారు. ఇక బంగ్లాదేశ్ మూడు ఓవర్లు తక్కువగా వేయడంతో ఆ జట్టుకు 3 పాయింట్ల కోత పెట్టారు. 15 శాతం జరిమానా కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో పది వికెట్లతో ఓడిన పాకిస్థాన్.. తొమ్మిది జట్ల టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానానికి పడిపోయింది. బంగ్లాదేశ్ రెండు ర్యాంకులు ఎగబాకి ఆరో స్థానానికి చేరింది.

గృహాల ధరలు మరింత పైకి

ఐదేళ్లలో భారీగా పెరుగుదల ● బెంగళూరులో అత్యధికం ● రెండో స్థానంలో కోకాపేట : అనరాక్



న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో నివాస గృహాల ధర చుక్కలంటుతోంది. ఇళ్ల ధరల పెరుగుదలలో బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. గత ఐదేళ్ల (2019-24)లో బెంగళూరులోని బాగలూరులో చదరపు అడుగు (ఎస్ఎఫ్‌టీ) సగటు ధర ఏకంగా 90 శాతం పెరిగి రూ.8,151కి చేరింది. ఇదే సమయంలో బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 80 శాతం పెరిగి ప్రస్తుతం రూ.8,600 పలుకుతోంది. ఇక బెంగళూరుకే చెందిన సర్జాపూర్ రోడ్ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 58% పెరిగి రూ.9,300కు చేరింది. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ సోమవారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.

ఇతర నగరాల్లోనూ అదే పరిస్థితి

ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాంతంలో గత ఐదేళ్లలో నివాస గృహాల ధరలు చుక్కలంటాయి. 2019 డిసెంబరులో ఈ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర రూ.5,359 ఉండేది. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు అది 79 శాతం పెరిగి రూ.9,600కి చేరింది. గురుగ్రామ్ ప్రాంతంలోనూ గత ఐదేళ్లలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 48 శాతం పెరిగి రూ.9,000కు చేరింది.

కోకాపేట మరింత కాస్ట్‌లీ

ఇళ్ల ధరల పెరుగుదలలో హైదరాబాద్ కూడా బెంగళూరుతో పోటీపడుతోంది. హైదరాబాద్‌లోని కోకాపేట ప్రాంతంలో గత ఐదేళ్లలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 89 శాతం పెరిగి రూ.9,000కు చేరింది. నగరంలోని బాచుపల్లి ప్రాంతంలోనూ ప్రస్తుతం రియల్టీ జోరందుకుంది. ఇక్కడ గత ఐదేళ్లలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర 57 శాతం పెరిగి ప్రస్తుతం రూ.5,800 పలుకుతోంది. ఇక తెల్లాపూర్ ప్రాంతంలోనూ గత ఐదేళ్లలో నివాస గృహాల ధర సగటు 53 శాతం పెరిగి ప్రస్తుతం రూ.7,350 పలుకుతోంది.

ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పన్వేల్‌లోనూ గత ఐదేళ్లలో ఇళ్ల ధరలు చుక్కలంటాయి. 2019 డిసెంబరులో ఈ ప్రాంతంలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర రూ.5,520 ఉండగా ఈ ఏడాది జూన్ నాటికి అది 50 శాతం పెరిగి రూ.8,300కు చేరింది. ఇదే నగరంలోని డోంబివిల్ ప్రాంతలో ఎస్ఎఫ్‌టీ సగటు ధర గత ఐదేళ్లలో 40 శాతం పెరిగి రూ.9,300కు చేరింది.

కలిసొచ్చిన తొలి త్రైమాసికం

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం రియల్టీ మార్కెట్‌కు బాగా కలిసొచ్చింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 12 శాతం పెరిగాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో మాత్రం సగటున 30 శాతం పెరిగినట్టు రియల్టీ రంగానికి ప్రాతినిధ్యం వహించే క్రెడాయ్, కన్సల్టెన్సీ సంస్థలు కోలియర్స్, లియాసెస్ ఒక నివేదికలో తెలిపాయి. ఈ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇళ్ల ధరలు ఎస్ఎఫ్‌టీకి సగటున 6 శాతం పెరిగి రూ.20,275కు చేరాయి. ఇదే సమయంలో హైదరాబాద్‌లోనూ ఎస్ఎఫ్‌టీ సగటు ధర 7 శాతం పెరిగి రూ.11,290కి చేరింది.

రామ్ ఇన్ఫో నుంచి కిసాన్ డ్రోన్లు

టెక్నాలజీ సర్వీసులు అందించే రామ్ ఇన్ఫో రైతుల కోసం కిసాన్ డ్రోన్స్ పేరిట డ్రోన్ యాజ్ ఏ సర్వీస్‌ను ప్రారంభించింది. రాబోయే రెండేళ్లలో ఇలాంటివి 100 స్టోర్లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఫీల్డ్ మ్యాపింగ్, ఎరువులు చల్లడం సహా వ్యవసాయ క్షేత్రాల్లో విభిన్న కార్యకలాపాలకు విస్తృతంగా డ్రోన్లను ప్రవేశపెట్టనున్నట్టు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయదారులే కిసాన్ డ్రోన్ కార్యక్రమం లక్ష్యమని రామ్ ఇన్ఫో తెలిపింది.

నాస్కామ్ చైర్‌పర్సన్‌గా సింధు గంగాధరన్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) పరిశ్రమల సమాఖ్య నాస్కామ్ చైర్‌పర్సన్‌గా సాప్ లాబ్స్ ఇండియా ఎండీ సింధు గంగాధరన్ నియమితులయ్యారు. ఈమె నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని నాస్కామ్ తెలిపింది. ఇప్పటి వరకు నాస్కామ్ చైర్మన్‌గా వ్యవహరించిన రాజేశ్ నంబియార్ స్థానంలో సింధు నియమితులయ్యారు.

- మొక్కలను కీటకాల బెడద నుంచి కాపాడేందుకు గోద్రెజ్ ఆగ్రోవెట్ గ్రాసియా పేరుతో కీటకనాశిని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రాసియాలో ఉన్న పదార్థాన్ని పీల్చిన కీటకాలు పూర్తిగా నాశనమవుతాయి. గ్రాసియా.. మిరప, వరి రైతులు సహా నర్సరీ యజమానులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపింది.
- అమెజాన్ పే యూపీఐ ఖాతాదారుల సంఖ్య 10 కోట్ల మార్కును దాటింది. 2019లో యూపీఐ సేవలు ప్రారంభించిన నాటి నుంచి ఖాతాదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపింది. అమెజాన్ పే యూపీఐ వినియోగిస్తున్న వారిలో 18-24 ఏళ్ల మధ్య వయసు గల వారు అత్యధికంగా ఉన్నారని పేర్కొంది.

బ్యాంకు ఖాతా ఉంటేనే జీఎస్‌టీఆర్-1 ఫైలింగ్

సెప్టెంబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మోసాలను అరికట్టేందుకు జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) మరో కీలక చర్య తీసుకుంది. చలామణిలో ఉన్న బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేస్తేనే ఇక బయటికి పంపే సరుకులు/సేవల వివరాలతో కూడిన జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లను స్వీకరిస్తామని ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది. అంటే ఇక ఈ రిటర్న్ ఫైల్ చేసే వ్యాపారులు, సంస్థలు చలామణిలో ఉన్న తమ బ్యాంకు ఖాతా వివరాలను జీఎస్‌టీ పోర్టల్‌లో నమోదు చేయాలి. అప్పుడు మాత్రమే జీఎస్‌టీ పోర్టల్ జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌ను స్వీకరిస్తుంది. జీఎస్‌టీ రూల్ 10ఏ ప్రకారం జీఎస్‌టీ కింద నమోదైన సంస్థలు, వ్యక్తులు నెల రోజుల్లోగా తమ బ్యాంకు ఖాతా వివరాలు లేదా బయటికి పంపే వస్తు, సేవల వివరాలను జీఎస్‌టీఆర్-1 లేదా ఇన్వాయిస్ ఫర్నిషింగ్ ఫెసిలిటీ (ఐఎఫ్ఎఫ్) ద్వారా జీఎస్‌టీ నెట్‌వర్క్‌కు తెలియజేయాలి. గత ఏడాది జూలైలో జరిగిన జీఎస్‌టీ మండలి భేటీ కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. దీంతో ఈ నిబంధన అమలు ఈ ఏడాది ఆగస్టు రిటర్న్‌లతోనే ప్రారంభం కానుంది.

పేటీఎం చీఫ్‌కు సెబీ నోటీసులు

న్యూఢిల్లీ: పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ ఎండీ, సీఈఓ విజయ్ శేఖర్ శర్మకు సెబీ నోటీసులు జారీ చేసింది. కంపెనీ ప్రమోటర్లై ఉండి, ఇతర ఉద్యోగుల్లా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఈ-సాప్స్) కింద శర్మ 2.1 కోట్ల షేర్లను కేటాయించుకోవడంపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ నోటీసులు జారీ చేసింది. అయితే ఇది పాత విషయమేనని, దీనికి సంబంధించి రెగ్యులేటరీ సంస్థలు అన్నిటితో తాము చర్చలు జరుపుతున్నట్టు పేటీఎం తెలిపింది. ఈ వార్తలతో బీఎస్ఈలో కంపెనీ షేర్లు డీలా పడ్డాయి. ఒక దశలో 8.8 శాతం వరకు నష్టపోయి రూ.505.25 స్థాయిని తాకాయి. చివరికి 4.41 శాతం నష్టంతో రూ.530.05 వద్ద ముగిశాయి.

ఆఫర్ లెటర్స్ ఇచ్చిన అందరికీ కొలువులు పక్కా..

చేరే తేదీలు మాత్రమే మారుతాయ్..
ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్



న్యూఢిల్లీ: ఆఫర్ లెటర్స్ ఇచ్చిన ఫ్రెషర్స్ అందరినీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని, ఈ విషయంలో వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ ప్రకటించారు. ఆఫర్ లెటర్స్ ఉన్న 2022-23 బ్యాచ్‌కు చెందిన దాదాపు 2,000 మంది తాజా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను కంపెనీ ఇప్పటివరకు ఉద్యోగాల్లోకి తీసుకోకుండా ఆలస్యం చేస్తోంది. ఈ నేపథ్యంలో పరేఖ్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. వీరు ఉద్యోగాల్లో చేరే తేదీలు మాత్రమే మారుతాయే తప్ప.. వారందరినీ ఉద్యోగాల్లోకి తీసుకోవడం మాత్రం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. 'మా కంపెనీ నుంచి ఆఫర్ లెటర్స్ అందుకున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగాల్లో చేరతారు. కాకపోతే వారు ఉద్యోగాల్లో చేరే తేదీలు మాత్రమే మారుతాయి. అంతకు మించి మా వైఖరిలో ఎలాంటి మార్పు లేదు' అని పరేఖ్ తెలిపారు.

ఇదే కారణమా?

ఇటీవల ఐటీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే నాస్సెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (ఎన్ఐటీఈఎస్) దీనిపై కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ సీఈఓ వీరందరినీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని ప్రకటించడం విశేషం. ఈ సంవత్సరం కొత్తగా మరో 15,000 నుంచి 20,000 మంది ఫ్రెషర్స్‌ను ఉద్యోగాల్లోకి తీసుకుంటామని కంపెనీ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్‌కా ఇటీవల చెప్పారు. అయితే ఇది కంపెనీ వృద్ధి అవకాశాల అవసరాలను బట్టి ఉంటుందన్నారు.

దేశంలోనూ అద్భుత అవకాశాలు

కంపెనీ అభివృద్ధికి మన దేశంలోనే అద్భుత అవకాశాలు ఉన్నట్టు సలీల్ పరేఖ్ చెప్పారు. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నంత వేగంగా మరే పెద్ద ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం లేదన్నారు. డిజిటల్ ఇండియా పథకం కూడా ముందు ముందు కంపెనీ వ్యాపార అభివృద్ధికి అద్భుత అవకాశమన్నారు. ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ కోసం తాము అభివృద్ధి చేసిన పోర్టల్‌కు అద్భుతమైన స్పందన వస్తోందన్నారు.

మెడ్‌ప్లస్ హెల్త్‌కు వార్‌బర్గ్ గుడ్‌బై

హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌కు ప్రముఖ పీఈ సంస్థ వార్‌బర్గ్ పింకస్ గుడ్‌బై చెప్పింది. సోమవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా కంపెనీ ఈక్విటీలో తనకు ఉన్న 11.35 శాతం (1.35 కోట్ల షేర్లు) వాటాను రూ.836 కోట్లకు విక్రయించింది. మారిషస్ కేంద్రంగా పనిచేసే వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ లావెండర్ రోజ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ఈ షేర్లను విక్రయించింది. ఒక్కో షేరును రూ.616.48 చొప్పున విక్రయించింది. కాగా సింగపూర్ ప్రభుత్వం, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ ఈ షేర్లను కొనుగోలు చేశాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,000 ▼	66,900 ▼	92,800 ▼
ముంబై	72,042 ▲	65,991 ▲	86,191 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27 వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	95
కర్నూలు	109	నెల్లూరు	95
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

మార్కెట్లలో ఫెడ్ జోష్



బజార్ స్టైల్ షేరు ధర శ్రేణి రూ.370-389

త్వరలో ఇష్యూకి రానున్న వాల్యూ ఫ్యాషన్ రిటైలర్ బజార్ స్టైల్ రిటైల్ లిమిటెడ్ షేరు ధర శ్రేణిని కనిష్ఠంగా రూ.370, గరిష్ఠంగా రూ.389గా ప్రకటించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.835 కోట్లు సేకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ ఐపీఓ ఆగస్టు 30న (శుక్రవారం) ప్రారంభమై సెప్టెంబరు 3వ తేదీన (వచ్చే మంగళవారం) ముగుస్తుంది.

కొనసాగిన ర్యాలీ
సెన్సెక్స్ 612 పాయింట్లు అప్

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రారంభించనుందన్న ఆశలతో స్టాక్ మార్కెట్ ర్యాలీని కొనసాగించింది. మెటల్, ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడంతో సూచీలు పరుగులు తీశాయి. మార్కెట్లోకి విదేశీ నిధుల రాక తిరిగి ప్రారంభం కావడం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఆర్ఐఎల్ వంటి అగ్రగామి షేర్లలో కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. ఫలితంగా సెన్సెక్స్ 738.06 పాయింట్లు దూసుకుపోయి 81,824.27 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరికి 611.90 పాయింట్ల లాభంతో 81,698.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 187.45 పాయింట్ల లాభంతో 25,010.60 వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభపడడం వరుసగా ఇది ఐదో రోజు. కాగా నిఫ్టీకి వరుసగా ఎనిమిదో రోజు. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.66 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.20 శాతం లాభపడ్డాయి. టెలికమ్యూనికేషన్స్, సర్వీసెస్ సూచీలు మినహా మిగతా విభాగాల వారీ సూచీలన్నీ లాభాల్లో ముగిశాయి.

ఇంటరార్క్ లిస్టింగ్ జోరు: నిర్మాణ రంగానికి అవసరమైన ఉత్పత్తులందించే ఇంటరార్క్ బిల్డింగ్ ప్రొడక్ట్స్ షేరు లిస్టింగ్ రోజున 34 శాతం ప్రీమియంతో ముగిసింది. రూ.900 ధరతో ఈ కంపెనీ ఇష్యూకి రాగా బీఎస్ఈలో సోమవారం 43.46 శాతం ప్రీమియంతో రూ.1,291.20 వద్ద లిస్టింగ్ అయింది. ఇంట్రాడేలో రూ.1,316 స్థాయిని తాకిన ఈ షేరు చివరికి 32.93 శాతం లాభంతో రూ.1196.45 వద్ద పటిష్ఠంగా క్లోజైంది. ఎన్ఎస్ఈలో కూడా ఇదే ధోరణిలో ట్రేడయిన ఈ షేరు చివరికి 33.67 శాతం లాభంతో రూ.1203.10 వద్ద ముగిసింది.

మా ఆస్తులకు, మాకూ రక్షణ కల్పించండి

▸▸ 'జనవాణి'లో ఫిర్యాదు.. అర్జీలు తీసుకున్న జనసేన ఎమ్మెల్యే శ్రీనివాస్



జనవాణి కార్యక్రమంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : 'మా భూములు అన్యాక్రాంతమయ్యాయి.. గత ప్రభుత్వ పెద్దల అండతో మా నోటి దగ్గర కూడు తీసేశారు.. కొంతమంది అధికారులు ఇప్పటికీ దోపిడీదారులకే కొమ్ముకాస్తున్నారు.. మా గోడు వినండి, మాకు న్యాయం చేయండి' అంటూ పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి భూ వివాదాలపై లెక్కకు మించి ఫిర్యాదులు వచ్చాయి. ఆ పార్టీ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. 'గత ప్రభుత్వంలో మా నియోజకవర్గ పరిధిలో దేవదాయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటితో పాటు వాగులు, వంకలు ఆక్రమించి మామిడి తోటల సాగుచేపట్టారు. యధేచ్ఛగా మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. చివరికి మా భూములను కూడా తవ్వేస్తున్నారు. అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు' అని రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం మండలం జ్యోతినగర్‌కు చెందిన పి.వెంకట సుబ్బమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి అప్పటికప్పుడు సిద్ధవటం తహసీల్దార్‌తో మాట్లాడారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. భూమి అమ్మనని చెప్పినందుకు ప్రభుత్వ ప్రాజెక్టు పేరు చెప్పి 15 ఏళ్లుగా భూమి అమ్ముకోనివ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని విజయవాడ భవానీపురానికి చెందిన అర్జీ ఇచ్చారు. దీనిపైనా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన సాయికుమార్ అనే దివ్యాంగుడికి వైద్యం నిమిత్తం బొలిశెట్టి ఆర్థికసాయం చేశారు. సదరం సర్టిఫికెట్ కోసం గూడెం నుంచి వచ్చిన మరో వృద్ధ మహిళకు సాయమందించారు. పెదకాకానికి చెందిన పి.ధనలక్ష్మికి సొంత ఖర్చులతో మూడు చక్రాల సైకిల్ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీలోకి ఏలూరు మేయర్

▸▸ వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా



ఏలూరు నగర మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 26: ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో ఉండవల్లిలోని పార్టీ కార్యాలయంలో తెలుగుదేశంలో చేరనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు నూర్జహాన్, పెదబాబు పార్టీ అధినేత జగన్‌కు లేఖ పంపారు. ఏలూరు కార్పొరేషన్‌లో మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉండగా వీరిలో 3 టీడీపీ, 47 మంది వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందే ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ప్రస్తుతం మేయర్ దంపతులతోపాటు మరో 30 మందికిపైగా కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇదే జరిగితే పాలక మండలి టీడీపీ వశం కానుంది.

6 కొత్త పారిశ్రామిక పార్కులు!

▸▸ బాబు ఢిల్లీ వెళ్లి రాగానే రాష్ట్రానికి తీపికబురు

▸▸ ఈ వారంలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం?

▸▸ కేవలం ఏపీకే ఇస్తే విమర్శలు వస్తాయని బిహార్, పంజాబ్‌లోనూ మరో 6 పార్కులు

▸▸ లక్షన్నర కోట్ల పెట్టుబడులకు ఆస్కారం!

▸▸ ఇందులో సగం మన రాష్ట్రానికి వచ్చే చాన్సు!

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తూ ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. రాష్ట్రంలో ఆరు కొత్త పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించింది. చంద్రబాబు ఈ నెల 17, 18, 19వ తేదీల్లో ఢిల్లీలో పర్యటించి ప్రధాని మోదీ, కేంద్ర హోం, ఆర్థిక మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్ తదితరులను కలిసి వచ్చారు. ఆ వెంటనే రాష్ట్రంలో కొత్త పార్కుల ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి తీపి కబురు అందించింది. రూ.25 వేల కోట్లతో 3 రాష్ట్రాల్లో 12 కొత్త పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనుంది. వీటిలో సగం అంటే.. ఆరు పార్కులు మనకే ఇస్తున్నారు. మిగతా ఆరు బిహార్, పంజాబ్ రాష్ట్రాలకు ఇవ్వనున్నారు. ప్రత్యేకించి ఏపీలో మాత్రమే ఏర్పాటు చేస్తే రాజకీయంగా విమర్శలు వస్తాయన్న ఉద్దేశంతో పంజాబ్, బిహార్‌లకూ కేటాయించిందని పారిశ్రామిక నిపుణులు అంటున్నారు. ఈ 12 కొత్త పార్కులకు ఈ వారంలోనే కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపనున్నట్లు 'బిజినెస్ స్టాండర్డ్' పత్రిక కూడా వెల్లడించింది. కొత్త ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుతో రాష్ట్రాల్లో గణనీయమైన పారిశ్రామికాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. ఈ కొత్త పార్కుల్లో పారిశ్రామిక కార్యకలాపాల ద్వారా రూ.లక్షన్నర కోట్ల విలువ చేసే పెట్టుబడులను ఆకర్షించవచ్చని మరో నివేదిక పేర్కొంది. అందులో సగం పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని.. అదే జరిగితే పెద్దఎత్తున ఉపాధి కల్పనకు ఆస్కారం ఉంటుందని అంటున్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కొత్త పార్కుల ఏర్పాటు లక్ష్యం. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'లో ఈ కొత్త పార్కులను చేర్చనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత నెలలో బడ్జెట్ ప్రసంగంలోనే వెల్లడించారు. ఇదే అవకాశంగా రాష్ట్రానికి కొత్త పారిశ్రామిక పార్కులను సాధించేందుకు చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో చర్చలు జరిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్రం ఏపీకి ఏకంగా ఆరు పార్కులు ఇచ్చేందుకు సుముఖత తెలిపింది. కేంద్రం సహకారంతో రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్లతో కూడిన ప్రణాళికాబద్ధమైన సమగ్ర పారిశ్రామిక నగరాల నిర్మాణానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రానికీ లేని విధంగా మనకు 10 ఓడరేవులు, 10 విమానాశ్రయాలు, మెరుగైన రోడ్డు రవాణా, లాజిస్టిక్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని పశ్చిమ తీరం కంటే తూర్పు తీర ప్రాంతం రోడ్డు, రైలు, విమానయాన మార్గాలతో మెరుగైన రీతిలో అనుసంధానమై ఉంది. నదుల అనుసంధానం కూడా పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలుగా అనుకూలమైన అంశం. ఇవన్నీ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేవారికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి కాబట్టి దేశంలో కొత్తగా నెలకొల్పనున్న పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చంద్రబాబు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలకు నమ్మకం కల్పించి అవసరమైన అన్ని అనుమతులను వేగంగా ఇవ్వగలిగితే.. పరిశ్రమలు కూడా అంతే త్వరగా ఏర్పాటవుతాయని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్దఎత్తున పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఆక్వా, ఆహారశుద్ధి వంటి రంగాల్లో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి ఆనం

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి, బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు వద్ద దేవదాయ శాఖపై సమీక్ష ఉండడంతో ఆయన ముందస్తుగా విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. దేవాలయాల పటిష్టత కోసం అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పక అమలు చేస్తామన్నారు. బ్రాహ్మణ అభివృద్ధి, సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పండుగలు, ముఖ్య దినాల్లో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వంలో వ్యవస్థలపై దాడులతోపాటు సనాతనధర్మంపై దాడి జరిగిందన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎస్.సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్ల నరికివేతను నిలువరించండి

▸▸ హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మానవాళికి, పర్యావరణానికి హానికరమని శాస్త్రీయంగా నిరూపితమయ్యేవరకు కోనోకార్పస్ చెట్ల నరికివేతను నిలుపుదల చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. గుంటూరుకు చెందిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మరో ఇద్దరు ఈ పిల్ దాఖలు చేశారు. కోనోకార్పస్ మొక్కలు నాటడం మంచిదా కాదా అనే విషయంపై అధ్యయనానికి నిపుణులతో కమిటీ ఏర్పాటుకు ఆదేశాలివ్వాలని కోరారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా ఆ చెట్లను నరికివేస్తే వాళ్లా చట్ట ప్రకారం నష్టపరిహారం వసూలు చేసి ఆ సొమ్ముతో తిరిగి చెట్లను నాటేలా ఆదేశించాలని కోరారు. పిల్ పరిష్కారమయ్యేవరకు రాష్ట్ర వ్యాప్తంగా కోనోకార్పస్ చెట్లను నరికివేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీఎస్, పర్యావరణం-అడవులు, రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్‌లు, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, కాకినాడ, నెల్లూరు కలెక్టర్లను ప్రతివాదులుగా చేర్చారు.

'ఫిట్‌నెస్' పరీక్షకు పచ్చజెండా..!

6,100 కానిస్టేబుల్ పోస్టులకు పోటీలో 95,000 మంది అభ్యర్థులు

రెండు మూడు రోజుల్లో షెడ్యూల్‌పై ప్రకటన

న్యాయపరమైన చిక్కుల్ని అధిగమించిన పోలీస్ శాఖ



అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'పాతిక వేల పోలీస్ ఉద్యోగాలు... ఐదేళ్లలో భర్తీ చేస్తా' అంటూ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్... ఒక్కటంటే ఒక్క పోస్టు భర్తీ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలు కాకుండానే పోలీసు ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత చర్యతో కోర్టుకు ఎక్కిన వ్యవహారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. న్యాయ నిపుణుల సహకారంతో న్యాయపరమైన చిక్కులను తప్పించుకొని ఆగిన నియామక ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లే దిశగా చకచకా అడుగులు పడుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లోనే ఫిట్‌నెస్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ఏపీ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు (పీఆర్బీ) ఛైర్మన్ పీహెచ్‌డీ రామకృష్ణ సిద్ధమవుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇదీ జరిగింది

'పోలీసు శాఖలో 25,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రతి ఏటా జనవరిలో 6,500 చొప్పున భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తాం' అంటూ 2019కి ముందు నిరుద్యోగులకు వైసీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మాట తప్పి మడమ తిప్పేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఏటా పోలీసు అమర వీరుల సంస్మరణ (అక్టోబరు 21) దినం సందర్భంగా 'పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తాం' అంటూ ప్రకటించడం... ఆ తర్వాత పోలీసు శాఖకు అనుమతి ఇవ్వకుండా నిరుద్యోగుల్ని వంచించడం... మూడేళ్లపాటు ఇదే తంతు. దీంతో వైసీపీ ప్రభుత్వంపై నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. తప్పనిసరి పరిస్థితుల్లో 2022 నవంబరు చివరి వారంలో 6,100 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి జగన్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 4.58 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. 2023 జనవరి చివరి వారంలో ప్రిలిమ్స్ రాత పరీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 5న ఫలితాలు ప్రకటిస్తూ... 95,208 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. అర్హులైన వారికి దేహదారుఢ్య పరీక్షలు మార్చి 13 నుంచి 20 వరకూ నిర్వహిస్తామంటూ హాల్ టికెట్లు జారీ చేసింది. అదే సమయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ప్రక్రియను వాయిదా వేసింది. ఎన్నికల తరువాత కూడా నియామక ప్రక్రియను ముందుకు తీసుకొని వెళ్లడంపై నాటి ప్రభుత్వం దృష్టి సారించలేదు.

ఎందుకు ఆగిందంటే...

పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిన వైసీపీ ప్రభుత్వం... గతంలో ఎన్నడూ లేని విధంగా సివిల్ హోం గార్డులకు 15 శాతం, ఏపీఎస్పీ హోం గార్డులకు 25 శాతం రిజర్వేషన్ ఇచ్చింది. మొత్తం 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 1,100 హోం గార్డులకే పోతాయి. వీరికి నిర్వహించిన ప్రాథమిక పరీక్షకు 3,000 మంది హాజరు కాగా... 400 మంది మాత్రమే అర్హత సాధించారు. జగన్‌రెడ్డి పాదయాత్రలో ఆయన వెంట నడిచి, హోంగార్డు ఉద్యోగాలు పొందిన కొందరు తమకు కటాఫ్ తగ్గించాలని, అందరినీ అర్హులుగా ప్రకటించాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో నియామక ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి నియామక ప్రక్రియ పూర్తి చేయించాల్సిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే పట్టించుకోవడం మానేసింది.

ప్రభుత్వం మారడంతో ప్రక్రియ ముందుకు..

ఈలోగా రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో మొత్తం ప్రక్రియ నాలుగు నెలల్లో పూర్తి అయింది. అదే వేగంతో నియామక ప్రక్రియను పూర్తి చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. దీనిపై డీజీపీ, పీఆర్బీ ఛైర్మన్‌తో మాట్లాడారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి నియామక ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. అడ్వకేట్ జనరల్ సలహా తీసుకున్న పీఆర్బీ... ఆమేరకు అడుగులు ముందుకు వేస్తోంది.

సొంతవాళ్లకు స్వర్గం ప్రత్యర్థులకు నరకం

(మొదటి పేజీ తరువాయి)

నరకయాతన! చట్టబద్ధంగా దక్కాల్సిన కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో జైళ్లను నడిపిన తీరిది. ప్రతిపక్ష నేతలపై కక్ష తీర్చుకునేందుకు పోలీసులతో పాటు జైళ్లను కూడా అడ్డగోలుగా వాడుకున్నారు. జగన్ ప్రభుత్వంలో జైళ్ల ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయి. నిబంధనలు ఏమాత్రం పాటించలేదు. విచారణ చేయిస్తే ఎన్నో అరాచకాలు బయటకు వస్తాయి. జగన్ పాలనలో జైళ్లలో జరిగిన అక్రమాల్లో మచ్చుకు కొన్ని...

అధికారులతో బంతాట

జగన్ బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రధాన అనుచరుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని సీబీఐ చాలా పాట్లు పడి 2021 నవంబరు 17న అరెస్టు చేసింది. కోర్టు ఆదేశాలతో కడప సెంట్రల్ జైలుకు రిమాండుకు తరలించారు. అయితే జైలులో ఉన్న ఆయనకు తొలి రోజు నుంచీ రాజమర్యాదలు అందేలా అప్పటి సీఎం జగన్ పూర్తిగా సహకరించారు. రిమాండ్ ఖైదీగా ఉన్న శివశంకర్‌రెడ్డి చట్టాలకు అతీతంగా దర్పం వెలగబెట్టారు. జైలు సూపరింటెండెంట్‌ను, డీఐజీ స్థాయి అధికారిని బదిలీ చేయించడంతో జైలే ఏకంగా ఆయన గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గణేనాయక్‌పై వైసీపీ పెద్దలు తీవ్ర ఒత్తిడి తెచ్చి.. అనారోగ్యం సాకుతో శివశంకర్‌రెడ్డిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నెలన్నర ఉంచారు. వారంలో ఒకరోజు జైలుకు వస్తే, మిగతా ఆరు రోజులూ ఆస్పత్రిలోనే ఉండేవారు. ఒకదశలో గణేనాయక్ చేతులు ఎత్తేయడంతో ఆయనను కర్నూలుకు బదిలీ చేసి అక్కడి నుంచి వరుణారెడ్డిని తీసుకొచ్చారు. ఆయన కూడా తలాడించకపోవడంతో ఒంగోలు పంపారు. అక్కడ అడిషనల్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఐఎస్‌హెచ్ ప్రకాశ్‌ని ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా తెచ్చుకున్నారు. వివేకా కేసులో అప్రూవర్ దస్తగిరిని దేవిరెడ్డి కుమారుడు, కడపలో డాక్టరు అయిన చైతన్యరెడ్డి కడప జైలులో బెదిరించిన వ్యవహారంలో ప్రకాశ్ సహకరించినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో డీఐజీ రవికిరణ్ కడప జైలు వ్యవహారాలపై సీరియస్ అయ్యారు. దీంతో ఆయన్ను రాజమహేంద్రి కోస్తాంధ్ర రేంజ్‌కు పంపారు.

దేవిరెడ్డి, అవినాశ్ మధ్య హాట్‌లైన్..

కడప సెంట్రల్ జైలు ఇంచార్జి సూపరింటెండెంట్ ప్రకాశ్ తన గదిలోకి శివశంకర్‌రెడ్డిని పిలిచి ఫోను ఇచ్చి మాట్లాడించారని జైలు వర్గాలే చెబుతున్నాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు ప్రకాశ్ గదికి శివశంకర్‌రెడ్డి వచ్చి ఫోన్ వాడుకునేవారు. అవినాశ్‌రెడ్డితో మాట్లాడేవారు. ఫోన్ల వినియోగంపై గట్టి ఆంక్షలు ఉండే జైలులో కూడా... వారి మధ్య 'హాట్‌లైన్' నడుస్తుండేదని చెబుతున్నారు. జైలులో కోరుకున్న సౌకర్యాల నుంచి అధికారులు, సిబ్బంది తీరుపై ఫిర్యాదుల దాకా ప్రతిదీ అవినాశ్‌రెడ్డి ద్వారా అప్పటి సీఎం జగన్‌కు దేవిరెడ్డి చేరవేస్తుండేవారని చెబుతున్నారు. ఆ వెంటనే తాడెపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు ఆగమేఘాల మీద కడప జైలుకు వెళ్లేవి. డీఐజీ రవికిరణ్‌ను బదిలీ చేయాలని జగన్‌కి సమాచారం వెళ్లగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెబుతారు. అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి రవికిరణ్ స్వయానా మేనల్లుడు. అయినా కూడా 'శంకరన్న చెప్పాడంతే.. పంపేయండి' అని జగన్ అన్నారని సమాచారం.

బాబుకు నో హెల్పర్.. దేవిరెడ్డికి ముగ్గురు..



జగన్ ప్రభుత్వంలో గత ఏడాది సెప్టెంబరులో అప్పటి విపక్ష నేత చంద్రబాబును అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఇరికించారు. కోర్టు ఆదేశాలతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు ఆయనను తరలించారు. 14 ఏళ్లు సీఎంగా చేసి సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు 70 ఏళ్ల వయసు ఉన్న చంద్రబాబుకు కనీసం ఒక సహాయకుడిని కూడా ఇవ్వలేదు. కానీ శివశంకర్ రెడ్డికి కడప జైలులో ముగ్గురిని సహాయకులుగా ఉంచారు. గదిని క్లీన్ చేయడం, బట్టలు ఉతకడం, కాళ్లు నొక్కడం, ఏవైనా అవసరమైతే అందించడం వంటి చాకిరీకి వినియోగించేవారు. ఈ ముగ్గురికి కిడ్నాప్ కేసులో జైలు శిక్ష పడింది. శివశంకర్‌రెడ్డికి చేసిన సేవే అర్హతగా వాళ్లను నిబంధనలకు విరుద్ధంగా ఓపెన్ ఎయిర్ జైలుకు మార్చారు.

ఒక్క రోజులోనే ఆదేశాలు మార్పు

కడప సెంట్రల్ జైలుకు దగ్గరలోనే ఆ రేంజ్ డీఐజీ ఉంటారు. అందువల్ల డీఐజీ అక్కడ లేకపోతే మరింత అనుకూలంగా ఉంటుందని దేవిరెడ్డి తొలుత ఆలోచించారు. జగన్‌తో అవినాశ్ ద్వారా మాట్లాడుకుని రవికిరణ్‌ను ఉన్నపళంగా రాజమహేంద్రవరం పంపించారు. అలాగే, ఎక్కడో విశాఖలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఎస్.రాహుల్‌ను కడప జైలుకు తెచ్చుకున్నారు. కడప రేంజ్‌కి కూడా రాహుల్‌ని డీఐజీ (అడిషనల్ ఇన్‌చార్జిగా) నియమించారు. ఆ తర్వాత ఏమనుకున్నారో తెలియదుగానీ.. రాహుల్ నియామకాన్ని ప్రభుత్వం ఆ మరునాడే వెనక్కి తీసుకుంది. అడిషనల్ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రకాశ్‌కి ఫుల్‌చార్జ్ ఇచ్చింది.

విచారణ జరగాల్సిందే...

ఒప్పు చేసిన వారిని దండించడం ఎంత తప్పో.. తప్పు చేసిన వారిని శిక్షించకపోవడం అంతకంటే పెద్ద తప్పు. నిబంధనలు ఉల్లంఘించడం శివశంకర్‌రెడ్డి తప్పయితే.. చట్టాన్ని అమలు చేయాల్సిన జైలు సిబ్బంది నిందితుడికి ఊడిగం చేయడం క్షమించరాని నేరం. శివశంకర్‌రెడ్డి కడప జైలులో ఉండగా జరిగిన చట్ట ఉల్లంఘనలపై అప్పటి అధికారులను పూర్తిగా విచారిస్తే నిజాలు వెలుగుచూసే అవకాశం ఉంది. జగన్ అండతో శివశంకర్‌రెడ్డి జైలు నుంచి నడిపిన దందాలు, చట్ట ఉల్లంఘనలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

ఆస్పత్రిలో కూర్చుని దర్జాగా ఫోన్లు

దేవిరెడ్డికి జైలు ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ పుష్పలత పూర్తిగా సహకారం అందించారనే ఆరోపణలున్నాయి. ఆయనకు, ఆయన కుమారుడికి మధ్య అనుసంధానకర్తగా పనిచేశారని చెబుతున్నారు. జైలులోని రెండో గేటు దాటి ఖైదీల బ్యారెక్‌లు, ఆస్పత్రి వగైరా ఉండే ప్రాంతానికి వెళ్లే సమయంలో ఉన్నతాధికారి సహా ఎవరి ఫోను అయినా గేటులో సిబ్బందికి అందజేయాలి. కానీ ఆమె ఒక ఫోనును గేటులో పెట్టి రెండో ఫోనును 'రహస్యం'గా తీసుకెళ్లేవారని తెలుస్తోంది. శివశంకర్‌రెడ్డిని ఆస్పత్రికి పిలిపించుకొని తన రూంలో కూర్చోబెట్టి రెండేసిఅమారు రెండు గంటలు ఫోనులో మాట్లాడించేవారు. మధ్యమధ్యలో టీ, స్నాక్‌లు అందుతుండేవి.



జగన్ సీబీఎస్ఈ ఫెయిల్

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ ముందు జాగ్రత్తగా విద్యార్థుల సామర్థ్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు తాజాగా వారికి అంచనా పరీక్ష (అసెస్‌మెంట్) నిర్వహించింది. ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ నాలుగు సబ్జెక్టులపై ఈనెల 21 నుంచి 24 వరకు ఈ పరీక్షలు జరిగాయి. అన్ని పరీక్షలనూ పకడ్బందీగా ట్యాబ్‌లతో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. వాటి ఫలితాలను తాజాగా విశ్లేషించగా అధికారులకు షాక్ కొట్టినంత పనైంది. దాదాపు 65శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. దీంతో ఇప్పుడేం చేయాలనేది పెద్ద తలనొప్పిగా మారింది. త్వరలో మంత్రి లోకేశ్‌తో చర్చించిన అనంతరం దీనిపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. ఇంగ్లిష్ పరీక్షను 67,551 మంది విద్యార్థులు రాయగా వారిలో 59,518 మందికి పాస్ మార్కుల కంటే తక్కువే వచ్చాయి. సీబీఎస్ఈలో 33 శాతం మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించినట్టు. అయితే 80 మార్కుల థియరీలో, 20 మార్కుల ప్రాక్టికల్స్‌లో వేర్వేరుగా 33 శాతం రావాలి. అందువల్ల కనీసం 40 మార్కులను పాస్ మార్కులుగా తాజా పరీక్షల్లో అంచనాకు నిర్ణయించారు. ఇంగ్లిష్‌లో ఏకంగా 88.1 శాతం మంది ఫెయిలయ్యారు. 7,291 మందికి 41 నుంచి 60 మధ్య మార్కులు వచ్చాయి. 80 మార్కులు దాటినవారు 14 మందే ఉన్నారు. గణితంలో 74,539 మంది పరీక్ష రాయగా 56,213 (75.41శాతం) మంది ఫెయిలయ్యారు. 12,801 మందికి 60 మార్కులు వచ్చాయి. 370 మందికి 80 మార్కులు దాటాయి. సైన్స్‌లో 74,977 మంది పరీక్ష రాస్తే 49,410 (65.9శాతం) మంది ఫెయిలయ్యారు. సోషల్ రాసిన 75,121 మందిలో 48,766 (64.91శాతం) మంది ఫెయిలయ్యారు. 19,152 మందికి 60 మార్కులు వస్తే, 1,344 మందికి మాత్రమే 80 దాటాయి. మొత్తంగా చూస్తే సగటున 65శాతం మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.

ఇప్పుడేం చేయాలి?

ఈ ఫలితాలు చూశాక ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులు దృష్టిపెట్టారు. ఇవే సామర్థ్యాలతో సీబీఎస్ఈ బోర్డులో పరీక్షలు రాయిస్తే ఎక్కువ మంది ఫెయిలయ్యే అవకాశం ఉంది. అది వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందువల్ల ప్రభుత్వం వారి భవిష్యత్‌పై రిస్క్ తీసుకోకూడదని భావిస్తోంది. బోర్డులు వేరైనా సిలబస్ ఒక్కటే కావడంతో ఏ బోర్డులో పరీక్షలు రాయాలనేది మీరే నిర్ణయించుకోండని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆప్షన్ ఇచ్చే అవకాశంపై కసరత్తు చేస్తున్నారు. కాగా, సీబీఎస్ఈ విషయంలో మంత్రి లోకేశ్ పలుమార్లు అధికారులతో సమీక్షించారు. ప్రాక్టికల్స్ పాఠశాలల్లోనే జరుగుతాయి కాబట్టి వాటిలో ఎక్కువ మార్కులు వేస్తే సులభంగానే ఉత్తీర్ణత సాధిస్తారనే సలహాలు కూడా వచ్చాయి. అయితే లోకేశ్ మాత్రం దానికి ససేమిరా అన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచకుండా ఉత్తీర్ణులైతే, ఉన్నత విద్యలో అయినా ప్రతికూలత ఎదురౌతుందని, అందువల్ల వాస్తవాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉండాలని స్పష్టం చేశారు. దీంతో పరీక్షలు నిర్వహించి విద్యార్థుల పరిస్థితిని అంచనా వేశారు.

రికార్డుల భద్రతకు చర్యలు చేపట్టాలి

▸▸ జనాభా ప్రాతిపదికన మండలాల్లో కార్యాలయాలకు సిబ్బందిని కేటాయించాలి

▸▸ రెవెన్యూ సదస్సులను విజయవంతం చేస్తాం

▸▸ రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దుకోవటానికి ఇదో మంచి అవకాశం

▸▸ ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



విలేకరులతో మాట్లాడుతున్న అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో రెవెన్యూ కార్యాలయాలు, రికార్డుల భద్రతకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో రికార్డుల భద్రతకు ప్రస్తుతం ఎలాంటి రక్షణా లేదన్నారు. కార్యాలయాల్లో రాత్రిపూట భద్రత లేకపోవటం వల్ల అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి గాను, ఆసక్తిగల గ్రామరెవెన్యూ సహాయకులను పదోన్నతుల ద్వారా రికార్డు అసిస్టెంట్లుగా నియమించవచ్చని సూచించారు. వాచ్‌మెన్‌లను కూడా నియమించాలని కోరారు. ఇక, జిల్లాల పునర్విభజన తరువాత కూడా పాత జిల్లా కలెక్టరేట్లలో ఉన్న సిబ్బందినే కొత్త జిల్లాలకు సర్దుబాటు చేశారని తెలిపారు. దీనివల్ల రెవెన్యూ సిబ్బంది కొరత ఏర్పడి, ఉన్నవారు పని భారంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన మండలాలకు సిబ్బందిని కేటాయించి, ఉద్యోగులు పనిచేసే వాతావరణం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, త్వరలో జరగనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేస్తామని బొప్పరాజు తెలిపారు. 100 సంవత్సరాల తరువాత చేపట్టిన రీ సర్వే వల్ల అక్కడక్కడ చిన్న చిన్న పొరపాట్లు జరిగాయన్నారు. ఆ పొరపాట్లను సరిదిద్దేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని భావిస్తున్నామని చెప్పారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో వాస్తవాలు నిర్ధారణ కాకముందే.. ఉద్దేశపూర్వకంగా ఫైళ్లు తగులబెడుతున్నారని మీడియాల్లో కథనాలు రావటం వల్ల ఉద్యోగ వ్యవస్థపై ప్రజల్లో చెడు అభిప్రాయం కలుగుతుందన్నారు. మంచి, చెడులు నిర్ధారించుకుని వాస్తవాలు రాయాలని బొప్పరాజు మీడియాకు విజ్ఞప్తి చేశారు.

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వీ రాజేష్

ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రావిశెట్టి వెంకట రాజేష్‌ను ఎన్నుకున్నట్లు బొప్పరాజు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రమేష్ కుమార్ వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా చేసినందువల్ల ఆ స్థానంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

రిటైరైనా మళ్లీ సర్వీసుల్లోకి

▸▸ మార్గదర్శకాలు విడుదల చేస్తూ జీఏడీ ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రిటైరైన అధికారులను, ఉద్యోగులను రాజీనామా చేయాలని ఆదేశించిన కూటమి ప్రభుత్వం తాజాగా మధ్యస్థాయి రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల నియామకాలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆయా శాఖలు మధ్యస్థాయి అధికారులను, కింది స్థాయి ఉద్యోగులను నియమించుకోవచ్చని, అయితే అందుకు స్ర్కీనింగ్ కమిటీ ఏర్పాటు చేసి పూర్తిగా పరిశీలించాకే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా నియమకాలు చేపడతారని పేర్కొంది. రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ/డిప్యూటీ డైరక్టర్ కేడర్ అధికారుల నియామకానికి సీఎస్, ఆర్థికశాఖ కార్యదర్శి, ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ముఖ్యకార్యదర్శి/కార్యదర్శులతో కూడిన స్ర్కీనింగ్ కమిటీ పరిశీలన చేస్తుందని తెలిపింది. డిప్యూటీ సెక్రటరీ/డిప్యూటీ డైరక్టర్ కేడర్ కంటే తక్కువ స్థాయి రిటైర్డ్ అధికారుల నియామకాల కోసం జీఏడీ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి, ఆయా శాఖలకు సంబంధించి ప్రత్యేక సీఎస్/ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి, ఆర్థికశాఖ కార్యదర్శితో కూడిన స్ర్కీనింగ్ కమిటీ పరిశీలించి నియమిస్తుందని పేర్కొంది. అది ఆమోదించాక ఆయా శాఖలు సీఎం ఆమోదం తీసుకోవాలి. ఈ నియామకాలు కేవలం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకే వర్తిస్తుందని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సొంత గ్రామాల్లో పనిచేసేందుకు వీల్లేదు

▸▸ సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ఆ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నెల 19 నుంచి 31 వరకు బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ పోర్టల్‌లో లాగిన్ అయి బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, నియామక అథారిటీలు ఆయా ఖాళీలను ప్రకటించాలని, సీనియారిటీ ప్రాతిపదిక కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. దీంతోపాటు అపాయింట్‌మెంట్ అథారిటీ పాలనా సౌలభ్యం కోసం కూడా బదిలీలు చేయవచ్చని పేర్కొన్నారు. ఏసీబీ/విజిలెన్స్ తదితర కేసుల్లో ఉన్నవారు బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులని తెలిపారు. ఏ ఉద్యోగినీ కూడా సొంత గ్రామ పంచాయతీలో నియమించరాదని, తప్పుడు సమాచారమిస్తే వారిపై క్రమశిక్షణా చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తారని తెలిపారు. ఐటీడీఏ పరిధిలో రెండేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యమివ్వాలన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరుకాని ఉద్యోగుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరాదని గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరక్టర్ విడుదల చేసిన మార్గదర్శకాల్లో తెలిపారు.

సీఎం భద్రత 'గాలి'లో దీపమా?



(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర విమర్శలొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అద్దెకు తెచ్చుకున్న హెలికాప్టర్‌కు స్టాండ్‌బైగా ముంబై నుంచి వచ్చిన హెలికాప్టరే పుణె వద్ద ప్రమాదానికి గురైంది. గత ప్రభుత్వం అద్దెకు తెచ్చుకున్న హెలికాప్టర్‌నే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కొనసాగిస్తున్నారు. ప్రతి వెయ్యి గంటలు ప్రయాణం చేశాక దాన్ని సర్వీసు చేయాల్సి ఉంటుంది. హెలికాప్టర్ ప్రొవైడ్ చేసే జీఎంఆర్ సంస్థ సర్వీసు కోసం ముంబైకు పంపింది. సర్వీసు పూర్తి అయ్యే లోపు స్టాండ్‌బై కోసం మరో హెలికాప్టర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే హెలికాప్టర్ సామర్థ్యం, పనితీరు అంచనా వేయడంలో అధికారులకు నైపుణ్యం లేకపోవడంతో పాటు నిబంధనలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి. సరైన హెలికాప్టర్‌ను ఎంపిక చేసుకోవడంలో విఫలమయ్యారు. వాస్తవానికి 10 ఏళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్న హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకోరాదన్న నిబంధనలున్నాయి. అంతేకాకుండా వాతావరణం సరిగా ఉందా? లేదా? అనే విషయంలో అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. అయితే ఏవియేషన్ అధికారులు వీటిని విస్మరించి గ్లోబల్ వెక్ట్రా అనే సంస్థ నుంచి వీటీ-జీవీఐ, ఏడబ్ల్యూ 139 2008 మోడల్ హెలికాప్టర్‌ను విజయవాడలో ల్యాండ్ చేసుకునేందుకు ఈ నెల 24న అనుమతి తీసుకున్నారు. అదే రోజు ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఆ తర్వాత విజయవాడకు రావాలని నిర్ణయించారు. అయితే ముంబై నుంచి వస్తున్నప్పుడు పుణె జిల్లా పాడ్ గ్రామం వద్ద హెలికాప్టర్ అతి తక్కువ ఎత్తులో నుంచి కూలిపోయింది. ఇంత తక్కువ ఎత్తులో నుంచి కూలినప్పుడు హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసం కావడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెలికాప్టర్‌ను ఎంపిక చేసే ఏవియేషన్ అధికారులకు అవగాహన లోపం కారణంగా ఇలాంటి ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

భద్రత చర్యలపై అనుమానాలు

వాస్తవానికి చంద్రబాబు ప్రయాణించే రెగ్యులర్ హెలికాప్టర్ ప్రమాదానికి గురి కాకపోయినప్పటికీ, స్టాండ్‌బై కోసం తెచ్చిన హెలికాప్టర్ కూలిపోవడంతో ఏవియేషన్ అధికారుల భద్రత చర్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐఅండ్ఐ సంస్థలో పనిచేసే ఓ జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి ఏవియేషన్ బాధ్యతలు చేపడుతున్నారు. ఏవియేషన్‌పై పెద్దగా అవగాహన లేని అధికారులు బాధ్యతలు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవానికి ప్రొటోకాల్, ఏవియేషన్ ఎండీగా ఒకే అధికారి వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేసే కల్నల్ ఈ బాధ్యతలు నిర్వర్తించేవారు. అప్పట్లో వాతావరణంలో ఏమాత్రం తేడా ఉన్నా హెలికాప్టర్‌లో ప్రయాణానికి అనుమతించే వారు కాదు. ప్రతికూల వాతావరణం కారణంగా మూడుసార్లు ముఖ్యమంత్రి నెల్లూరు పర్యటనకు హెలికాప్టర్‌లో వెళ్లడానికి అనుమతించలేదు. అప్పట్లో అధికారులు అంత అప్రమత్తంగా ఉండేవారు. వైఎస్ హెలికాప్టర్ ప్రమాదం తర్వాత రాష్ట్ర అధికారులు హెలికాప్టర్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. అయితే వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత నియమించిన అధికారులకు అంతగా అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. జెడ్‌ప్లస్ కేటగిరి ఉన్న సీఎం చంద్రబాబు విషయంలో అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఏవియేషన్‌లో సీనియర్ అధికారులను నియమించాల్సిన అవసరముందని అభిప్రాయపడుతున్నారు.

వాతావరణం బాగున్నా...

వీఐపీలు ప్రయాణిస్తున్న హెలికాప్టర్లు ప్రమాదానికి గురైన సంఘటనలను పరిశీలిస్తే... చాలా వరకూ ప్రతికూల వాతావరణంలో కుప్పకూలాయి. భారీ వర్షం కురవడం, వెలుతురు లేమి, పొగమంచు, వేగమైన గాలులు వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరిగాయి. చంద్రబాబు కోసం శనివారం ముంబై నుంచి హెలికాప్టర్ వస్తున్న సమయంలో వాతావరణం బాగుంది. ఎలాంటి ప్రతికూల పరిస్థితులు లేవు. అయినా తక్కువ ఎత్తులో నుంచి కుప్పకూలి పూర్తిగా ధ్వంసమైంది. జెడ్‌ప్లస్ కేటగిరి రక్షణ ఉన్న ముఖ్యమంత్రి కోసం హెలికాప్టర్‌ను ఎంపిక చేసే ముందు అధికారులు అన్నిరకాల భద్రత ప్రమాణాలు పాటిస్తారు. సురక్షితమని నిర్ధారించాకే కేటాయిస్తారు. అయితే చంద్రబాబు భద్రత విషయంలో అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఊరికో భూ బకాసురుడు

(మొదటి పేజీ తరువాయి)

అంశాలపైనే ఉంటున్నాయి. వీటిలో అధిక శాతం భూ కబ్జాల ఫిర్యాదులే కావడం గమనార్హం. అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైసీపీ నేతలు భారీగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించుకున్నారని, అధికారులను అడ్డు పెట్టుకొని కబ్జాలకు పాల్పడ్డారని ఫిర్యాదుల్లో పేర్కొంటున్నారు. కాగా, ఉత్తరాంధ్రలో విశాఖ నగరం చుట్టుపక్కల ప్రాంతాలు, రాయలసీమలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భూకబ్జా, ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి.

2 నుంచి రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ శాఖపై ఫిర్యాదులు అధికంగా ఉండటంతో వీటి పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబరు 2 నుంచి ఈ సదస్సులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వచ్చిన ఫిర్యాదులను అమరావతిలోని సచివాలయ విభాగం జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు పంపింది. అక్కడ నుంచి మండల కార్యాలయాలకు వాటిని పంపారు. గ్రామ రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, మండల రెవెన్యూ అధికారులు ఏ సమస్యను ఎన్ని రోజుల్లో పరిష్కరించాలో నిర్దీత సమయం పేర్కొంటూ కలెక్టర్లు ఆదేశాలు పంపారు. ఆ సమయం దాటితే క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని కూడా హెచ్చరిస్తున్నారు. "విఎగిలిన శాఖల పరిధిలో సమస్యలు త్వరగానే పరిష్కారం అవుతున్నాయి. రెవెన్యూ సమస్యలు కొంత క్లిష్టమైనవి కావడంతో ఎక్కువ సమయం పడుతోంది. అయినా వెంటపడుతున్నాం" అని సంబంధిత అధికారులు తెలిపారు.

ఫిర్యాదుల పరంపర ఇదీ..

- శ్మశాన స్థలాలను కూడా వదిలి పెట్టడం లేదని, సమాధులను కూడా తొలగించి మరీ కబ్జా చేశారని మాచర్ల. వడ్డెర సంఘం నేతలు వైసీపీ నేతలపై ఫిర్యాదు చేశారు.
- ప్రకాశం జిల్లాలో ఒంగోలు నగరం చుట్టుపక్కల ఉన్న స్థలాలకు సంబంధించిన రికార్డులు మార్చేసి భూములు, స్థలాల ఆక్రమణకు పాల్పడ్డారని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- తిరుపతి నగరం చుట్టుపక్కల నుంచి కూడా ఇవే తరహా ఫిర్యాదులు పుంఖానుపుంఖాలుగా వచ్చాయి.
- చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరగణం ప్రభావం అధికంగా ఉన్న పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో కబ్జా రాయుళ్లు చెలరేగిపోతున్నారని ఫిర్యాదులు అందాయి.
- విశాఖ నగరం చుట్టుపక్కల జరిగిన కబ్జాలపై వచ్చిన ఫిర్యాదులు ఇతర ఫిర్యాదుల కంటే ఎక్కువగా ఉన్నాయి.
- కబ్జాలకు తోడు రెవెన్యూ అధికారుల అవినీతి కూడా తారాస్థాయిలో ఉందని ఫిర్యాదుల్లో బాధితులు పేర్కొన్నారు.
- భూ వివాదాలు తలెత్తినప్పుడు ఎవరు డబ్బులిస్తే వారికే కొమ్ము కాయడం, సర్వేకు దరఖాస్తు చేసుకున్నా రాకపోవడం, రికార్డులను ఇష్టానుసారం మార్చివేయడం వంటి వాటిపై ఫిర్యాదులు భారీగా వచ్చాయి.
- వైసీపీ హయాంలో నిర్వహించిన భూముల రీ సర్వేపై కూడా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. రీ సర్వేలో రైతుల భూముల విస్తీర్ణాన్ని ఇష్టానుసారం మార్చివేశారని అన్నదాతలు తమ ఫిర్యాదుల్లో స్పష్టం చేశారు.

గొంతు విప్పితే గోడు!

రాజధాని అమరావతిలో మూడు చోట్ల 'ప్రజా దర్బార్' పేరుతో వినతులు స్వీకరిస్తున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఆదివారం మినహా అన్ని రోజుల్లో ప్రజల నుం చి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఈ కా ర్యక్రమంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు పా ల్గొంటున్నారు. దీంతో అన్ని వర్గాల వారు తమ గోడును నేరుగా వారికే వెళ్లబోసుకుంటున్నారు. మంత్రి నారా లోకేశ్ ప్రతి రోజూ ఉదయం ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించే ప్రజా దర్బార్‌కు కూడా ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ సమస్యలు చెప్పుకొంటున్నారు. సీఎం చంద్రబాబు మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వచ్చినప్పుడు కూడా వందల సంఖ్యలో ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. రెవెన్యూ కార్యదర్శి వంటి ఉన్నతాధికారులు జిల్లాలకు వెళ్లినపుడు కూడా ప్రజలు వినతులు సమర్పిస్తున్నారు.



మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, అశోక్‌బాబు

నా భూమి కొల్లగొట్టారు

- పెద్దిరెడ్డి అనుచరుల భూ కబ్జాపై రిటైర్డ్ టీచర్ ఫిర్యాదు
- పార్టీ మారలేదని భూమి తవ్వేశారు.. ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుల వెల్లువ

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మదనపల్లెలో తన భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు ఆక్రమించి, అక్రమంగా ఇల్లు కూడా కట్టారని చిత్తూరు జిల్లా కార్వేటి నగరం మజరా సుద్దగుంట గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ జి. మురళి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మురళి వినతి పత్రం ఇచ్చారు. ఆక్రమణలపై నిలదీస్తే తనను చంపుతామని బెదిరించారని, దీనిపై విచారణ జరిపించి కబ్జా చేసిన వారితో పాటు సహకరించిన తహసీల్దార్‌పైనా చర్యలు తీసుకోవాలని మురళి కోరారు.

- అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం మాసాపేట గ్రామంలో తన భూమి అన్యాక్రాంతమైందని, న్యాయం చేయాలని షేక్ సయ్యద్ బాషా విజ్ఞప్తి చేశారు.
- ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన ఒక వృద్ధుడు తన భూమికి సంబంధించిన సమస్యను మంత్రికి వివరించారు. దీంతో ఆయన వెంటనే గిద్దలూరు టీడీపీ ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ఫోన్ చేసి పరిష్కరించే బాధ్యత అప్పగించారు.
- తాను వైసీపీలోకి మారలేదన్న కక్షతో తనపై అక్రమ కేసులు పెట్టడంతోపాటు తన భూమిలో మట్టి తవ్వేసి అమ్ముకున్నారని పెదకూరపాడు నియోజకవర్గం, గాదెవారిపాలెం గ్రామానికి చెందిన గాదె సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు.
- తన సొంత భూమిని దేవాదాయ శాఖ అధికారులు నిషేధిత జాబితాలో పెట్టించారని పశ్చిమ గోదావరి జిల్లాకి చెందిన గుడిమెట్ల కోటయ్య ఫిర్యాదు చేశారు.
- పంచాయతీరాజ్ శాఖకు వచ్చిన ఆదాయం రూ.వందల కోట్ల మేర బ్యాంకులో ఉందని, వాటిని వినియోగించాలని గుంటూరుకు చెందిన వ్యక్తి సూచించారు.
- దివ్యాంగురాలైన తనకు ఎంబీఏ సీటు వచ్చినా ఫీజు కట్టగలిగే పరిస్థితిలో లేనని, తనకు సాయం చేయాలని బి. రూప శ్రీ అనే విద్యార్థిని విజ్ఞప్తి చేయగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆమెకు రూ.20 వేలు సాయం చేశారు.
- 2013లో రిటైరైన తనకు ఇంతవరకు బకాయిలు ఇవ్వలేదని ఆర్టీసీలో పనిచేసి రిటైరైన రాజమహేంద్రవరానికి చెందిన సూర్య చంద్రరావు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ ప్రజాదర్బార్‌లో శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, ఎమ్మెల్సీ అశోక్ బాబు కూడా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

అన్న క్యాంటీన్లకు రూ.26.25 లక్షల విరాళం

- పుట్టిన రోజు సందర్భంగా ఒక రోజు ఖర్చు వితరణ
- ఏపీ సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేసిన సెల్‌కాన్ సీఎండీ వై.గురుస్వామి నాయుడు



ఏపీ సీఎం చంద్రబాబుకు చెక్‌ను అందజేస్తున్న సెల్‌కాన్ సీఎండీ గురుస్వామి నాయుడు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లకు సెల్‌కాన్ గ్రూపు సీఎండీ వై. గురుస్వామి నాయుడు రూ. 26.25లక్షల విరాళాన్ని అందజేశారు. ఏపీ సీఎం చంద్రబాబును సోమవారం ఆయన నివాసంలో కలిసి.. సంబంధిత చెక్కును అందించారు. ఈ నెల 31వ తేదీన తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఏపీ వ్యాప్తంగా ఉన్న 100 అన్న క్యాంటీన్లలో భోజనం పెట్టేందుకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలని కోరారు. వేల మంది కడుపు నింపుతున్న పథకానికి తన వంతుగా ఈ విరాళం ఇచ్చినట్లు గురుస్వామి తెలిపారు. పేదలకు రూ.5కే అన్నం పెట్టాలనే మంచి ఉద్దేశంతో ప్రారంభించిన అన్న క్యాంటీన్ల నిర్వహణలో భాగస్వాములయ్యేందుకు వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులు ముందుకు రావడం అభినందనీయమని సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టిన రోజు సందర్భంగా అన్న క్యాంటీన్లలో ఒక రోజు భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చిన గురుస్వామిని చంద్రబాబు అభినందించారు.

అన్నా క్యాంటీన్ భోజనం బాగుంది

- కుటుంబ సమేతంగా భోజనం చేసిన కృష్ణా కలెక్టర్



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఆయన సతీమణి, తండ్రి, కుమారుడు

పేదలకు తక్కువ ధరకు భోజనం పెడుతున్న అన్న క్యాంటీన్‌ను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి, భోజనం చేశారు. మచిలీపట్నంలోని అన్నా క్యాంటీన్‌కు సోమవారం కలెక్టరు, ఆయన భార్య, తండ్రి, కుమారుడు వెళ్లి.. అన్నం, సాంబారు, కూరలు, పెరుగు తిని పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉందని కలెక్టర్ చెప్పారు. భోజనం చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. తమకు తక్కువ ధరకు భోజనం లభిస్తోందని కార్మికులు కలెక్టరుకు సంతోషంగా చెప్పారు.

- మచిలీపట్నం టౌన్

తెలుగు రాష్ట్రాల సరిహద్దులో కూలిన చప్టా

- నిలిచిపోయిన రాకపోకలు



తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం కొత్తపాలెం వద్ద కొండపల్లి మేజర్ కాలువపై నిర్మించిన చప్టా సోమవారం రాత్రి కూలిపోయింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలో ఉన్నాయి. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు, ఖమ్మం, ఎర్రుపాలెం, పుణ్యక్షేత్రం జమలాపురం వెళ్లేందుకు ఈ చప్టానే ఆధారం. చప్టా కూలిపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

- జి.కొండూరు

ఊరిస్తున్న అల్పపీడనాలు

- కోస్తాలో వర్షాల కోసం రైతుల ఎదురుచూపు
- బెంగాల్‌లో స్థిరంగా అల్పపీడనం.. 29న మరో అల్పపీడనం
- మూడు రోజులు వర్షాలు: ఐఎండీ

విశాఖపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమంగా పయనించి పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో స్థిరంగా కొనసాగుతోంది. ఇది రానున్న రెండు రోజుల్లో ఉత్తర ఒడిశా, జార్ఖండ్ పరిసరాల వైపు రానుంది. ఈనెల 29వ తేదీన తూర్పు మధ్య, ఉత్తర ఒడిశా పరిసరాల్లో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు కోస్తాలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. అయితే, ఈ నెలలో ఇప్పటివరకూ మూడు అల్పపీడనాలు వచ్చినా కోస్తాపై ఎటువంటి ప్రభావమూ చూపలేదు. ఆగస్టు తొలి వారంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కోస్తాలో పెద్దగా వర్షాలు కురవలేదు. గతవారం బంగ్లాదేశ్ పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ మీదుగా పయనించి మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో వాయుగుండంగా మారింది. తాజాగా ఆదివారం బంగ్లాదేశ్‌లో మరో అల్పపీడనం ఏర్పడి ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతోంది. గత వారం రోజుల్లో వచ్చిన రెండు అల్పపీడనాల ప్రభావం పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తర ఒడిశాలకే పరిమితమైందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో గత నెల మంచి వర్షాలు కురిసినా ఆగస్టు తొలివారం నుంచి ముఖం చాటేశాయి. ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని పలుచోట్ల వర్షాలు కురిశాయి తప్ప అల్పపీడనాల ప్రభావంతో కాదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి ఒడిశా మీదుగా పయనిస్తే కోస్తాలో గోదావరి జిల్లాల వరకు వర్షాలు కురుస్తాయి తప్ప, పశ్చిమ బెంగాల్ నుంచి జార్ఖండ్ వైపు వెళితే మాత్రం కోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం రుతుపవనాలపైనే కాకుండా బంగాళాఖాతంపై కూడా పడిందన్నారు. రుతుపవనద్రోణి తూర్పుభాగం గత 15 రోజుల నుంచి జార్ఖండ్/ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ మీదుగా పయనించడం, ఇంకా బంగాళాఖాతంలో అల్పపీడనాలు బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఏర్పడడంతో కోస్తాలో వర్షాభావం కొనసాగుతోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. గడచిన మూడు వారాల నుంచి వర్షాలు విస్తారంగా లేకపోవడంతో ఉత్తరాంధ్రలోని అనేక ప్రాంతాల్లో ఖరీఫ్ పంటలకు ఇబ్బంది వచ్చిందన్నారు. అనేకచోట్ల చెరువులు ఇంకా నిండలేదని, కాలువల కింద మాత్రమే వరి నాట్లు పడ్డాయని, మెట్ట పంటలకు తీవ్ర ఇబ్బంది వచ్చిందని తెలిపారు. కోస్తాలో మిగిలిన ప్రాంతాల్లోనూ ఖరీఫ్ పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. హిందూ మహాసముద్రంలో రుతుపవన అనుకూల వాతావరణం నెలకొనడంతో రెండురోజులుగా అరేబియా సముద్రానికి ఆనుకుని కేరళ నుంచి గుజరాత్ వరకు ద్రోణి కొనసాగుతోంది. ఇంకా అరేబియా సముద్రం నుంచి రుతుపవన గాలులు దక్షిణ భారతం మీదుగా వీస్తుండడంతో రెండు రోజుల్లో రాష్ట్రంలో రుతుపవనాలు పుంజుకునే అవకాశం ఉందని, పశ్చిమ బెంగాల్‌లో ఉన్న అల్పపీడనం 48 గంటల్లో ఉత్తర ఒడిశా వైపు రానున్నందున ఉత్తరకోస్తాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వచ్చే నెల నాలుగైదు తేదీల వరకు వర్షాలు కొనసాగుతాయని చెబుతున్నారు. అయితే వాతావరణ శాఖ అంచనాల మేరకు వర్షాలు కురవడం లేదని వ్యవసాయ శాఖ రిటైర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. కోస్తాలో రైతులకు ఖరీఫ్ సీజన్ అంత సాఫీగా ఉండదని ఆందోళన వ్యక్తంచేశారు.

నెల్లూరులో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత..

కోస్తా, రాయలసీమల్లో రోజుల తరబడి వర్షాలు లేకపోవడంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సోమవారం దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 38.9, తిరుపతిలో 38.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాజస్థాన్ లేదా ఏపీలో మాత్రమే పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయి. వర్షాలు లేకపోవడం, పొడివాతావరణం కొనసాగడంతో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం

- మున్సిపల్, పట్టణాభివృద్ధి సంస్థల ఖజానాలను ఖాళీ చేసిన జగన్
- దారికి తెచ్చేందుకు సమయం పడుతుంది
- టీడీఆర్ బాండ్లపై విచారణ జరుగుతోంది
- ఇకపై అన్ని అనుమతులూ ఆన్‌లైన్‌లోనే..
- 13న మరో 75 క్యాంటీన్లు: మంత్రి నారాయణ



తిరుమల ఆలయం వద్ద మంత్రి నారాయణ

తిరుపతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలు, సంస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయి. వాటన్నింటినీ గాడిలో పెట్టేందుకు కొంత సమయం పడుతుంది' అని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. సోమవారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో మున్సిపల్ కార్పొరేషన్, తుడా అధికారులతో సమీక్షా నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వానికి ప్రణాళికంటూ ఏమీలేదు. ఎట్టపడితే అట్ల నిధులు దుర్వినియోగం చేయడమే. అంతా జిగ్‌జాగ్ పాలన. రాష్ట్రంలోని మున్సిపల్, పట్టణాభివృద్ధి సంస్థల ఖజానాలన్నీ ఖాళీ చేసిపెట్టారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రతి ఆరు నెలలకోసారి ఇస్తుంది. దానికి రాష్ట్ర నిధులు మ్యాచింగ్ అవసరంలేదు. 2023-24 తొలి ఆరు నెలలు (మార్చి నుంచి సెప్టెంబరు వరకు) రూ.454 కోట్లు మున్సిపాల్టీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. దానిని వైసీపీ ప్రభుత్వం ఇతరవాటికి మళ్లించేసింది. అవి సక్రమంగా ఇచ్చివుంటే కేంద్రం మళ్లీ ఇచ్చివుండేది. రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లను నెలాఖరు వరకు ఆపమన్నాం. కమిటీ వేసి పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. టీడీఆర్ బాండ్లలో కూడా కుంభకోణం చేయవచ్చని ఎవరికీ తెలియదు. రూ.వేల కోట్లు టీడీఆర్ బాండ్ల జారీ వలన ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగింది. త్వరలో ఆన్‌లైన్ విధానం తీసుకురాబోతున్నాం. ఎవరైనా ఇల్లు కట్టుకోవాలంటే నిమిషాల్లో అనుమతులు తెచ్చుకునే వెసులుబాటు కల్పించనున్నాం. నెలలో పూర్తిగా అందుబాటులోకి రానుంది. మున్సిపల్ సాఫ్ట్‌వేర్ ద్వారానే అనుమతులు వస్తాయి. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దన్న చంద్రబాబు సూచనల మేరకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు. ఆయనతో పాటు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పాల్గొన్నారు. సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నారాయణ అక్కడా మీడియాతో మాట్లాడారు. వచ్చేనెల 13న మరో 75 క్యాంటీన్లను ప్రారంభిస్తామని తెలిపారు. అక్టోబరు నెలలో మిగిలిన అన్న క్యాంటీన్లు కూడా మొదలవుతాయని మంత్రి వివరించారు.



కంటైనర్ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

కారును ఢీకొని లోయలోకి కంటైనర్

- ఘాట్‌రోడ్డు మలుపులో ఘోర ప్రమాదం
- కారులోని ముగ్గురితోపాటు ఇద్దరు డ్రైవర్లూ మృత్యువాత
- భర్త పెద్దకర్మ రోజునే భార్య దుర్మరణం.. 'అన్నమయ్య' జిల్లాలో ఘటన

రాయచోటి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కడప-రాయచోటి ప్రధాన రహదారిలో ని గువ్వలచెరువు ఘాట్‌లో ఘోర రో డ్డు ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కంటైన ర్, కారు ఢీకొన్న దుర్ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందా రు. మృతుల్లో వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలం కొండివారిపల్లె కుప్పానికి చెందిన కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు కాగా మిగతా ఇద్దరూ కారు, కంటైనర్ డ్రైవర్లు. వీరిలో భర్త పెద్ద కర్మరోజునే భార్య దుర్మరణం పాలవడం మరో పెనువిషాదం!. కారును ఢీకొన్న తర్వాత కంటైనర్ పక్కనే ఉన్న లోయలో పడిపో యింది. పోలీసుల కథనం మేరకు.. చక్రాయపేట మండలం కొండివారిపల్లెకుప్పానికి చెందిన చిన్నవెంకటమ్మ భర్త సత్యనారాయణ ఇటీవల చనిపోయారు. సోమవారం పెద్దకర్మ అనంతరం వరసకు కోడలు నాగలక్ష్మి, తమ్ముడు నాగయ్యతో కలిసి చిన్న వెంకటమ్మ అద్దె కారులో బంధువుల ఇళ్లకు వెళ్లారు. చక్రాయపేట, వేంపల్లె, కడప లో బంధువుల ఇళ్లకు వెళ్లి దీపం చూసి అన్నమయ్య జిల్లా రామాపురం మండలం గువ్వలచెరువులో బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో గువ్వలచెరువు ఘాట్‌లో రెండోమలుపు వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కంటైనర్ అదుపు తప్పి వీరి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కొండివారిపల్లె కుప్పానికి చెందిన చిన్న వెంకటమ్మ(50), నాగయ్య(48), నాగలక్ష్మి(35), కారు డ్రైవర్ మాబూ షరీఫ్(45) మృతి చెందారు. కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఘటనా స్థలిని పరిశీలించారు.

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- హాస్టల్ బాత్రూంలో టవల్‌తో ఉరి!
- 'అనంత'లోని బీసీ హాస్టల్‌లో ఘటన
- ఆత్మహత్య కాదంటున్న మృతుడి తండ్రి



తేజ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: అనంతపురం నగరంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంటర్ విద్యార్థి తేజ(17) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. తానుంటున్న హాస్టల్ బాత్రూంలో టవల్‌తో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించినా, కాళ్లు నేలకు ఆనుకుని ఉండడం, మెడపై గాయాల్లేకపోవడం, కాలిపై ఎవరిదో సెల్ నంబరు ఉండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కళ్యాణదుర్గం, పాలవాయికి చెందిన లింగమయ్య కుమారుడు తేజ.. నగరంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతూ.. బీసీ బాయ్స్ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని కనిపించినా, గొంతుపై ఎలాంటి గాయాలూ లేవు. తేజ కాలిపై ఒక మొబైల్ నంబర్ ఉంది. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తోంది. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి లింగమయ్య, బంధువులు తరలి వచ్చారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న తన కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి కారణమేమిటో తెలుస్తుందని సీఐ సాయినాథ్ అన్నారు. కాగా, హాస్టల్‌లో ఎవరో విద్యార్థి కొడుతున్నాడని తనతో చెప్పినట్టు తేజ తండ్రి లింగమయ్య తెలిపారు. తన కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని. ఎవరో ఏదో చేశారని అనుమానం వ్యక్తం చేశారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తాం: మంత్రి సవిత

తేజ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ అన్నారు. ఆస్పత్రిలో తేజ మృతదేహాన్ని పరిశీలించారు. మృతిపై వార్డెన్ సరైన సమాధానం చెప్పకపోవడంతో పూర్తిస్థాయిలో విచారించాలని కలెక్టర్, ఎస్పీని మంత్రి ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి







కృష్ణుడి విగ్రహానికి పూజలు చేస్తున్న దుర్గగుడి ఈవో రామారావు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణుడి దయతో రాష్ట్రం సుభిక్షం

● మంత్రి కొలుసు పార్థసారథి

కృష్ణలంక, ఆగస్టు 26: శ్రీకృష్ణుడి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖఃసంతోషాలతో ఆనందంగా జీవించాలని కోరుకుంటున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దుర్గాపురం, అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద శ్రీ కృష్ణ మందిరంలో జరిగిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మంత్రి సారథి పాల్గొన్నారు. మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. శ్రీ కృష్ణ పరమాత్ముడు దయతో ప్రజలతో పాటు పశుపక్ష్యాదులు ఆనందంగా ఉండాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడవాలని, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని కోరుకొంటున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలాచోట్ల కృష్ణ భక్తులు కృష్ణ మందిరాలు నిర్మించాలని భావిస్తున్నారని, రాజకీయాలకు అతీతంగా వారికి సహాయ సహకారాలు అందించనున్నట్టు మంత్రి పార్థసారథి తెలిపారు.

రామలింగేశ్వరనగర్: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ మదిరంలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం పండుగ పురస్కరించుకుని మందిరానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం 4.30 గంటల మంగళహారతితో ప్రారంభమైన గురుపూజ, సాంస్కృతిక ప్రదర్శనలు, సాయంత్రం శ్రీకృష్ణుడి వేషధారణ పోటీలు, జన్మాష్టమి కథ, 108 రకాల భోగ ఆర్తి, మహా శంఖాభిషేకం, సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇస్కాన్ సంస్థ మన సనాతనధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు భగవద్గీత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందన్నారు. సంస్థ నిర్వహిస్తున్న అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వేలాదిగా వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ వేడుకల్లో మందిర నిర్వాహకులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో వేడుకగా..

● ఉట్టి కొట్టే వేడుకలో పాల్గొన్న సీపీ రాజశేఖర బాబు, ఈవో రామారావు

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న దుర్గమ్మ సన్నిధిలో సోమవారం కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు జరిగాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిప్రపత్తులతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయాన్నే రుక్మిణీ, సత్యభామ, శ్రీకృష్ణుడి అర్చనామూర్తులకు పంచామృతాలతో అభిషేకాదికాలను నిర్వహించారు. శోడశోపచార పూజ, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, తదితర పూజలను నిర్వహించారు. కొండపైన గోశాలలో శాస్త్రోక్తంగా గో పూజను నిర్వహించారు. గో మాతకు శోడశోపచార పూజలు నిర్వహించి, వస్త్ర సమర్పణ, గోవుకు, దూడకు ఆహార సమర్పణ నిర్వహించారు. ఈ పూజల్లో ఈవో కేఎస్ రామారావు, స్థానాచార్యులు విష్ణుబొట్ల శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామికి పలు రకాల తీపి పదార్థాలను సమర్పించారు.

సోమవారం సాయంత్రం దుర్గగుడి రాజగోపురం ఎదురుగా ఖాళీస్థలంలో ఉట్టి కొట్టు వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. భక్తులు, సిబ్బంది, అధికారులు, పోలీసులు పాల్గొనగా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు ఉట్టికొట్టారు. సంతోష సంబరాల మధ్య వేడుకను నిర్వహించారు. ధర్మపథం వేదికపై గుంటూరుకు చెందిన ధూళిపాల శివరామకృష్ణ శర్మ గజేంద్ర మోక్షం హరికథను హృద్యంగా వినిపించారు. గజేంద్రుడు మొసలితో పోరాడుతున్నప్పుడు తనకు బలం తగ్గిపోయిందని, ప్రాణాలు పోతున్నాయని రక్షించే దిక్కెవరూ లేరని, నీవు తప్ప ఇంకెవ్వరూ ఆదుకోలేరని విష్ణువుని వేడుకునే ఘట్టాన్ని హరికథలో ఆకట్టుకునే విధంగా వినిపించి భక్తుల హర్షధ్వానాలు అందుకున్నారు.





రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు





చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న కేశినేని శివనాథ్



చిన్నికృష్ణుడి విగ్రహానికి రకరకాల ప్రసాదాలు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ, ఈవో అధికారులు

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం

వన్‌టౌన్, విజయవాడ: దుర్గగుడిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని చేయనున్న ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈవో రామారావు, ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్, ఆలయ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి క్యూల ఏర్పాట్లు పరిశీలించారు. ఘాట్‌రోడ్డులో క్యూలు, ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు, దేవస్థానం ప్రాంగణంలో క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, దర్శన రుసుం కౌంటర్లు, అన్నవితరణ ఏర్పాట్లు పరిశీలించారు. మెరుగైన చర్యలు కోసం సూచనలిచ్చారు. డీసీపీలు హరికృష్ణ, గౌతమీ షాలి, మహేశ్వరరాజు ఉన్నారు.

తమ్ముడి చేతిలో అన్న హతం

విద్యాధరపురం: స్థానిక భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గొల్లపూడి సాయిపురం కాలనీలో ఆదివారం రాత్రి అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో అన్న తలపై తమ్ముడు చెక్కతో దాడిచేసి కొట్టడంతో అన్న మృతిచెందిన సంఘటన జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గాలి తమ్మయ్యకు రాము, సూరిరెడ్డి, లక్ష్మారెడ్డి అనే ముగ్గురు సంతానం. వీరందరికీ వివాహాలయ్యాయి. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం లక్ష్మారెడ్డి అన్నయ్య గాలి రాము ఇంటికి వెళ్లి తన భార్య రొయ్యల బిర్యానీ తీసుకురమ్మందని, డబ్బులు కావాలని అడిగాడు. దీంతో రాము తన వద్ద లేవన్నాడు. దీంతో లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్న చెంపపై బలంగా కొట్టాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చిలికి చిలికి గాలివానలా మారి ఇద్దరూ కొట్టుకునే స్టేజికి వెళ్లింది. ఈ నేపథ్యంలో లక్ష్మయ్య చెక్కతో గట్టిగా కొట్టడంతో రాము కిందపడిపోయాడు. అయినా ఆగకుండా పదేపదే చెక్కతో కొట్టసాగాడు. రాము భార్య అడ్డుకున్నా వినలేదు. దీంతో ఆమె పక్కరోడ్డులో ఉన్న మరిది సూరిరెడ్డికి చెప్పింది. ఇద్దరూ ఇంటి దగ్గరకు రాగానే లక్ష్మారెడ్డి నడుచుకుంటూ వెళ్లిపోయాడు. రాముని పరిశీలించగా అప్పటికే అతను చనిపోయి ఉన్నాడు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయటంతో సీఐ కె.ఉమామహేశ్వరరావు నిందితుడు లక్ష్మారెడ్డిని అదుపులోకి తీసుకుని రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం అతడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మారెడ్డిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలు ప్రభుత్వ కార్యాలయాల్లోనే స్వీకరించాలి: సీపీఎం

గవర్నర్‌పేట: ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించే ప్రక్రియ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యాలయాల్లో సాగించడం విరమించి ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు మధ్య ఉండాల్సిన విభజన రేఖను చెరిపేసేలా రాష్ట్రంలోని అధికార కూటమి నేతలు వ్యవహరించడం తగదన్నారు. ప్రజా సమస్యల నివేదనకు ప్రభుత్వ కార్యాలయాలే తగిన వేదికలని, ప్రజల అర్జీలు, ఫిర్యాదులు స్వీకరణకు సచివాలయం, నిర్దేశిత ప్రభుత్వ కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలు వేదికలు కావాలన్నారు. ప్రభుత్వం ప్రజలందరికీ చెందినదిగా వ్యవహరించాలని, రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు.

1న కృష్ణా బాల్ బ్యాడ్మింటన్ బాలికల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్: కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ బాల,బాలికల ఎంపికలను సెప్టెంబరు 1న ఉదయం 8 గంటలకు నూజివీడులోని ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వీవీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2009 సెప్టెంబర్ 1న తర్వాత జన్మించిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులని, వివరాలకు అక్కడ గ్రౌండ్స్‌లో ఆర్ వేణుగోపాల్‌ను 9490334333 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఎంపికైన వారిని సెప్టెంబరు 13నుంచి 15వరకు అన్నవరంలో జరిగే ఏపీ అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి) బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ప్రసాద్ తెలిపారు.

రైవస్ కాలువలో బాలుడి గల్లంతు



వన్‌టౌన్, ఆగస్టు 26: గాంధీనగర్ రైవస్ కాలువలో స్నానానికి దిగిన దుర్గా అగ్రహారం, కార్మికనగర్‌కు చెందిన షేక్ షరీఫ్ (15) గల్లంతైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. బాలుడి తల్లి షకీలా ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్మికనగర్‌లో షకీలా ఇద్దరు కుమారులతో నివాసం ఉంటుంది. భార్య, భర్తల మనస్పర్థల కారణంగా భర్తతో విడిపోయి ఇళ్లలో పనులు చేసుకుంటూ కుమారులను పోషించుకుంటుంది. ఈమె పెద్ద కుమారుడు షేక్ షరీఫ్ దుర్గా అగ్రహారంలోని వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఇతడు తన స్నేహితుడు దుర్గాప్రసాద్‌తో కలిసి సోమవారం సాయంత్రం సుమారు 5.30 గంటలకు డీమార్ట్ ఎదురుగా రైవస్ కాలువలో స్నానం చేయటానికి దిగారు. షరీఫ్‌కు ఈత రాకపోవటంతో నీటి ఒరవడికి గల్లంతయ్యాడు. షరీఫ్ కాలువలో కొట్టుకుపోవటాన్ని చూసిన డేవిడ్ రాజు, సజ్జల శేఖర్ అతడిని కాపాడటానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ విషయాన్ని దుర్గాప్రసాద్ ఇంటికెళ్లి షరీఫ్ తల్లికి చెప్పాడు. బాలుడి తల్లి, సాధనికులు కలిసి ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని సత్యనారాయణపురం సీఐ బాల రాజాజీకి తెలిపింది. వెంటనే సీఐ తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించి ప్రత్యేక బృందాలను కాలువ పొడుగునున్న గ్రామాల వైపు పంపించారు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మీడియాతో మాట్లాడుతూ కాలువలో గల్లంతైన షరీఫ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో పాటు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ సహాయం కూడా తీసుకున్నట్టు చెప్పారు. ఇరిగేషన్, ఎస్‌డీఆర్‌ఎఫ్ స్థానిక అధికారులను అప్రమత్తం చేశామని సీఐ తెలిపారు. షరీఫ్ రైవస్ కాలువలో గల్లంతు కావటంతో అతడి తల్లి, కుటుంబం, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

కొండపైకి ప్రైవేటు వాహనాలకు చెక్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

వన్‌టౌన్, ఆగస్టు 26: దుర్గగుడి ఘాట్‌రోడ్డు కొండపైకి వెళ్లే ఓమిని, టవేరా ప్రైవేటు వాహనాల రాకపోకలకు దేవస్థానం ఈవో సోమవారం చెక్ పెట్టారు. కొన్ని నెలల నుంచి ఘాట్‌రోడ్ కొండపైకి మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద నుంచి పలువురు డ్రైవర్లు ఒక్కో భక్తుడి నుంచి రూ.30 వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి తీసుకువెళుతున్నారు. ఒక్కో వాహనంలో 10 నుంచి 15 మందికి భక్తులను ఎక్కించుకుని వెళుతున్నారు. దీనిపై సోమవారం ఆంధ్రజ్యోతిలో దుర్గగుడి ఘాట్ రోడ్డుపై అనధికార వాహనాల రాకపోకలు అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈవో కేఎస్ రామారావు అధికారులతో మాట్లాడి అనధికార వాహనాలు కొండపైకి ఎలా వస్తున్నాయంటూ మందలించారు. కొండపైకి అనధికార వాహనాలు వస్తే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈవో స్వయంగా కొద్దిసేపు టోల్‌గేట్ వద్దే ఉండి వాహనాల రాకపోకలను గమనించారు. పలు వాహనాల్లో కొందరు పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, బంధువులు కార్లలో కొండపైకి వెళ్లటం ఈవో గుర్తించారు. సమాచార కేంద్రం ప్రొటోకాల్ ఆఫీసులో పోలీసు సిబ్బంది సమాచారం ఇవ్వకుండా కొండపైకి వాహనాలు ఎలా పంపుతున్నారంటూ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని ప్రశ్నించారు. తప్పనిసరిగా ఏ విభాగం అధికారులైనా అమ్మవారి దర్శనానికి వాహనాల్లో వస్తే ప్రొటోకాల్ కార్యాలయంలో వివరాలు తెలపాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఓమిని, టవేరా వాహనాలు ఇకపై కొండపైకి రాకపోకలు సాగిస్తే ఆ డ్రైవర్లతో పాటు విధుల్లో ఉన్న సిబ్బందిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జిల్లా ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

వన్‌టౌన్, ఆగస్టు 26: జిల్లా ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఆర్‌యూటీఏ) కార్యవర్గానికి జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం మౌలానా అజాద్ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగాయి. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్. ఇమాం బాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఇక్బాల్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ అస్తర్ రుషది, జిల్లా కోశాధికారిగా సయ్యద్ హఫీజ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా అమీరున్నీసా, వైస్ ప్రెసిడెంట్‌గా రజియా సుల్తానా, అదనపు జనరల్ సెక్రటరీగా ఎం.సుల్తానా, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముస్తాక్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ బ్యాగ్ లాగ్ పోస్టులను జనరల్ పోస్టులుగా మార్చు చేసి ఖాళీగా ఉన్న అన్ని కేటగిరి ఉర్దూ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉర్దూ స్పెషల్ డీఎస్సీకి ఉత్తర్వులివ్వాలని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరుతున్నట్టు నేతలు తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అధ్యాపక అసోసియేషన్ అధ్యక్షుడు హఫీజ్ అహ్మద్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో ఉర్దూ లెక్చరర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. హైస్కూళ్ల అంశాలపై ఎండీ రియాజుద్దీన్ బాషా, ఎండీ హుస్సేన్, ఎండీ నయీం అహ్మద్, ఇర్ఫాన్ పాషా ప్రసంగించారు.



కోచ్‌లు, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

ఆరోగ్యకరమైన జీవనశైలికి కంకణబద్ధులు కావాలి: డీఎస్‌డీవో అజీజ్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 26: ఫిట్ ఇండియా సాధనకు, ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రతిరోజూ 30 నిమిషాలు కేటాయించి ఇరుగుపొరుగు వారిని ఫిట్‌గా ఉండేలా చూస్తానని క్రీడాకారులు, కోచ్‌లు ఐజీఎం స్టేడియంలో ప్రతినబూనారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో డీఎస్‌డీవో ఎస్‌ఏ అజీజ్ సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్యానికి సమయం కేటాయించడంతో ఫిట్నెస్ ఎక్సర్‌సైజులు, యోగా వంటి వాటితో సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని అజీజ్ కోరారు. జిల్లా కోచ్‌లు పి.రవికుమార్, జగదీష్, ఇస్సాకు, స్వామి, సంతోష్, భాస్కర్, రామాంజనేయులు, ముంతాజ్ పాల్గొన్నారు.



పత్రాన్ని అందుకుంటున్న హిమన్షు ప్రియదర్శిని

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

● ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో గణేష్ కుమార్

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 26: రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో జి.గణేష్ కుమార్ అన్నారు. రాష్ట్రంలోని 5వేల మంది యువతకు సాధికారత కల్పించేందుకు హిందుస్థాన్ కోకోకోలా కంపెనీతో ఏపీఎస్ఎస్‌డీసీ సోమవారం భాగస్వామ్యం చేసుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాన్ని చీఫ్ పబ్లిక్ అఫైర్స్, కమ్యూనికేషన్స్ అండ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ హిమన్షు ప్రియదర్శినికి సంస్థ ప్రతినిధులు వారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్, హిమన్షు ప్రియదర్శిని మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలోని యువకులకు అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయాలనే భాగస్వామ్య లక్ష్యమన్నారు.

జాతీయ రహదారిపై మురుగు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26: డ్రెయినేజీలో పారాల్సిన మురుగు జాతీయ రహదారిపైకి వస్తోంది. డ్రెయినేజీ కన్నా రోడ్డు పల్లంగా ఉండటంతో ఇబ్రహీం పట్నం-ఛత్తీస్‌గఢ్ 30వ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలోని నారాయణ హోటల్ ఎదుట డ్రెయినేజీలోని మురుగు రహదారిపైకి వస్తోంది. నెలల తరబడి రోడ్డుపై మురుగు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండపల్లి బి.కాలనీ వద్ద డ్రెయినేజీలోని నీరు జాతీయ రహదారిపైన పారుతోంది. అధికారులు సమస్యలు పరిష్కరించాలని స్థానికులుకోరుతున్నారు.





ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో నారాయణ హోటల్ వద్ద, కొండపల్లి బి.కాలనీ వద్ద జాతీయ రహదారిపైన పారుతున్న మురుగు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి, అసెంబ్లీ స్పీకర్ తదితరులు

పీవీజీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్
- గత పాలకులు దేవుడినీ కట్టడి చేయాలనుకున్నారు: అశోక్ గజపతి
- 'స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా' పుస్తకావిష్కరణ

విజయనగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పీవీజీ రాజు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు అన్నారు. విజయనగరం చివరి మహారాజు పీవీజీ రాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం విజయనగరం కోటలో 'స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామ్మోహననాయుడు మాట్లాడుతూ వందలాది ఎకరాలతోపాటు, చివరికి తాను నివసించే కోటను సైతం విద్యా సంస్థలకు దానం ఇచ్చిన పీవీజీ రాజు మహనీయుడు అన్నారు. ఆయన కుమారుడైన అశోక్ గజపతిరాజు సామాన్య జీవితం గడపటం స్ఫూర్తిదాయకమన్నారు. అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ గత పాలకులు మాన్సస్‌ను ముంచేద్దామనుకున్నారని, దేవుడి దయవల్ల విద్యార్థులకు ఉపయోగ పడే విద్యాసంస్థ బతికి బయట పడిందన్నారు. గత ఐదేళ్లలో ప్రజలనే కాదు దేవుడిని కూడా కట్టడి చేయాలని చూశారన్నారు. 108 దేవాలయాలకు ధర్మకర్త అయిన తనపై కూడా కేసులు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, భరత్, సీఎం రమేశ్‌తోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

కశ్మీర్‌ను ఢిల్లీ నుంచి పాలించడమేమిటి?

- రాష్ట్ర హోదాను వెంటనే పునరుద్ధరించాలి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 26: జమ్మూ-కశ్మీర్‌ను ఢిల్లీ నుంచి పాలించడంలో అర్థం లేదని కాంగ్రెస్ నాయకుడు, విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దీన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం సరికాదని, వెంటనే రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండు చేశారు. గత వారం జమ్మూ-కశ్మీర్‌లో పర్యటించిన ఆయన శ్రీనగర్‌లో అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సంభాషణల వీడియో సోమవారం విడుదలయింది. జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను రద్దు చేయడం తమకెవరికీ నచ్చలేదని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానిని విమర్శిస్తూ "మోదీతో వచ్చిన సమస్య ఏమిటంటే ఆయన ఎవరి మాటా వినరు. తప్పని చెప్పినా ఒప్పుకోరు. ఆయన చెప్పేదే నిజమని నమ్ముతారు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హోదా ఉంటేనే నిజమైన ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో ఈ అంశంపై చర్చ జరగాలన్నారు. కాగా, రాహుల్ ఎవరితో ముచ్చటించినా పెళ్లెప్పుడంటూ వారు అడగడం ఇటీవల కాలంలో సర్వసాధారణంగా మారింది. కశ్మీరీ విద్యార్థినులు కూడా ఆ 54 ఏళ్ల కాంగ్రెస్ నేతను ఇదే ప్రశ్న వేశారు. "20-30 ఏళ్లుగా ఈ ఒత్తిడిని ఎదుర్కొంటున్నా" అంటూ ఆయన నవ్వుతూ సమాధానం ఇచ్చారు. "ఏమైనా ప్లాన్లు ఉన్నాయా?" అని వారు మళ్లీ అడిగారు. "ప్లాన్లు ఏమీ లేవుగానీ...ఒక వేళ జరిగితే..." అంటూ మధ్యలోనే ఆపేశారు. "అప్పుడు తప్పకుండా మమ్మల్ని పిలవండి" అని వారంతా కోరారు. "తప్పకుండా" అని రాహుల్ సమాధానం ఇవ్వడంతో అందరూ కలిసి గట్టిగా నవ్వేశారు.

25 మంది నక్సలైట్ల లొంగుబాటు

- వారిలో ఐదుగురి తలలపై రూ. 28 లక్షల రివార్డు

బీజాపూర్/చర్ల, ఆగస్టు26: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో సోమవారం 25మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఐదుగురి తలలపై భారీస్థాయిలో రూ.28 లక్షల నగదు రివార్డు ఉన్నట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. లొంగిపోయిన వారిలో శాంబాటి మధ్కం (23), జ్యోతిపూనెం (27)తోపాటు మహేశ్ తేలం ఉన్నారని, వారి ఒక్కొక్కరి తలపై రూ.8లక్షల నగదు రివార్డు ఉందన్నారు. 2012 నుంచి ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న శాంబాటి మధ్కం 2020, 2021లో జరిగిన మింపా, టేకులగూడెం దాడుల్లో కీలక పాత్ర పోషించినట్టు చెప్పారు. ఆ దాడుల్లో 39మంది పోలీసులు అమరులైనట్లు తెలిపారు. బీజాపూర్ జిల్లా పిడియాలో ఈ ఏడాది మేనెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో జ్యోతి, మహేశ్ పాల్గొన్నట్లు తెలిపారు. మావోయిస్టు భావజాలం, ఉద్యమ నేతలు దౌర్జన్యాలపట్ల నిరాశతోపాటు ఇటీవల పోలీసులు ప్రవేశపెట్టిన లాల్‌వర్రాట్, పునరావాసం పథకాలకు ఆకర్షితులై వారు లొంగిపోయినట్లు చెప్పారు. బీజాపూర్ జిల్లాలో ఇప్పటివరకు 170మంది నక్సలైట్లు లొంగిపోగా, 346 మంది అరెస్టయినట్లు ఎస్పీ తెలిపారు. కాగా, ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఛత్తీస్‌గఢ్ ఖైరంగఢ్ జిల్లాకు చెందిన ఓ యువకుడిని మావోయిస్టులు హత్య చేశారు.

హైదరాబాద్ కిమ్స్‌లో నాందేడ్ ఎంపీ మృతి

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మహారాష్ట్ర నాందేడ్ లోక్‌సభ ఎంపీ వసంతరావ్ చవాన్ (70) సోమవారం కన్నుమూశారు. శ్వాసకోస, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న ఆయన పదిరోజులుగా హైదరాబాద్ గచ్చిబౌలిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచినట్లు డాక్టర్లు ప్రకటించారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆసుపత్రిలో చవాన్ పార్థివదేహానికి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబసభ్యులు చవాన్ పార్థివదేహాన్ని నాందేడ్‌కు తీసుకెళ్లారు. చవాన్ మృతిపట్ల కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

అంబులెన్స్‌లోనే ప్రాణం పోయింది!

- అనంత ఆస్పత్రి ఆవరణలో ఘటన



మంత్రి చుట్టూ విద్యార్థులు, బాధితులు గుమిగూడటంతో అత్యవసర విభాగం వద్ద రద్దీ



ఆర్డీటీ అంబులెన్స్‌లో మృతిచెందిన వెంగముని, విలపిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 26: అనంతపురం జిల్లా సర్వజన వైద్యశాలలో ఓ వ్యక్తి అంబులెన్సులోనే కన్నుమూశాడు. వైద్యులు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాలివీ.. జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి సవిత.. సోమవారం రాత్రి ఆస్పత్రికి వచ్చారు. ఇదే సమయంలో శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన వెంగముని(45) ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ.. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు అంబులెన్సులో వచ్చాడు. అత్యవసర విభాగం వద్ద మంత్రి రాక కారణంగా రద్దీ ఏర్పడడం, వైద్యులందరూ మంత్రి వద్ద ఉండటం, అర్థ గంటసేపు వరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో అంబులెన్స్‌లో ఉన్న వెంగముని మృతి చెందాడు. మంత్రి సవిత, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు ఒకేసారి ఆస్పత్రికి రావడంతో రద్దీ ఏర్పడింది. వీరి రాకకోసం విద్యార్థి మృతదేహాన్ని మార్చురీకి తరలించకుండా అత్యవసర విభాగంలోనే ఉంచారు. వెంగముని మృతికి ఇదే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. సకాలంలో ఆస్పత్రిలోకి తీసుకెళ్లి చికిత్స అందించి ఉంటే బతికేవాడని వారు కన్నీరుమున్నీరయ్యారు.

నత్తనడకన 'ఆయుష్మాన్ భారత్'

- రాష్ట్రంలో ఐదు శాతం కూడా పంపిణీ కాని పథకం కార్డులు
- ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసిన నాటి వైసీపీ సర్కార్
- కూటమి సర్కార్ దృష్టి సారిస్తే 60 లక్షల కుటుంబాలకు మేలు

Ayushman Bharat Yojana

గుంటూరు (మెడికల్)

పేదల ఆరోగ్య బీమా కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం రాష్ట్రంలో బాలారిష్టాలు ఎదుర్కొంటోంది. ఆరేళ్ల కిందట కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ 'భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన' (పీఎంజేఏవై) పేరిట ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో లబ్ధిదారులకు ఏడాదిలో రూ.5 లక్షల విలువైన వైద్యసేవలు ఉచితంగా లభిస్తాయి. ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పేద రోగులు ఉచితంగా వైద్యసేవలను పొందవచ్చు. చికిత్సకు అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. పథకంను ప్రారంభించి ఆరేళ్లు అయినప్పటికీ రాష్ట్రంలో ఐదు శాతం లబ్ధిదారులకు కూడా ఇంకా ఐడీ కార్డులను అందజేయలేదు.

ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్న జగన్ సర్కార్..

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా నాటి వైసీపీ సర్కార్ ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌కు, రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందనే భయంతోనే నాటి జగన్ సర్కార్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలుకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి ఆయుష్మాన్ భారత్‌ను తొక్కిపట్టినట్లు విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక కేంద్రమే పూర్తి చేసి డేటాను రాష్ట్రానికి పంపినా, సచివాలయ వలంటీర్లతో ఈకేవైసీ చేయించి కార్డులు అందజేయాల్సిన జగన్ సర్కార్ ఆ పని జరగకుండా అడ్డుపడింది. ఆయుష్మాన్ భారత్ పథకంలో లబ్ధిదారులతో ఈకేవైసీ చేయించేందుకు వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీని వలంటీర్లకే ఇచ్చారు. జగన్ సర్కార్ నుంచి మౌఖికంగా అందిన ఆదేశాలతో వలంటీర్లు ఉద్దేశపూర్వకంగా ఉదాసీనంగా వ్యవహరించారు. ఫలితంగా లబ్ధిదారుల్లో అత్యధిక మందికి నేటికీ కార్డులు అందక విలువైన వైద్యసేవలు కోల్పోతున్నారు.

ఈకేవైసీ 81 శాతం పూర్తయినా..

తాజాగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం...రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం కింద 61.67 లక్షల కుటుంబాలు, 1.95కోట్ల మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఇప్పటికీ వీరిలో 1,56,78,383 మందికి ఈకేవైసీ అప్‌డేట్ చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో ఇది 80.64 శాతం. మరో 37,64,485 మంది లబ్ధిదారుల ఈకేవైసీ(19.36 శాతం) మాత్రమే చేయించాల్సి ఉంది. ఏలూరు జిల్లా(102.65 శాతం), వైఎస్ఆర్ జిల్లా (101.82 శాతం), శ్రీకాకుళం(99.50 శాతం), తూర్పు గోదావరి (95.07 శాతం), పొట్టిశ్రీరాములు నెల్లూరు(93.41 శాతం), అనంతపురం(91.77 శాతం), తిరుపతి(91.72 శాతం) ఈకేవైసీ పూర్తి చేసినట్లు ప్రకటించారు. మిగిలిన జిల్లాలు కూడా సగటున 80 శాతం వరకు పూర్తిచేసినట్లు తెలిపారు. అయితే, లబ్ధిదారులకు ఐడీకార్డుల పంపిణీలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు.

గుంటూరు జిల్లాలో 400 కార్డులే పంపిణీ..

రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాలో 28,176 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు మంజూరవగా, లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 4,234 కార్డులను మాత్రమే జారీ చేశారు. ఇందులోనూ కనీసం 400 కార్డులు కూడా పంపిణీ జరిగిన దాఖలాలు లేవు. పెదకాకానిలో 1,368 కార్డులకుగాను కేవలం 13, తాడేపల్లిలో 648 కార్డులకు 12, గుంటూరు రూరల్‌లో 648 కార్డులకు 19, కాకుమానులో 936 కార్డులకు 33, దుగ్గిరాలలో 1,224 కార్డులకు 46, మంగళగిరిలో 1,512 కార్డులకు 67, పొన్నూరులో 1,440 కార్డులకు 59 మాత్రమే లబ్ధిదారులకు అందజేసినట్లు అధికారికంగా ప్రకటించినా, క్షేత్రస్థాయిలో అవి కూడా సమక్రమంగా అందలేదని తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. బీజేపీకి చెందిన సత్యకుమార్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నందున ఈ విషయంపై దృష్టి సారిస్తే లక్షలాది నిరుపేద కుటుంబాలకు మేలు జరిగే అవకాశం ఉంది.

దేవుడి ఆస్తులపై అలసత్వం..!



ఆక్రమణలు పట్టించుకోని అధికారులు

- దేవదాయ శాఖలో అడుగడుగునా నిర్లక్ష్యం
- మంత్రి హెచ్చరించినా మారని అధికారులు
- ఆక్రమణదారులకు నోటీసులు కూడా ఇవ్వని వైనం
- ప్రభుత్వం దృష్టిసారిస్తేనే దేవుడి ఆస్తులకు రక్షణ

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దేవుడి ఆస్తులకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల వేలాది ఎకరాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అలాగే షాపుల లీజుల రూపంలోనూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. దేవదాయ శాఖ భూములు, షాపుల్లో ఆక్రమణలను తొలగించడంలో కమిషనర్ కార్యాలయం, జిల్లాల అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ముఖ్యంగా మాన్సాస్ ట్రస్ట్, హథీరామ్ మఠం భూములు, గవిమఠం స్థలాలు, సదావర్తి భూములు ఏళ్ల తరబడి ఆక్రమణకు గురయ్యాయి. వీటితో పాటు జిల్లాల్లో చాలా దేవాలయాల భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంవీటిపై చర్యలు తీసుకోవడం లేదు. అధికారులకు గుర్తొచ్చినప్పుడల్లా తూతూ మంత్రంగా ఒక టెలికాన్ఫరెన్స్ లేదా వీడియో కాన్ఫరెన్స్ పెడుతున్నారు తప్ప ఆక్రమణలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. దీంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు సరికదా మరింత పెరుగుతున్నాయి. కమిషనరేట్ నిర్లక్ష్యంగా ఉండడంలో జిల్లాల్లో డిప్యూటీ కమిషనర్లు, దేవదాయ శాఖ అధికారులు కూడా వీటిని పట్టించుకోవడం లేదు. దీనికోసం ప్రత్యేకంగా జీవో 60ని కూడా విడుదల చేశారు. కానీ, ఆక్రమణలను తొలగించడంలో దేవదాయ శాఖ అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. రెవెన్యూ, సర్వే, పోలీస్ శాఖలు సహకరించడం లేదని అనేక సార్లు కమిషనరేట్ దృష్టికి వచ్చింది. జిల్లా దేవదాయ శాఖ అధికారులు ఈ జీవో ఆధారంగా ఇంటర్ డిపార్ట్‌మెంట్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. దానికి జిల్లా కలెక్టర్‌ను ఛైర్మన్‌గా నియమించాలి. కలెక్టర్ అధ్యక్షతన ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి దేవదాయ శాఖ భూముల ఆక్రమణలపై చర్చించడంతో పాటు వాటిని తొలగించే ప్రయత్నం చేయాలి. ఇప్పటి వరకూ దేవదాయ శాఖ కార్యాలయం కానీ, జిల్లా అధికారులు కానీ ఈ దిశగా చర్యలు తీసుకోలేదు. ఒక్క జిల్లాలో కూడా ఈ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జరగలేదంటే దేవదాయ శాఖ ఎంత శ్రద్ధగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంపై ఇటీవల దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి కూడా కొంత సీరియస్ అయ్యారు. కేవలం దేవదాయ శాఖ ఆర్థిక వ్యవహారాలు చూసుకోవడానికి డిప్యూటీ కమిషనర్లు, జిల్లా దేవదాయశాఖ అధికారులు ఎందుకని గట్టిగానే ప్రశ్నించారు. అయినా అధికారుల్లో చలనం రావడం లేదు. వారు తమ జేబులు నింపుకోవడానికి పెట్టే శ్రద్ధ దేవదాయ శాఖ ఆస్తులను కాపాడడంపై పెట్టడం లేదు. శుక్రవారం దీనిపై మరోసారి కాన్ఫరెన్స్ పెట్టగా.. జీవో నంబరు 60ని ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని దేవదాయ శాఖ కమిషనర్ అధికారులను ప్రశ్నించారు. అసలు కలెక్టర్లను కలిసి వివరించారా, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. అనే వివరాలతో వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నోటీసులు ఇవ్వడం లేదు..

ఏదైనా జిల్లాల్లో దేవదాయ శాఖ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని తెలిస్తే వెంటనే అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలి. దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదులు వస్తే, వాటిని వెంటనే జిల్లా అధికారులకు పంపించాలి. కానీ.. దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం అలస్యానికి, నిర్లక్ష్యానికి మారుపేరుగా మారిపోయింది. జిల్లా అధికారులు మరింత దారుణంగా తయారయ్యారు. ఆక్రమణదారుడు దేవదాయ శాఖ భూములు ఆక్రమించుకుని అందులో వ్యవసాయం చేసినా లేదంటే ఏదైనా నిర్మాణం చేపట్టినా అధికారులు ఆరు నెలల తర్వాత స్పందిస్తారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఆ తర్వాత ఆ భూమిని ఖాళీ చేయించడానికి ఏళ్ల సమయం పడుతుంది. పైగా కోర్టు ఖర్చుల నిమిత్తం లక్షల్లో దేవదాయశాఖ నిధులు వృథా అవుతున్నాయి. ముందే స్పందించి వెంటనే నోటీసులు జారీచేస్తే ఆక్రమణలు చాలా వరకూ తగ్గుతాయి. మరోవైపు ఆక్రమణలు ఎక్కువగా ఉన్న చోట దేవదాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రహరీ గోడలు నిర్మించడం లేదా భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తే తప్ప దేవదాయ శాఖ ఆస్తులకు రక్షణ ఉండే పరిస్థితి లేదు.

ఖర్గే కుటుంబ సభ్యులు ఏరో స్పేస్ పారిశ్రామికవేత్తలా?

- భూముల కేటాయింపుపై బీజేపీ ఎంపీ లెహర్‌సింగ్ ఆగ్రహం
- నిబంధనల మేరకే కేటాయింపులు: మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ ఏరో స్పేస్ పార్క్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్టుకు ఐదు ఎకరాల భూమిని కేటాయించడం పట్ల బీజేపీ రాజ్యసభ సభ్యుడు లెహర్ సింగ్ సిరోయ మండిపడ్డారు. ఖర్గే కుటుంబానికి చెందిన సిద్దార్థ విహార ట్రస్టుకు కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) భూమి మంజూరు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో ఐదు ఎకరాలను ఎస్సీ కోటాలో ఈ ట్రస్టుకు ఎలా కేటాయించారని ఆదివారం సోషల్ మీడియా ద్వారా అభ్యంతరం వ్యక్తంచేశారు. ఖర్గే కుటుంబికులు ఏరోస్పేస్ రంగంలో ఎప్పుడు పారిశ్రామికవేత్తలు అయ్యారని ప్రశ్నించారు. బెంగళూరు సమీపంలో అత్యంత విలువైన ప్రాంతాల్లో భూమి మంజూరు చేశారని అన్నారు. ట్రస్టులో మల్లికార్జున ఖర్గే, ఆయన భార్య రాధాబాయి, అల్లుడు రాధాకృష్ణ, కుమారుడు, రాష్ట్ర మంత్రి ప్రియాంక ఖర్గే, మరో కుమారుడు రాహుల్ ఖర్గే సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అయితే.. భూముల కేటాయింపును రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ సమర్థించుకున్నారు. సిద్దార్థ విహార ట్రస్టుకు నిబంధనలకు అనుగుణంగానే స్థలం కేటాయించామని అన్నారు. బెంగళూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అక్కడ పరిశోధనలు, శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు భూమి కేటాయించామని తెలిపారు. రాహుల్ ఖర్గే ఐఐటీ చదివారని, వారి కుటుంబం విద్యారంగంలో ఉందన్నారు. పరిశోధనా కేంద్రాలకు అనుకూలంగా ఉండాలనే ఆ భూమిని కేటాయించామని తెలిపారు. గతంలో బీజేపీ ప్రభుత్వం చాణక్య యూనివర్సిటీకి పారిశ్రామికవాడలో కేవలం రూ.50 కోట్లకు 116 ఎకరాల భూమిని కేటాయించిందని, దీనిని ఏ విధంగా చూడాలని ప్రశ్నించారు.

జమ్మూలో బీజేపీ అభ్యర్థులపై రగడ

- 15 మందితో 'తొలి దశ' జాబితా
- కాంగ్రెస్-ఎన్‌సీ సీట్ల పంపకం ఖరారు
- ఎన్‌సీకి 51, కాంగ్రెస్‌కు 32 సీట్లు
- మరో 5 చోట్ల స్నేహపూర్వక పోటీ..



ఫరూక్ అబ్దుల్లాతో కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 26: కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. సోమవారం 44 మందితో బీజేపీ తొలి జాబితాను ప్రకటించింది. అయితే పలువురు కీలక నేతలకు టికెట్లు దక్కకపోవడంతో కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టారు. దీంతో కొద్ది గంటల్లోనే ఆ జాబితాను బీజేపీ ఉపసంహరించుకుంది. చివరకు కేవలం తొలిదశ ఎన్నికలు జరిగే అసెంబ్లీ స్థానాల కోసం 15 మందితో ఓ జాబితాను మళ్లీ ప్రకటించింది. బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన నిరసనల్లో ఓ కార్యకర్త మాట్లాడుతూ.. 'మాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి బీజేపీతోనే ఉన్నాం. జమ్మూ నార్త్‌లో ఒమీ ఖజూరియా అందరికీ తెలిసిన వ్యక్తి.. ఆయన్ను కాదని కాంగ్రెస్ నుంచి పార్టీలో చేరిన శ్యామ్‌లాల్ శర్మకు టికెట్ ఇచ్చారు. ఖజూరియాకు టికెట్ ఇస్తేనే బీజేపీలో ఉంటాం' అని తేల్చి చెప్పారు. ఇటు కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య సీట్ల పంపకం ఖరారైంది. మొత్తం 90 స్థానాల్లో ఎన్‌సీ 51, కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. మరో 5 చోట్ల ఇరు పార్టీలు స్నేహ పూర్వక పోటీకి దిగాలని.. అలాగే సీపీఎంకు ఒక సీటు, పాంథర్స్ పార్టీకి ఒక సీటు ఇవ్వాలని నిర్ణయించాయి. సీట్ల పంపకాలపై నెలకొన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు ఎన్‌సీ నేతలతో కాంగ్రెస్ సీనియర్ నేతలు జరిపిన చర్చలు ఫలించాయి. ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా నివాసాలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మరో నేత సల్మాన్ ఖుర్షీద్, జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భరత్ సోలంకి వెళ్లి సుదీర్ఘ మంతనాలు జరిపారు.

లద్దాఖ్‌లో 5 కొత్త జిల్లాలు..

కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో 5 కొత్త జిల్లాల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 'ప్రధాని నరేంద్ర మోదీ విజన్ మేరకు లద్దాఖ్ అభివృద్ధికి 5 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేసే జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ జిల్లాలతో పాలన మరింత పటిష్ఠమవుతుంది. ప్రతీ ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందుతాయి' అని షా 'ఎక్స్'లో పేర్కొన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. 'లద్దాఖ్ ప్రజల శ్రేయస్సు, మెరుగైన పాలనకు ఇదో ముందడుగు. కొత్త జిల్లాలతో ప్రజలకు అవకాశాలు, సేవలు మరింత చేరువవుతాయి' అని వెల్లడించారు.

యువకుడి కడుపులో కత్తి, నెయిల్ కట్టర్, కీచెయిన్...

- సర్జరీ చేసి బయటికి తీసిన బిహార్ వైద్యులు

మోతిహరి, బిహార్, ఆగస్టు 26: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న బిహార్‌కి చెందిన ఓ యువకుడు... కొన్నాళ్లుగా లోహ వస్తువులను మింగటం అలవాటు చేసుకున్నాడు. తీరా తీవ్ర కడుపునొప్పి వచ్చి ఆస్పత్రిలో చేరడంతో... అతని కడుపులో ఓ కత్తి, నెయిల్ కట్టర్లు, తాళం చెవులు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు సర్జరి చేసి వాటిని బయటికి తీశారు. ఈ ఘటన బిహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లాలో జరిగింది. కొన్ని రోజుల క్రితం 22 ఏళ్ల యువకుడు తీవ్రమైన కడుపు నొప్పితో మోతిహరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. ఎక్స్‌రే తీసిన వైద్యులు అతని కడుపులో పలు లోహ వస్తువులున్నట్లు గుర్తించారు. దీంతో ఆదివారం సర్జరీ చేసి వాటిని తొలగించారు. "ఎక్స్‌రే రిపోర్టు ద్వారా అతని కడుపులో వస్తువులున్నట్లు తెలిసింది. ముందుగా ఒక కీచెయిన్ రింగ్‌ను తీసేశాం. తర్వాత రెండు తాళంచెవులు బయటపడ్డాయి. ఆ తర్వాత నాలుగు అంగుళాల పొడవున్న కత్తి, రెండు నెయిల్ కట్టర్లు వెలికితీశా"మని ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన డాక్టర్ అమిత్ కుమార్ వివరించారు. యువకుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, దానికి సంబంధించిన చికిత్సను తీసుకుంటున్నాడని వెల్లడించారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బీజేపీకి కొత్త నాయకత్వం అక్టోబరులో..?

హరియాణా, కశ్మీర్ ఎన్నికల తర్వాతే..

- సంఘ్ సన్నిహితుడికే అధ్యక్ష పదవి!
- ఈ సారి రాంమాధవ్‌కు కీలక బాధ్యతలు?

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీకి నూతన అధ్యక్షుడి నియామకంపై కసరత్తు దాదాపు పూర్తయింది. కానీ, హరియాణా, జమ్మూకశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతే బీజేపీ కొత్త నాయకత్వం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. సెప్టెంబరు 1 నుంచి 27 వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, అక్టోబరు మొదటివారంలో హరియాణా, కశ్మీర్ ఎన్నికల ప్రక్రియ పూర్తికానున్నాయి. జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడి నియామకంపై పార్టీ అగ్రనేతల కసరత్తు దాదాపు పూర్తయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాతే నూతన అధ్యక్షుడిని నియమిస్తారని తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా యూపీ డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్యను మోదీ, అమిత్ షా ప్రతిపాదించినప్పటికీ సంఘ్ నాయకత్వం తిరస్కరించినట్లు తెలిసింది. సంఘ్‌తో బలమైన సంబంధాలున్న నేతకే బీజేపీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని, ఈ సారి ఉత్తరాది నుంచి కాకుండా దక్షిణాది వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆరెస్సెస్ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే మధ్యేమార్గంగా మళ్లీ రాజ్‌నాథ్‌సింగ్ వంటి నేతకు అవకాశం ఇవ్వాలని, ఆయన మిత్ర పక్షాలతో కూడా స్నేహ సంబంధాలు నెలకొల్పగలరని మోదీ, అమిత్ షా సూచించినట్లు తెలిసింది. కాగా, గత కొన్నేళ్లుగా బీజేపీకి దూరం పెట్టిన ఆరెస్సెస్ నేత రాంమాధవ్‌ను మళ్లీ జమ్మూకశ్మీర్ ఇన్‌చార్జిగా నియమించడంపై రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్త టీంలో భాగంగా రాంమాధవ్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో బీజేపీకి సీట్ల సంఖ్య తగ్గిన తర్వాత పార్టీపై, ప్రభుత్వంపై ఆరెస్సెస్‌కు పట్టు పెరిగిందని.. అందులో భాగంగానే రాంమాధవ్‌కు ప్రాధాన్యం లభించిందని ఈ వర్గాలు పేర్కొంటున్నాయి.





రాష్ట్ర రాజధాని అమరావతిలోని జీఏడీ టవర్స్‌కు శంకుస్థాపన చేసిన శిలాఫలకం పైనున్న ఫొటో. గత ఐదేళ్ల కాలంలో ఇలా చిల్ల చెట్లతో, ముళ్ల పొదలతో మునిగిపోయిన ఈ శిలాఫలకం ప్రస్తుతం చేపట్టిన జంగిల్ క్లియరెన్స్‌తో ఇలా కనిపిస్తోంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 27 ఆగస్టు 2024

గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎన్జీ రంగా వర్సిటీలో పీజీ పీహెచ్‌డీ



క్యాంపస్‌లు

- అగ్రికల్చరల్‌కాలేజ్(బాపట్ల/నైరా/మహానంది)
- ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి
- అడ్వాన్స్‌డ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్, లాం, గుంటూరు
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, తిరుపతి
- డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బాపట్ల

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎమ్మెస్సీ(అగ్రికల్చర్): ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 137 సీట్లు ఉన్నాయి. వీటిలో ప్లాంట్ సైన్సెస్ 45, ఫిజికల్ సైన్సెస్ 11, ప్లాంట్ బయోటెక్నాలజీ 12, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ 15, అగ్రానమీ 25, సోషల్ సైన్సెస్ 25, స్టాటిస్టికల్ సైన్సెస్ 4 సీట్లు ఉన్నాయి. అగ్రికల్చర్ విభాగంలో నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఎస్సీ(హార్టికల్చర్/సెరికల్చర్/ఫారెస్ట్రీ/సీఏ&బీఎం) పూర్తి చేసినవారు కూడా అర్హులే.

ఎమ్మెస్సీ(కమ్యూనిటీ సైన్స్): మొత్తం 14 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ 6, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్ 3, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జ్యూమర్ సైన్స్ 3, ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ 2 సీట్లు ఉన్నాయి. నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్సీ(హోంసైన్స్)/బీఎస్సీ ఆనర్స్(హోం సైన్స్/కమ్యూనిటీ సైన్స్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): మొత్తం 14 సీట్లు ఉన్నాయి. వీటిలో సాయిల్ అండ్ వాటర్ ఇంజనీరింగ్ 5, ప్రాసెసింగ్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్ 6, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్ 3 సీట్లు ఉన్నాయి. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో నాలుగేళ్ల బీటెక్/బీటెక్ ఆనర్స్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంటెక్(ఫుడ్ టెక్నాలజీ): ఈ ప్రోగ్రామ్‌లో 3 సీట్లు ఉన్నాయి. బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్ ఆనర్స్ ఫుడ్ టెక్నాలజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంబీఏ(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్): మొత్తం 18 సీట్లు ఉన్నాయి. నాలుగేళ్ల వ్యవధిగల(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్)/బీఎస్సీ(హార్టికల్చర్/ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/సీఏ అండ్ బీఎం)/(బీటెక్/బీటెక్ ఆనర్స్)(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ/బీహెచ్ఎస్సీ/బీసీఏస్సీ/బీటెక్ (డెయిరీ/ఫుడ్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

అగ్రికల్చర్: ఈ విభాగంలో మొత్తం 39 సీట్లు ఉన్నాయి. వీటిలో జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ 7, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 1, ప్లాంట్ పాథాలజీ 5, ఎంటమాలజీ 4, ప్లాంట్ ఫిజియాలజీ 2, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ 3, మైక్రోబయాలజీ 1, అగ్రానమీ 5, సాయిల్ సైన్స్ 3, అగ్రికల్చరల్ ఎకనామిక్స్ 3, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ 3, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ 2 సీట్లు ఉన్నాయి.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: ఇందులో సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్ 1, ప్రాసెసింగ్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్ 1, ఫాం మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్ 2 చొప్పున మొత్తం 4 సీట్లు ఉన్నాయి.

కమ్యూనిటీ సైన్స్: ఇందులో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ 1, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్ 1, ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ 2 చొప్పున నాలుగు సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక వివరాలు

- ఐకార్ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)/ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(ఏఐసీఈ) స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏఐఈఈఏ స్కోర్‌కు 70%, అకడమిక్ ప్రతిభకు 30% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం అకడమిక్ ప్రతిభకు 30%; ఏఐఈఈఏ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 70% వెయిటేజీ ఇస్తారు.
- డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ మార్కులకు 10%, పీజీ మార్కులకు 30%, ఐకార్ ఏఐసీఈ స్కోర్‌కు 50%, ఇంటర్వ్యూకి 10% వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** సెప్టెంబరు 18 నుంచి 23 వరకు
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** సెప్టెంబరు 24
- **పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు:** సెప్టెంబరు 24 నుంచి 27 వరకు
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** అక్టోబరు 8
- **ఫిజికల్ కౌన్సెలింగ్:** అక్టోబరు 9
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీ డిప్లొమా



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- పారా మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ(పీజీడీఎన్ఎంటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 8 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(ఏదేని సైన్స్ సబ్జెక్ట్‌లు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 60 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. బయలాజికల్ సైన్సెస్ నుంచి 20 మార్కులకు; ఫిజికల్ సైన్సెస్ నుంచి 20 మార్కులకు; కమ్యూనిటీ మెడిసిన్, బయో స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్సెస్ జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 18 నుంచి
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ తేదీ:** అక్టోబరు 23
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 25
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** అక్టోబరు 29
- **కౌన్సెలింగ్ లెటర్స్ విడుదల:** నవంబరు 1
- **కౌన్సెలింగ్ తేదీ:** నవంబరు 5
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 11 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్-500082.
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.


ముఖ్య సమాచారం

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

ఉమ్మడి పౌరస్మృతి

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

'ఒకే దేశం - ఒకే చట్టం'



(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

★ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దిన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

★ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

★ ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధాన కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

★ **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.


★ వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసీ(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదే విధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

★ ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంత మంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

లిటిల్స్



దుప్పి తెలివి

అనగనగా ఒక అడవిలో రాకీ అనే దుప్పి ఉండేది. అది చాలా తెలివైనది మరియు చురుకైనది. ఒక రోజు రాకీ ఆహారం కోసం వెతుక్కుంటూ చాలా దూరం పోయింది. అంతలోగా వర్షం రావడంతో దగ్గరలో కనిపించిన గుహలోకి వెళ్లి తల దాచుకుంది.

కాసేపయ్యాక గుహ బయటకు తొంగి చూస్తే, బయట ఒక పులి నించుని గుహవైపే చూస్తూ కనిపించింది. గుహ లోపల చీకటిగా ఉండటంతో తాను పులికి కనిపించే అవకాశం లేదని కొంత ధైర్యం తెచ్చుకున్న దుప్పి ఏదో ఒకలాగా అక్కడి నుండి బయట పడితేగానీ తన ప్రాణాలు దక్కవు అనుకున్నది. గుహ లోపలికి జరిగి, గంభీరంగా గొంతు మార్చి ఇలా అన్నది. మన ముగ్గురం పులిని వేటాడి తిని చాలా కాలమైంది ఈ సమయంలో పులి ఏదైనా కనపడితే, మన పంట పండినట్టే. అన్నట్టు పులి గుండె మాత్రం నేనే తింటాను, ఇప్పటికి తొంభై తొమ్మిది పులుల గుండెలు తిన్నాను. ఇవాళ వంద పూర్తి చేస్తాను' అన్నది. ఆ మాటలన్నీ గుహ బయట ఉండి విన్న పులి గుహ లోపల తనను వేటాడి తినగల పెద్ద జంతువు ఏదో ఉందనుకుని భయపడింది.

మరికొంత సేపటికి అక్కడికి ఒక తోడేలు వచ్చి, ఏమిటి అలా భయపడుతూ నించున్నావు అని అడిగింది, దానికి పులి జవాబు చెప్పే లోపలే గుహ లోపలనుండి దుప్పి మళ్లీ గొంతు మార్చి, 'మీరిద్దరూ ఇక్కడే ఉండండి ఇవాళ పులి దొరక్కపోతే ఒక తోడేలు దొరికినా మన ఆకలి తీరినట్టే' అన్నది. ఆ మాటలు వినగానే పులి, తోడేలు రెండూ కలసి అక్కడినుండి అడవిలోకి పరుగు తీశాయి. అలా తెలివైన దుప్పి రాకీ తన ఉపాయంతో ఆ రోజు పులి మరియు తోడేలు బారినుండి తన ప్రాణాలను కాపాడుకుంది.

10 తేడాలను కనిపెట్టండి





దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



ఒకేలా ఉన్న బొమ్మలు ఎన్ని?



డైలీ సుడోకు - 394

					5			
		6				1		8
	8				7		2	3
7	5				6			
2			9		8			6
			2				7	1
5	3		7				9	
6		2				8		
			3					

సుడోకు - 393 సమాధానం

1	6	4	3	2	5
5	2	3	1	6	4
3	1	6	5	4	2
4	5	2	6	3	1
6	4	1	2	5	3
2	3	5	4	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.